www.andhrajyothy.com
పేజీలు: 12
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 151
సోమవారం | 15-9-2025
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: నవమి రా.1.32 తదుపరి దశమి, నక్షత్రం: మృగశిర ఉ.7.32 తదుపరి ఆర్ద్ర, వర్జ్యం: మ.3.39-5.12, దుర్ముహూర్తం: మ.12.34-1.22, మ.2.59-3.48, అమృతఘడియలు: రా.09.05-రా.10.38, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.06, సూర్యాస్తమయం: సా.6.13
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


కుల్దీప్ యాదవ్

వార్.. వన్ సైడే

ఆసియా కప్ గ్రూప్ మ్యాచ్‌లో భారత్ చేతిలో పాకిస్థాన్ చిత్తు

- ఏడు వికెట్ల తేడాతో టీమిండియా ఘన విజయం
- బౌలింగ్‌లో అదరగొట్టిన కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, బుమ్రా
- బ్యాటింగ్‌లో సూర్యకుమార్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ మెరుపులు
- పాక్ క్రికెటర్లకు కరచాలనం ఇవ్వకుండా మైదానాన్ని వీడిన భారత ఆటగాళ్లు


అభిషేక్ శర్మ

పహల్గాం ఉగ్రదాడి మృతుల కుటుంబసభ్యులకు మేం అండగా ఉంటాం. వారికి మా సంఘీభావాన్ని తెలియజేస్తున్నాం. ఈ విజయాన్ని భారత సైన్యానికి అంకితం ఇస్తున్నాం.

- సూర్యకుమార్ యాదవ్, ఇండియా కెప్టెన్

పహల్గాంలో జరిగిన ఘోరాన్ని మరిచారా? ఆపరేషన్ సిందూర్‌కు అర్థం లేకుండా చేస్తారా? ఉగ్రదాడి నెత్తురు తడి ఆరకముందే శత్రు దేశంతో ఆటలా? పాకిస్థాన్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాల్సిందే..!! అంటూ దేశంలోని వివిధ వర్గాలు.. ముఖ్యంగా పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాల నుంచి ఎదురైన విమర్శలు, ఒత్తిడుల మధ్య ఆసియా కప్ గ్రూప్-ఏ మ్యాచ్‌లో పాక్‌తో తలపడిన భారత క్రికెట్ జట్టు సత్తా చాటింది. బౌలింగ్, బ్యాటింగ్‌లో సమష్టిగా రాణించి పాక్‌ను చిత్తు చేసింది. యుద్ధ రంగంలోనే కాక క్రికెట్ మైదానంలోనూ పాక్‌పై భారత్‌దే పైచేయి అని నిరూపించింది. దుబాయ్ వేదికగా ఆదివారం జరిగిన పోరులో పాక్ నిర్దేశించిన 128 పరుగుల లక్ష్యాన్ని 15.5 ఓవర్లలోనే ఛేదించింది. 131 పరుగులు చేసి ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ(13 బంతుల్లో 31) మెరుపు ఆరంభం ఇవ్వగా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (37 బంతుల్లో 47 నాటౌట్) ఓ భారీ సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించాడు. అయూబ్(3/35) మినహా పాక్ బౌలర్లంతా టీమిండియా బ్యాటర్ల ముందు తేలిపోయారు. భారత స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్ (3/18), అక్షర్(2/18)కి తోడు స్టార్ పేసర్ బుమ్రా(2/28) దెబ్బకు పాక్ నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 127 పరుగులు మాత్రమే చేయగలిగింది. మ్యాచ్ అనంతరం ప్రత్యర్థి ఆటగాళ్లకు కరచాలనం ఇవ్వకుండానే భారత ఆటగాళ్లు మైదానాన్ని వీడారు. 9

తీరు మారాలి!

నివేదికలు, లెక్కలు, సమీక్షలతోనే కలెక్టర్లు కుస్తీ

- ప్రభుత్వ ఆదేశాలతో వారంలో ఎక్కువ టైం వీటికే
- ప్రజాక్షేత్రంలో కనిపించని అభివృద్ధి ముద్ర
- ఇంకా మిథ్యగానే భూ సమస్యల పరిష్కారం
- క్షేత్రస్థాయి సిబ్బందికి దశ, దిశ కరువు
- పల్లె ముఖమే చూడని జిల్లా బాస్‌లు ఎందరో
- ప్రభుత్వం తీరు మారాలంటున్న నిపుణులు
- ప్రజాక్షేత్రంలో మమేకం కావడంతో పాటు పల్లెలు, పట్టణాల అభివృద్ధిపై దృష్టి అవసరం
- నేడు, రేపు జిల్లా కలెక్టర్ల సమావేశం


జాతీయ రహదారులు, ఆర్టీసీ అంశాలపై ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

నివేదికలు పంపాలని అమరావతి నుంచి కలెక్టర్లపై ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటోంది. నివేదికలు పంపించడంపైనే కలెక్టర్లు కష్టపడుతున్నారు. కొత్తగా, సొంతంగా పనిచేయడానికి వారికి సమయం దొరకడం లేదు. ఇక మండల, గ్రామస్థాయి సిబ్బందికి దశ, దిశ చూపడం.. వారి పనితీరును సమీక్షించే అవకాశం చాలా మందికి రావడం లేదు. ఈ పరిస్థితి ఇలా కొనసాగినంత కాలం.. అభివృద్ధి, అద్భుతాలు అన్నవి కేవలం కలెక్టర్లు పంపే నివేదికల్లోనే ఉంటాయి. ఈ పరిస్థితి మారాలంటే ఆచరణ సాధ్యంకాని నివేదికలు కోరడం ఆపేయాలి. పనికొచ్చే అంశాలపైనే నివేదికలు అడగాలి. అలాగే కలెక్టర్ల పనితీరును ప్రతి నాలుగు నెలలకోసారి సమీక్షిస్తుండాలి. గ్రామాలు, పట్టణాల సందర్శన, అభివృద్ధి కొలమానంగా వారి ప్రతిభను గుర్తించాలి. అప్పుడే పరిస్థితుల్లో మార్పు వస్తుంది.

- ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ పాలనాధిపతి అయితే... జిల్లాకు కలెక్టర్ సర్వోన్నతాధికారి. ముఖ్యమంత్రి రోజులో కనీసం నాలుగైదు సమావేశాలు-సమీక్షలు చేస్తున్నారు. వీలు చూసుకొని జిల్లాల పర్యటనలకు వెళ్లి నేరుగా ప్రజలను కలుస్తున్నారు. మరి 35-40 మండలాలుండే ఓ జిల్లా కలెక్టర్ పరిస్థితి ఎలా ఉందంటే.. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌లపై రోజువారీగా రివ్యూ మీటింగ్‌లు.. శాఖల వారీగా ప్రభుత్వానికి కలర్‌ఫుల్ పీపీటీలు, అభివృద్ధి లెక్కలు పంపించడం.. ఇంకా జీవీఏ లెక్కలు తయారు చేసి నివేదించడం.. జిల్లాలకు వీఐపీలు, ప్రభుత్వ

మిగతా 11వ పేజీలో...

ఆక్వా రైతును ఆదుకోండి

అమెరికా సుంకాలతో 25 వేల కోట్ల నష్టం

- వడ్డీలపై 240 రోజుల మారటోరియం విధించాలి
- 5 శాతం జీఎస్టీని తాత్కాలికంగా మినహాయించాలి
- ఉత్పత్తుల రవాణాకు దక్షిణాది నుంచి ప్రత్యేక రైళ్లు
- కేంద్ర మంత్రులకు సీఎం చంద్రబాబు లేఖలు 3

తిరుపతిలో అత్యాధునిక బస్‌స్టేషన్ నిర్మాణానికి నిర్ణయం 12


ఆదివారం తిరుపతిలో జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా. చిత్రంలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎంపీ పురందేశ్వరి తదితరులు

మహిళా శక్తికి జై

- వారి భాగస్వామ్యం లేకుండా ఏ దేశమూ అభివృద్ధి చెందలేదు
- ఆడబిడ్డల స్వావలంబనతోనే వృద్ధి
- అన్ని రంగాల్లోనూ వారికి సముచిత స్థానం
- మహిళా సాధికారత నిరంతర ప్రక్రియ
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉద్ఘాటన
- తిరుపతిలో జాతీయ మహిళా సాధికార కమిటీల తొలి సదస్సు ప్రారంభం

తిరుపతి/తిరుమల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళా శక్తి నానాటికీ పురోగమిస్తోందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. అనేక రంగాల్లో వారు తమ ప్రతిభను చాటుతున్నారని, ఆడబిడ్డలు విద్యావంతులై, స్వావలంబన సాధించినపుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అప్పుడే భారత్

మిగతా 11వ పేజీలో...

చెవిరెడ్డి లీలలు, వెంకటేశ్ విన్యాసాలపై..

నేడు మూడో చార్జిషీటు!



- మద్యం స్కాంలో వారిద్దరి బాగోతాన్ని కోర్టుకు వివరించనున్న సిట్
- రాజ్ కసిరెడ్డి నుంచి ముడుపుల సొమ్ము తీసుకుని వైసీపీ అభ్యర్థులకు పంపిణీ
- బాలాజీ కుమార్, నవీన్ పాత్రనూ పొందుపరిచే అవకాశం
- నారాయణస్వామి తదితరుల వాంగ్మూలాలు, నగదు డంప్‌లు, మనీ రూటింగ్ వివరాలు కూడా

అమరావతి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో జరిగిన రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణంలో మూడో చార్జిషీటు సిద్ధమైంది. ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) సోమవారం దానిని బెజవాడ ఏసీబీ కోర్టుకు సమర్పించే అవకాశాలు ఉన్నాయి. జూలై 19న ప్రాథమిక అభియోగ పత్రాన్ని దాఖలు చేసిన సిట్.. గత నెల 12న మరో అనుబంధ చార్జిషీటును కోర్టులో దాఖలు చేయడం తెలిసిందే. అందులో కోర్టు ప్రస్తావించిన చిన్న చిన్న పొరపాట్లను సరిచేసి సమర్పించింది. మొదటి చార్జిషీటులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేరు ప్రస్తావించిన సిట్.. రెండోదాంట్లో మరిన్ని కీలక విషయాలను కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. సోమవారం వేస్తున్న మరో అనుబంధ చార్జిషీటులో వైసీపీ ప్రధాన కార్యదర్శి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన సన్నిహిత వ్యాపార భాగస్వామి వెంకటేశ్‌నాయుడు, చెవిరెడ్డి వ్యక్తిగత సహాయకులు బాలాజీ కుమార్ యాదవ్(ఏ-35), ఎద్దల నవీన్ కృష్ణ(ఏ-36) పాత్రను వివరించనున్నట్లు తెలిసింది. మద్యం ముడుపుల తరలింపులో క్రియాశీల పాత్ర పోషించిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి(ఏ-38).. మద్యం సరఫరాదారుల నుంచి హైదరాబాద్‌లో రాజ్ కసిరెడ్డి (ఏ-1) వసూలు చేసిన సొమ్మును 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందే ఏపీలోకి తరలించడం ప్రారంభించారు. తన దగ్గర పనిచేసే వ్యక్తులు, అనుచరులు, గన్‌మెన్లు, డ్రైవర్ల ద్వారా కోట్లాది రూపాయలు తీసుకొచ్చారు. తాడేపల్లి ప్యాలె‌స్‌కు సమీపంలో డంప్ ఏర్పాటు చేసుకుని నాలుగు జిల్లాల్లోని వైసీపీ అభ్యర్థులకు

మిగతా 3వ పేజీలో...

 2

పాక్ ఉగ్రవాదులకు కాంగ్రెస్ దన్ను!

- భారత సైన్యానికి మాత్రం మద్దతివ్వలేదు
- జాతి వ్యతిరేకులు, చొరబాటుదార్లకు అండ
- ఓటుబ్యాంకు రాజకీయాలే ఆ పార్టీకి ముఖ్యం
- అసోం పర్యటనలో ప్రధాని మోదీ ఆగ్రహం
- శివభక్తుడిని.. హాలాహలం మింగగలను
- ప్రజలే నా యజమానులు.. దేవుళ్లు: మోదీ

నేడే మెగా డీఎస్సీ ఎంపిక జాబితాలు

- సుమారు 16 వేల మందికి ఉద్యోగాలు
- మిగిలిపోయిన పోస్టులు 300కు పైనే
- 19న అమరావతిలో మెగా డీఎస్సీ సభ
- 22 నుంచి 29 వరకు కొత్త టీచర్లకు శిక్షణ
- దసరా సెలవుల అనంతరం విధుల్లోకి! 3

కంటి సంరక్షణకు 'హెల్ప్'లైన్

99906 66872కు కాల్ చేస్తే దేశవ్యాప్తంగా ఉచిత సలహాలు, సూచనలు 2

అభివృద్ధి పథంలో ఏపీ



అంధకారం నుంచి వెలుగుల వైపు రాష్ట్రం

- గాడిలో పెడుతున్న కూటమి.. వైసీపీ హయాంలో అవినీతి, అరాచకం
- అసమర్థ పాలనతో అడుగంటిన అభివృద్ధి.. మోదీ సంస్కరణలతో దేశ ఆర్థికం బలోపేతం.. అమరావతికి అన్ని విధాలా సహకరిస్తాం 11
- చంద్రబాబు, పవన్ నేతృత్వం సూపర్.. 2047 నాటికి విశ్వగురుగా భారత్: జేపీ నడ్డా.. విశాఖలో 'సారథ్యం యాత్ర' ముగింపు సభ


చట్టసభల సభ్యులకూ 'నో వర్క్.. నో పే'!

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అయ్యన్న వినతి 11

ఐఏఎస్ X టీడీపీ మహిళా ఎంపీ!


శబరి
మిశ్రా

- కార్తికేయ మిశ్రా, శబరి మధ్య తీవ్ర వాగ్వాదం
- ఢిల్లీలో ఎంపీతో దురుసుగా మిశ్రా తీరు
- మర్యాదగా వ్యవహరించాలని శబరి ఘాటు హితవు
- మిశ్రా తీరుతో మనస్తాపం.. లోకేశ్‌కు ఫిర్యాదు 2


ఎన్టీఆర్ జిల్లాలోని కొండపల్లి కోట

కొండపల్లి సీమలో కాకతీయం

'కాకర్తి'ని గుర్తించే దిశగా చరిత్రకారుల అడుగులు

- ఆ వంశ ఆద్యుడు గుండన జన్మస్థలం 'కాకర్తి'
- నందిగామ మండలం మాగల్లు సమీపంలోని గ్రామం
- నేలకొండపల్లిలో దొరికిన రాగి శాసనాల్లో ఆధారాలు
- నాడు ఇక్కడ సామంతులుగా 'కాకతీయ గుండన'
- ఆపై ప్రబల శక్తిగా మారిన కాకతీయ వంశీయులు
- ఓరుగల్లు కేంద్రంగా ఘనమైన పాలన

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

కాకతీయుల మూలం ఎక్కడుంది? ఓరుగల్లు కేంద్రంగా తిరుగులేని పాలన సాగించిన రుద్రదేవుడు, గణపతి దేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్ర వంటి పరాక్రముల పూర్వీకుల అడుగు జాడలు ఎక్కడ మొదలయ్యాయి? కాకతీయులకు ఆదిగా నిర్ధారించిన 'కాకతీయ గుండన' ఎక్కడివాడు? ఈ ప్రశ్నలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. ఇటీవల లభించిన రాగి ఫలకాలపై లిఖించిన శాసనాలు, వాటిని పరిశోధించిన చరిత్రకారులు... దీనికి సమాధానం

మిగతా 12వ పేజీలో...

సీఎం పేరు వాడేస్తున్నారు

'పీఎం-సూర్యఘర్'లో కంపెనీల దొడ్డిదారి ప్రమోషన్



- చంద్రబాబుతో పాటు లోకేశ్ పేరూ
- ఎమ్మెల్యేలకు కంపెనీ ప్రతినిధుల ఫోన్లు
- ఎమ్మెల్యేల ఆఫీసు నుంచి అంటూ లబ్ధిదారులకు
- వంత పాడుతున్న కొందరు మెప్మా అధికారులు
- పెద్దల రెఫరెన్స్ ఉందని తప్పుడు ప్రచారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'మేం ఇంటిపై సోలార్ ప్యానళ్లు పెడతాం. అత్యంత నాణ్యమైన, వైవిధ్యమైన సోలార్ ప్యానల్ మాది. పీఎం-సూర్యఘర్ కింద మా కంపెనీ ప్యానల్‌నే తీసుకోండి'.. అంటూ ఓ కంపెనీ ప్రచారం చేస్తే ఎలా ఉంటుంది? బహుశా ఆ కంపెనీని ఎవరూ పట్టించుకోకపోవచ్చు! అదే.. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, మరో ఇద్దరు సీనియర్ మంత్రుల అండదండలున్నాయని, వారి ఆశీస్సులతోనే పీఎం-సూర్యఘర్ ప్రాజెక్టు చేస్తున్నామని ప్రచారం చేస్తే.. ఆ కంపెనీ సోలార్ ప్యానళ్లకు మంచి డిమాండ్ ఉంటుంది. ఊరువాడా వాటినే తీసుకుంటారు. సోలార్ ప్యానళ్ల వ్యాపారం కోసం కొన్ని ప్రైవేటు కంపెనీలు ఇదే చేస్తున్నాయి. ఏకంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పేర్లను వాడుకుంటున్నాయి. ముఖ్యమంత్రి రెఫరెన్స్‌తో వచ్చామని, మంత్రి లోకేశ్ ఆశీస్సులు

మిగతా 11వ పేజీలో...

నా మేధస్సు విలువ నెలకు 200 కోట్లు!



- నిజాయితీగా ఆర్జిస్తున్నా: గడ్కరీ
- 'ఈ-20 పెట్రోల్'లో ముడుపులపై కేంద్ర మంత్రి పరోక్ష స్పందన 2

'వలస' రాజ్యంలో కలకలం!

- ఇంగ్లండ్‌కు చట్టబద్ధంగా వచ్చినోళ్లు కొందరైతే శరణార్థులుగా వస్తున్న వలసదార్లు లక్షల్లో..
- ఆఫ్రికా, ముస్లిం దేశాల నుంచి రాక 2
- బ్రిటిషర్ల ఆందోళన.. 'మా దేశాన్ని మాకు ఇచ్చేయండి' అంటూ లండన్‌లో భారీ ప్రదర్శన


లండన్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకుంటున్న దేవాన్ష్

దేవాన్ష్‌కు ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్ అవార్డు

- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు అందుకున్న లోకేశ్ తనయుడు
- లండన్‌లో ప్రదానం.. ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం 11

దుకాణాల్లో జీఎస్టీ తగ్గింపు

బోర్డులు తప్పనిసరి

- పన్నుల భారం నుంచి ప్రజలకు ఉపశమనం
- 350కి పైగా వస్తువుల ధరలు తగ్గుతాయి
- రాష్ట్రాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల స్పష్టీకరణ 2

శత్రు జలాంతర్గాముల ఉనికిని పసిగట్టే 'ఆండ్రోత్'

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: భారత నౌకాదళంలోకి మరో స్వదేశీ యుద్ధ నౌక వచ్చి చేరింది. జలాంతర్గాముల ఉనికిని పసిగట్టే యాంటీ సబ్‌మెరైన్ వార్‌షిప్ 'ఆండ్రోత్' శనివారం నావికాదళంలో అడుగుపెట్టింది. కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్, ఇంజనీర్స్ (జీఆర్ఎస్ఈ) దీన్ని స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించింది. లక్ష దీవుల్లోని 'ఆండ్రోత్' అనే దీవి పేరు పెట్టారు. దీని పొడవు దాదాపు 77 మీటర్లు. దీనిలో అత్యాధునిక తేలిక పాటి టోర్పిడోలు, జలాంతర్గామి విధ్వంసక రాకెట్లు ఉన్నాయి.

ఐరాస హక్కుల కమిటీ ఛైర్‌పర్సన్‌గా ప్రీతి సరన్



న్యూయార్క్, సెప్టెంబరు 14: ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల కమిటీ ఛైర్‌పర్సన్‌గా భారత్‌కు చెందిన మాజీ దౌత్యాధికారిణి ప్రీతిసరన్ నియమితులయ్యారు. జెనీవా కేంద్రంగా ఉన్న ఈ కేంద్రం ఆర్థిక, సామాజిక హక్కుల విషయమై సభ్య దేశాల మధ్య కుదిరిన అంతర్జాతీయ ఒప్పందాల అమలును పర్యవేక్షిస్తుంది. ఇది ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల వ్యాప్తికి భారత్ చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ ఉన్నత పదవి ఇచ్చినట్టు ఆ సంస్థ ప్రకటించింది.

బాస్‌ను సెలవు అడిగిన 10 నిమిషాలకే ఆగిన ఉద్యోగి గుండె

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: 'సార్.. వెన్ను నొప్పి విపరీతంగా ఉంది. విధులకు రాలేను. ఈరోజు సెలవు ఇవ్వండి'.. ఉద్యోగాలు చేసుకునే వాళ్లు అనారోగ్యానికి గురైనప్పుడు ఏదో ఓ సందర్భంలో ఇలాంటి సందేశాన్ని తమ పైఅధికారికి పంపే ఉంటారు. కేవీ అయ్యర్ అనే ఓ వ్యక్తికి కూడా శంకర్(40) అనే సహోద్యోగి నుంచి ఈ సందేశం వచ్చింది. అయ్యర్‌కు ఇలాంటి సందేశాలు సాధారణమే అయినా... శంకర్ మెసేజ్ మాత్రం అతనికి ఊహించని షాకిచ్చింది. ఎందుకంటే సిక్ లీవ్ కావాలని మెసేజ్ పెట్టిన 10 నిమిషాలకే శంకర్ ఈ లోకాన్ని వీడారు. తన పైఅధికారి అయ్యర్‌కు ఉదయం 8:37 గంటలకు మెసేజ్ పెట్టిన శంకర్.. 8:47 గంటలకు కార్డియాక్ అరెస్టుకు గురై కన్నుమూశారు. ధూమపానం, మద్యపానం లాంటి అలవాట్లు లేని శంకర్ ఇలా కార్డియాక్ అరెస్టుకు గురై హఠాత్తుగా మరణించడంతో.. జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమంటూ అయ్యర్ తన ఆవేదనను ఎక్స్‌లో పంచుకున్నారు.

'టార్గెట్ పవన్' వెనుక కుట్ర

- సోషల్ మీడియాతో కావాలనే టార్గెట్ చేస్తున్నారు: నాదెండ్ల



తెనాలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'జగన్ ఒక రాజకీయ ఉన్మాది. అధికారం కోసం ఎంతటి దుర్మార్గానికైనా ఒడిగట్టడానికి బరితెగిస్తున్నారు. దీనిలో భాగంగానే కూటమి ప్రభుత్వంపై విష ప్రచారంతోపాటు, గత వారం రోజులుగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, జనసేన పార్టీపై బురద చల్లేందుకు కుట్రలు పన్నుతున్నారు' అని పౌరసరఫరాల మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడియాను ఉపయోగించి ఇప్పుడు పవన్, జనసేనను టార్గెట్ చేస్తున్నారని, దీని వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. సోషల్ మీడియాను కూడా వారి దుర్మార్గపు రాజకీయాల కోసం వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఏ విధంగానైనా అధికారం దక్కించుకునేందుకు కావాలనే కొందరితో పోస్టులు పెట్టించి అలజడులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మచిలీపట్నంలో ఏం జరిగిందనే దానిపై జనసేన అధినేత విచారణకు ఆదేశించారని, తమ పార్టీ నాయకులు, కార్యకర్తల తీరులో పొరపాటు ఉంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వైసీపీలా చిచ్చుపెట్టే రాజకీయం చేయబోం!

పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి ఫోన్ చేసి పరామర్శించిన జగన్.. అధికారంలో ఉండగా అంతకు మించిన దారుణాలు జరిగితే ఏమయ్యారని మనోహర్ ప్రశ్నించారు. జగన్ నియంతృత్వ పాలనను తట్టుకోలేని ప్రజలు ఇంటికి పంపినా.. జగన్‌లో మార్పు రాకపోవటం ఆయన అరాచక రాజకీయ నైజానికి నిదర్శనమన్నారు. రెచ్చగొట్టేందుకు వైసీపీ చేస్తున్న కుట్రలో చిక్కుకోవద్దని తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఎవరైనా సమాజంలో అలజడులు సృష్టిద్దామనుకున్నా, తమపై అసత్య ప్రచారాలు చేద్దామని చూసినా చట్టపరంగానే ఎదుర్కొంటామన్నారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని నియంత్రించేలా చట్టాలను కఠినతరం చేయనున్నామని తెలిపారు.

పీపీపీ అర్థం తెలియని వైసీపీ ఓ దరిద్రం!

- జబర్దస్త్ రోజా పవన్‌ను విమర్శించడమా?
- అక్టోబరు నుంచి జనసేన సంస్థాగత నిర్మాణం: మంత్రి దుర్గేశ్



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'పీపీపీ అంటే అర్థం తెలియని వైసీపీ మనకో దరిద్రం. ప్రైవేటీకరణకు, పీపీపీకి తేడా తెలియకుండా ఆ పార్టీ మాట్లాడుతోంది' అని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జగన్ మెడికల్ కాలేజీలను ఎక్కడ కట్టారో చూపించాలని సవాల్ చేశారు. జబర్దస్త్‌లో రకరకాల విన్యాసాలు చేసే రోజాకు తమ పార్టీ అధినేతను విమర్శించే అర్హత లేదన్నారు. కూటమి ప్రభుత్వం 15 నెలల్లోనే రూ.10,644 కోట్ల పర్యాటక పెట్టుబడులు తెచ్చిందని, ఇప్పటికే రూ.698 కోట్లతో 88 ప్రాజెక్టులు ప్రారంభించామని, వాటి ద్వారా 3,554 మందికి ఉపాధి కలుగుతుందని తెలిపారు. ఐదేళ్లలో రూ.25 వేల కోట్ల పర్యాటక పెట్టుబడులు రాబట్టే ప్రయత్నంలో ఉన్నామన్నారు. ఎర్రమట్టి దిబ్బలు, తిరుమల కొండలకు యునెస్కో జాబితాలో చోటు లభించిందని తెలిపారు. సీఎం చంద్రబాబు సూచనతో క్యారవాన్ టూరిజం ప్రతిపాదన చేశామని, పర్యాటక ప్రాంతాలకు వచ్చేవారు క్యారవాన్లలో బస చేయవచ్చని, దాని ద్వారా మరో చోటుకు వెళ్లవచ్చని తెలిపారు. అక్టోబరు నుంచి జనసేనాని పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయనున్నామని, క్షేత్రస్థాయి వరకూ పార్టీ నిర్మాణం చేస్తామని చెప్పారు.

పాక్ ఉగ్రవాదులకు కాంగ్రెస్ దన్ను!

- ఓటుబ్యాంకు రాజకీయాలే ఆ పార్టీకి ముఖ్యం
- చొరబాట్లతో సరిహద్దు రాష్ట్రాల జనాభా కూర్పు మార్చేందుకు కుట్రలు
- జాతీయ భద్రతకు ఇది ముప్పు
- అసోం పర్యటనలో ప్రధాని మోదీ ఆగ్రహం
- శివభక్తుడిని.. హాలాహలం మింగగలను
- ప్రజలే నా యజమానులు.. దేవుళ్లు: మోదీ



'అసోం బయో ఇథనాల్' సంస్థ సిబ్బంది, వెదురు రైతులతో మాట్లాడుతున్న మోదీ

మంగల్‌దోయి, సెప్టెంబరు 14: కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు రాజకీయాలే ప్రధానమని.. జాతి ప్రయోజనాలు దానికి పట్టవని ప్రధాని మోదీ విమర్శించారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో.. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీరు (పీవోకే)ల్లోని ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసిన భారత సైన్యానికి ఆ పార్టీ మద్దతివ్వలేదని.. పైగా పాకిస్థాన్ ప్రేరిత ఉగ్రవాదులకు అండగా నిలిచిందని ఆరోపించారు. ఇవాళ చొరబాటుదారులకు, జాతి వ్యతిరేక శక్తులకు ఆ పార్టీ అతిపెద్ద సంరక్షకురాలిగా మారిందని.. వారు దేశంలో శాశ్వతంగా ఉండిపోవాలని భావిస్తోందన్నారు. ఈశాన్య భారత పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన అసోంలోని దరంగ్ జిల్లా మంగల్‌దోయిలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. చొరబాట్ల ద్వారా సరిహద్దు ప్రాంతాల్లో భూమిని ఆక్రమించుకుని జనాభా కూర్పును మార్చే కుట్రలు జరుగుతున్నాయని.. ఇది జాతీయ భద్రతకు ప్రమాదమని.. దీనిని బీజేపీ అనుమతించదని తేల్చిచెప్పారు. అసోం భూమిపుత్రుడు, ప్రసిద్ధ గాయకుడు భూపేన్ హజారికాకు కేంద్రం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న' ప్రకటించినప్పుడు.. బీజేపీ గాయకులకు, డాన్సర్లకు అవార్డులిస్తోందంటూ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడొకరు చేసిన వ్యాఖ్యల వీడియోను సీఎం హిమంత బిశ్వ శర్మ శనివారం రాత్రి తనకు చూపారని ప్రధాని తెలిపారు. '1962లో చైనా దురాక్రమణ సమయంలో నాటి ప్రధాని నెహ్రూ అసోం ప్రజలకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు మాయని మచ్చలా మిగిలాయి. ఇప్పుడు హజారికాకు భారతరత్న ఇస్తే.. కాంగ్రెస్ ఆయనకు చేసిన అవమానం పుండుపై కారం చల్లినట్లుగా ఉంది. ఇది నన్నెంతో బాధిస్తోంది' అని చెప్పారు. ఈ రాష్ట్రంలో ఉగ్రవాదం, అశాంతికి కాంగ్రెసే కారణమన్నారు. అసోం వారసత్వాన్ని, చిహ్నాలను విస్మరించిందని చెప్పారు. రాష్ట్రంలో చొరబాటుదార్లు ఆక్రమించుకున్న భూమిని విముక్తి చేసి.. స్థానిక రైతులు సాగు చేసే అవకాశం కల్పిస్తున్నారని సీఎం హిమంతను ప్రశంసించారు. చొరబాటుదార్ల నుంచి అసోంను కాపాడేందుకు పోరాటం చేస్తామన్నారు. 21వ శతాబ్దంలో పాతికేళ్లు గడచిపోయాయని.. తదుపరి అధ్యాయం ఈశాన్య, తూర్పు భారతాలదేనని స్పష్టం చేశారు. దేశాభివృద్ధికి, పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం స్వదేశీ ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని పిలుపిచ్చారు. కాగా.. మంగల్‌దోయిలో ప్రధాని రూ.5,300 కోట్ల విలువ చేసే ఆరోగ్య, మౌలిక వసతుల ప్రాజెక్టులకు, రూ.1,200 కోట్లతో 2.9 కిలోమీటర్ల పొడవైన నరేంగీ-కురువా వంతెనకు శంకుస్థాపన చేశారు. దరంగ్ వైద్య కళాశాల-ఆస్పత్రి నిర్మాణాన్ని ప్రారంభించారు. కామరూప్, దరంగ్ జిల్లాలు, మేఘాలయలోని రీ భోయ్‌లను కలుపుతూ 118.5 కిలోమీటర్ల పొడవైన గౌహతి రింగ్‌రోడ్డు ప్రాజెక్టుకు కూడా శంకుస్థాపన చేశారు. దీని అంచనా వ్యయం రూ.4,530 కోట్లు.

చమురు దిగుమతుల నియంత్రణ

భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్నా.. ముడిచమురు, గ్యాస్ కోసం విదేశాలపై ఆధారపడాల్సి వస్తోందని ప్రధాని చెప్పారు. ఈ దిగుమతులు తగ్గించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోందని నుమాలిగఢ్ ర్యాలీలో తెలిపారు. నుమాలిగఢ్‌లో తాను ప్రారంభించిన బయో ఇథనాల్ రిఫైనరీతో రైతులు, గిరిజనులకు మేలు కలుగుతుందన్నారు.

బిహార్‌లో నేడు మోదీ పర్యటన

ప్రధాని మోదీ సోమవారం ఉత్తర బిహార్‌లోని పూర్ణియాలో పర్యటించనున్నారు. రూ.36 వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. పూర్ణియాలోనే కొత్తగా అభివృద్ధిచేసిన ఎయిర్‌పోర్టు టెర్మినల్‌ను, ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన జాతీయ మఖానా (తామర విత్తనాలు) బోర్డును కూడా ప్రారంభించనున్నారు.

శివభక్తుడిని.. హాలాహలం మింగగలను

బిహార్లో ఇటీవల కాంగ్రెస్, ఆర్జేడీలు తనను, తన తల్లిని అసభ్య పదజాలంతో దూషించడాన్ని మోదీ ప్రస్తావించారు. 'నేను శివభక్తుడిని.. దూషణల హాలాహలాన్ని మింగుతాను. నేను ప్రజల ముందు బాధపడుతుంటే.. యావత్ కాంగ్రెస్ ఎకోసిస్టమ్ నాపై దాడిచేస్తుందని తెలుసు. ప్రజలే నా యజమానులు.. దేవుళ్లు.. నా రిమోట్ కంట్రోల్. వారి ముందు గాకపోతే ఎవరి ముందు నా బాధ చెప్పుకొంటాను? నా వద్ద మరే రిమోట్ కంట్రోలూ లేదు' అని వ్యాఖ్యానించారు.

లోకం తీరు



9990666872

- కంటి సంరక్షణకు జాతీయ 'హెల్ప్‌'లైన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: సరైన సమయంలో సరైన కంటి వైద్యుడిని సంప్రదించకపోవడం వల్ల దేశంలో అనేక మంది కంటిచూపు కోల్పోతున్నారు. అయితే ఈ పరిస్థితిని అధిగమించి.. దేశ పౌరులందరికీ కంటి సంరక్షణ అందించే దిశగా కీలక ముందడుగు పడింది. కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని వైద్యులతో అనుసంధానించడానికి ఢిల్లీలోని ప్రముఖ నేత్ర వైద్యుల బృందం జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 9990666872ను ప్రారంభించింది. లాభాపేక్షలేని సంస్థ సైట్ సార్థి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్‌చేస్తే... కంటి వైద్య నిపుణులు చికిత్సకు సంబంధించిన సలహాలు, సూచనలు ఉచితంగా అందిస్తారు.

నా మేధస్సు విలువ నెలకు 200 కోట్లు: గడ్కరీ

నాగ్‌పూర్, సెప్టెంబరు 14: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హరిత ఇంధనం 'ఇథనాల్(ఈ)-20'లో ముడుపులు ముట్టాయని, వ్యక్తిగత లబ్ధి చేకూరిందని తనపై వస్తున్న విమర్శలకు కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ పరోక్షంగా స్పందించారు. తాను దొడ్డిదారుల్లో సంపాయించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. తన మేధస్సు విలువ నెలకు రూ.200 కోట్లని, నిజాయితీగా ఆర్జిస్తున్నానని చెప్పారు. తనకు డబ్బుకు లోటు లేదన్నారు. చవక, ప్రత్యామ్నాయ ఇంధన వనరుగా కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను ప్రోత్సహిస్తోంది. అయితే.. గడ్కరీ కుమారుడి నేతృత్వంలో రెండు ప్రముఖ ఇథనాల్ కంపెనీలు నడుస్తున్నాయి. దీన్ని ప్రస్తావిస్తూ ఇటీవల సోషల్ మీడియాలో విమర్శలు చెలరేగాయి. తాజాగా నాగ్‌పూర్‌లో మాట్లాడిన గడ్కరీ తన కుమారుడికి సూచనలు, సలహాలు మాత్రమే ఇస్తానని, తప్పుడు పనులు చేయమని ఎప్పటికీ చెప్పనని తెలిపారు.

దుకాణాల్లో జీఎస్టీ తగ్గింపు బోర్డులు తప్పనిసరి



చెన్నై, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో జీఎస్టీ తగ్గింపు వివరాలకు సంబంధించిన బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అన్ని రాష్ట్రాలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు దేశవ్యాప్తంగా ఈ నెల 22 నుంచి జీఎస్టీ పన్ను తగ్గింపు అమల్లోకి వస్తుందని చెప్పారు. ఆదివారం చెన్నైలో 'వికసిత్ భారత్ దిశగా పన్నుల సంస్కరణలు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ 350కి పైగా వస్తువుల ధరలు గణనీయంగా తగ్గేలా జీఎస్టీ తగ్గించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని పూర్తి స్థాయిలో అమలయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గతంలో నాలుగు కేటగిరీలు (5, 12, 18, 28)గా విధించిన పన్నులను ప్రస్తుతం రెండు కేటగిరీలకు (5, 18 శాతం) కుదించామని చెప్పారు. దీంతో 140 కోట్లమంది ప్రజలు పన్నుభారం నుంచి ఉపశమనం పొందుతారని వివరించారు.

30-40 లక్షలకే మిగ్-21 యుద్ధ విమానాలు!

- బారులు తీరుతున్న పలు సంస్థలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14 : భారత వాయుసేన అమ్ములపొదిలో ఇప్పటి వరకు కీలకంగా ఉన్న మిగ్-21 యుద్ధ విమానాలు 30-40 లక్షలకే అమ్మకానికి సిద్ధం కానున్నాయి. వీటిని కొనేందుకు పలు సంస్థలు బారులు తీరుతున్నాయి. ఇప్పటికే పలు ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థలు, పబ్లిక్, ప్రైవేటు సంస్థలు వీటి కోసం దరఖాస్తు చేసుకోవడంతో చాంతాడంత జాబితా తయారైనట్లు వాయుసేన వర్గాల సమాచారం. అయితే వీటిని విక్రయించేటప్పుడు వాటిలోని ఇంజన్, ఇతర వ్యవస్థలను తొలగించి ఎయిర్‌ఫ్రేమ్‌ను మాత్రమే అప్పగిస్తారు. వాయుసేనలో 1963లో ప్రవేశపెట్టిన ఈ యుద్ధ విమానాలు పలు యుద్ధాల్లో కీలక పాత్ర వహించాయి. ఈ నెల 26న చండీగఢ్‌లో మిగ్-21ల తుది స్క్వాడ్రన్‌కు వీడ్కోలు పలకనున్నారు.

ఐఏఎస్ X టీడీపీ మహిళా ఎంపీ!

- కార్తికేయ మిశ్రా, శబరి మధ్య తీవ్ర వాగ్వాదం.. ఢిల్లీలో ఎంపీతో దురుసుగా మిశ్రా తీరు
- మర్యాదగా వ్యవహరించాలని శబరి ఘాటు హితవు.. లోకేశ్‌కు ఫిర్యాదు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్, సీఎంవో ఉన్నతాధికారి కార్తికేయ మిశ్రా.. నంద్యాల టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. గత శుక్రవారం ఢిల్లీలో నూతన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు వచ్చినప్పుడు ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. జన్‌పథ్‌లోని తన నివాసం నుంచి చంద్రబాబు రాష్ట్రపతి భవన్‌కు వెళ్తుండగా.. శబరి ఆయనతో మాట్లాడేందుకు తలుపు దగ్గర నిలుచున్నారు. అక్కడ మీరెందుకని మిశ్రా ఆమెను దురుసుగా ప్రశ్నించినట్లు తెలిసింది. సీఎం అక్కడి నుంచి వెళ్లాక ఎంపీ ఆయనకు క్లాస్ తీసుకున్నారు. ప్రజాప్రతినిధులతో మర్యాదగా వ్యవహరించాలని హితవు పలికారు. మిశ్రా స్పందిస్తూ.. 15 ఏళ్ల సర్వీసులో తననెవరూ ఇలా అనలేదన్నారు. తాను కూడా డాక్టర్‌గా తన సర్వీసులో చాలా మంది ప్రాణాలు కాపాడానని శబరి గట్టిగా జవాబిచ్చారని సమాచారం. మిశ్రా తీరుపై మనస్తాపానికి గురైన ఆమె.. మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఘటన ఢిల్లీలో హాట్ టాపిక్‌గా మారింది.

యోగా గురువుపై వలపు వల!


- పోలీసులను ఆశ్రయించిన గురువు.. పోలీసుల అదుపులో ఐదుగురు సభ్యుల ముఠా

చేవెళ్ల/హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): యోగా గురువుపై వలపు వల వేసి.. సొమ్ము కాజేయాలని చూసిన ముఠా సభ్యులు చివరకు పోలీసులకు పట్టుబడ్డారు. చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి రెండేళ్లుగా చేవెళ్ల మండలం దామరగిద్ద గ్రామంలో 'సీక్రెట్ ఆఫ్ నేచర్స్' పేరిట యోగా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. నెలలో 10 రోజుల పాటు ఆహార అలవాట్లు, ఆరోగ్యం, యోగాపై శిక్షణ ఇస్తారు. హైదరాబాద్ నగరానికి చెందిన అమర్ అనే వ్యక్తి.. వెంకటరంగారెడ్డి నుంచి సొమ్ము లాగాలని ప్రణాళిక వేశాడు. మంజుల, రజని అనే ఇద్దరు మహిళలతో యోగా గురువు వద్దకు వెళ్లారు. వారికి అనారోగ్య సమస్యలున్నాయని వారిని ఆశ్రమంలో చేర్పించాడు. ఆ ఇద్దరు మహిళలు ప్లాన్ ప్రకారం.. యోగా గురువుకు సన్నిహితంగా ఉంటూ ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. అమర్ ముఠా.. ఈ ఫొటోలు, వీడియోలను అడ్డం పెట్టుకుని యోగా గురువుపై బ్లాక్‌మెయిల్‌కు దిగారు. అడిగినంత డబ్బు ఇవ్వకుంటే.. వాటిని బయటపెట్టి పరువు తీస్తామని బెదిరించారు. ఆందోళన చెందిన యోగా గురువు.. రూ.50 లక్షల చెక్కు ఇచ్చారు. అది సరిపోదని, రూ.2 కోట్లు ఇవ్వాలని అమర్ ముఠా బ్లాక్ మెయిలింగ్ మొదలుపెట్టింది. దీనితో ఆయన పోలీసులను ఆశ్రయించగా.. వారు డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు. డబ్బులు ఇస్తానని యోగా గురువుతో ఫోన్ చేయించారు. ముఠా సభ్యులు అమర్, మంజుల, రజని, మౌలాలి, రాజేశ్ తారామతి బారాదరి వద్దకురాగా మాటువేసిన గోల్కొండ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

రాహుల్ ఆరోపణలపై విచారణకు ఆదేశించాల్సింది

ప్రతిపక్ష నేతపై అభ్యంతరకర వ్యాఖ్యలు సరికాదు

- ఈసీ ఆత్మపరిశీలన చేసుకోవాలి
- మాజీ సీఈసీ ఖురేషీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: 'ఓట్ల చోరీ' అంశంపై ఎన్నికల కమిషన్(ఈసీ) స్పందించిన తీరును మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.వై. ఖురేషీ తప్పుబట్టారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసే బదులు ఆయన చేసిన ఆరోపణలపై దర్యాప్తునకు ఆదేశించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. 'హైడ్రోజన్ బాంబు' వంటి పదాలతో రాహుల్ తన రాజకీయ వాక్చాతుర్యాన్ని జోడిస్తూ ఆరోపణలు చేశారని, అయినా వాటిపై సమగ్రంగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని ఆదివారం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఈసీ నిర్వహించిన విధానాన్ని కూడా ఆయన విమర్శించారు. ఇది సమస్యలను ఆహ్వానించడమేనని అన్నారు. ఎన్నికల కమిషన్‌ను ఎవరైనా విమర్శిస్తే ఈసీ మాజీ కమిషనర్‌గానే కాకుండా ఒక భారత పౌరుడిగా తనకు తీవ్ర ఆవేదన కలుగుతుందని చెప్పారు. కమిషన్ పురోగతిలో తనకూ పాత్ర ఉందన్నారు. ఎన్నికల విషయంలో తమ పనితీరును ఈసీ ఆత్మపరిశీలన చేసుకోవాలని ఖురేషీ సూచించారు. తమ నిర్ణయాలను ప్రభావితం చేసే అన్ని రకాల శక్తులను, ఒత్తిళ్లను కమిషన్ అధికారులు ఎదుర్కోవాలన్నారు. వారు ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాలని, ప్రతిపక్ష పార్టీల విశ్వాసాన్ని చూరగొనాలని సూచించారు. తాను సీఈసీగా ఉన్నప్పుడు ప్రతిపక్షాలకు ప్రాధాన్యం ఇచ్చానని గుర్తుచేసుకున్నారు. తనను కలవడానికి ప్రతిపక్ష నేతలు అపాయింట్‌మెంట్ కోరితే వెంటనే ఇచ్చేవాడినని తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్షాలు తరచుగా సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి వస్తోందని, తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని, తమ మాట వినేవారే లేరని 23 రాజకీయ పార్టీలు ఆరోపిస్తున్నాయని చెప్పారు. "వారు చెప్పేది వినండి, వారితో మాట్లాడండి, వారు ఏదైనా చిన్న సాయం కోరితే .. అది మరొకరికి నష్టం కలిగించనిది అయితే చేయండి" అని మాజీ సీఈసీ సూచించారు. లక్షలాది మందికి ప్రాతినిధ్యం వహిస్తూ, వారి అభిప్రాయాలను వినిపిస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై అఫిడవిట్ సమర్పించమని కోరే బదులు దర్యాప్తునకు ఈసీ ఆదేశించి ఉండాల్సిందన్నారు. "మీరు తీసుకొచ్చే కొత్త ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేవని అఫిడవిట్ ఇవ్వమని ప్రతిపక్షాలు కూడా అడిగితే ఏం చేస్తారు? ఒకవేళ అందులో ఏదైనా తప్పులు ఉంటే మీపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామంటే మీ పరిస్థితేంటి?" అని ఆయన ఈసీని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడే కాదు ఎవరు ఫిర్యాదు చేసినా దర్యాప్తుకు ఆదేశించడమే సరైన పద్ధతి అన్నారు. కాగా, ఖురేషీ వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ స్పందించింది. రాజకీయ పార్టీలతో తాము క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తున్నామని ఇంత నిర్మాణాత్మక రీతిలో మరెప్పుడూ జరగలేదని ఈసీ అధికారి ఒకరు పేర్కొన్నారు. ఇక నేపాల్ పరిణామాలపై ఖురేషీ మాట్లాడుతూ, అవి సజీవమైన, శక్తిమంతమైన ప్రజాస్వామ్యానికి సంకేతాలుగా అభివర్ణించారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి జీవితంలో సోషల్ మీడియా అంతర్భాగంగా మారిన నేపథ్యంలో దాన్ని నియంత్రించే విషయంలో ప్రభుత్వాలు చాలా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.

'వలస' రాజ్యంలో కలకలం!

ఇంగ్లండ్‌లో పెరిగిపోతున్న వలసదారులు

- 'మా దేశాన్ని మాకు ఇచ్చేయండి' అంటూ

లండన్‌లో లక్ష మందికిపైగా స్థానిక బ్రిటిషర్ల ప్రదర్శన

వ్యాపారం పేరిట చిన్న చిన్న పడవలు వేసుకుని సముద్రాలు దాటి వలస వచ్చింది వారే.. స్థానికులపై దాడులకు, దోపిడీకి పాల్పడింది వారే.. వారి సంస్కృతిని రుద్ది, స్థానిక సంస్కృతులను నాశనం చేసింది వారే.. అదే బ్రిటీషర్లు ఇప్పుడు తమ దేశంలోకి వలసలు పెరిగిపోతున్నాయని మొత్తుకుంటున్నారు. ఒకప్పుడు తాము వలసవెళ్లి అణగదొక్కి, పాలించి, దోచుకున్న ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని దేశాల వారు ఇప్పుడు.. తమ దేశంలోకి వచ్చి చేరుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వలసదారులు తమ సంస్కృతిని నాశనం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వారిని తిప్పిపంపేయాలంటూ నిరసనలకూ దిగుతున్నారు.

బ్రిటన్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఉన్నత చదువుల కోసం దక్షిణాసియా, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వెళుతున్నారు. వారంతా చట్టబద్ధంగా వీసాలు తీసుకుని వస్తున్నవారు. మరోవైపు అంతర్యుద్ధాలు, కరువు బాధిత దేశాల నుంచి పెద్ద సంఖ్యలో శరణార్థులు సముద్రం మీదుగా చిన్నచిన్న బోట్లలో అక్రమంగా బ్రిటన్‌లోకి ప్రవేశిస్తున్నారు. తమకు ఆశ్రయం ఇవ్వాలంటూ అక్కడి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బ్రిటన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఇలాంటి వారి సంఖ్య లక్షల్లోకి చేరింది. స్థానికులమైన తమ కంటే కూడా వలస వచ్చినవారే ఎక్కువైపోయారని.. తమ పన్నుల ఆదాయం వారికి ఖర్చుపెట్టడం ఏమిటంటూ బ్రిటీషర్లలో కొన్నేళ్లుగా ఆందోళన పెరిగిపోయింది. అలా శరణార్థులుగా వచ్చినవారిని స్థానిక బ్రిటీషర్లు చులకనగా చూడటం, జాత్యాహంకార వ్యాఖ్యలు చేయడం వంటివి పెరిగాయి. మరోవైపు ఆఫ్రికా, ఇస్లాం దేశాల నుంచి వచ్చిన శరణార్థుల్లో కొందరు.. దోపిడీలు చేస్తుండటం, తమకు చులకనగా చూస్తున్న బ్రిటిషర్లపై దాడులు చేయడం సమస్యగా మారింది. బ్రిటన్‌లోని తీవ్ర జాతీయవాద (ఫార్ రైట్) పార్టీలు, నేతలు.. విదేశీయుల వలసలను, శరణార్థులకు ఆశ్రయం ఇవ్వడాన్ని తప్పుపడుతూ పోరాటాలు లేవనెత్తుతున్నారు. సోషల్ మీడియాలోనూ ఇది తీవ్ర స్థాయికి చేరింది. బ్రిటన్ స్థానికుల్లో వలసలకు వ్యతిరేక భావజాలం పెరిగిపోయింది. యూకే ప్రభుత్వ గణాంకాల ప్రకారమే.. 2024 చివరి నాటికి అక్కడ 5,15,697 మంది శరణార్థులు ఉన్నారు. వలస వచ్చినవారి విజ్ఞప్తులను పరిశీలించి ప్రభుత్వం అధికారికంగా ఆశ్రయం ఇచ్చినవారి సంఖ్య ఇది. అదే సమయంలో అక్రమంగా వచ్చిన మరో 1,24,841 మంది శరణార్థిగా ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఉన్నారు. ఈ ఏడాది తొలి ఎనిమిది నెలల్లో మరో లక్ష మందికిపైగా అక్రమంగా యూకేలోకి వచ్చి ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకున్నట్టు అంచనా. ఎలాంటి గుర్తింపు పొందకుండా, దరఖాస్తు చేసుకోకుండా ఉంటున్నవారు కూడా లక్షల్లో ఉంటారు. వీరిలో చాలా మంది ఆఫ్రికా, మధ్యప్రాచ్య ముస్లిం దేశాల నుంచి వచ్చినవారే. మరోవైపు పర్యాటక, విద్యార్థి వీసాలపై వచ్చి.. గడువు ముగిసినా బ్రిటన్‌లోనే ఉండిపోయిన వారి సంఖ్య కూడా లక్షల్లో ఉంటుంది. మొత్తంగా శరణార్థులు, అక్రమంగా ఉంటున్నవారు కలిపి 10-15 లక్షల మంది వరకు ఉంటుందని అంచనా. (సెంట్రల్ డెస్క్)



'మా దేశాన్ని మాకు ఇవ్వండి'..

ఇంగ్లండ్‌లో విదేశీయుల సంఖ్య పెరిగిపోతోందని, ముఖ్యంగా ఇస్లామిక్ దేశాల నుంచి వస్తున్న శరణార్థులతో సమస్యలు వస్తున్నాయని పేర్కొంటూ లండన్‌లో శనివారం సాయంత్రం భారీ నిరసన ప్రదర్శన జరిగింది. జాతీయవాద నేత టామీ రాబిన్సన్ ఆధ్వర్యంలో.. యూకే జాతీయ జెండాలను చేతబూని, 'దేశాన్ని ఏకం చేయండి (యునైట్ ద కింగ్‌డమ్)', 'మా దేశాన్ని మాకు ఇవ్వండి' అంటూ ఆందోళన చేశారు. పాలస్తీనా, ఇస్లామిక్ స్టేట్ జెండాలను చింపేశారు. ఈ ఆందోళనలో లక్ష మందికి పైగా పాల్గొన్నారు. నిరసనకారులు బ్రిటన్ ప్రధానితోపాటు పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఉండే వైట్‌హాల్ ప్రాంతం దాటి చొచ్చుకుపోయేందుకు ఆందోళనకారులు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో 26 మంది పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఆందోళనలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వర్చువల్‌గా ప్రసంగించారు. "ఏ మాత్రం నియంత్రణ లేని వలసలతో బ్రిటన్ వేగంగా క్షీణించిపోతోంది. మీరు హింసకు పాల్పడకున్నా.. హింసే మీ వైపు వస్తోంది. దాన్ని ఎదుర్కోవాలి, లేదా ప్రాణాలు వదిలేయాలి. ఇదే నిజం" అని వ్యాఖ్యానించారు. మరోవైపు, రాబిన్సన్ నేతృత్వంలోని ఆందోళనకు ప్రతిగా పలువురు బ్రిటన్ ఎంపీలు, వామపక్ష నేతలు, ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు 5 వేల మందితో ర్యాలీ నిర్వహించారు. రాబిన్సన్ అనుచరులు, మద్దతుదారులంతా జాత్యాహంకారులని, మహిళా వ్యతిరేకులని ఆరోపించారు.

బిజినెస్

ఐపీఓ మార్కెట్‌లో జోష్

30లోగా మరో 12 ఐపీఓలు

న్యూఢిల్లీ: ఐపీఓ మార్కెట్లో జోష్ కొనసాగుతోంది. ఈ నెలాఖరులోగా లేదా వచ్చే నెల తొలి వారంలోగా మరో 12 కంపెనీలు ప్రైమరీ మార్కెట్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాయి. ఈ కంపెనీలన్నీ దాదాపు రూ.10,000 కోట్లు సమీకరించేందుకు మార్కెట్‌కు రాబోతున్నాయి . ఇందులో ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ ఇష్యూ కూడా ఉంది. ఈ కంపెనీల ఈ నెల 15 నుంచి తమ షేరు ధర శ్రేణిని ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. సెబీ ఇప్పటికే ఈ ఐపీఓలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూలధన అవసరాలు, అప్పుల చెల్లింపు, ఇతర అవసరాల కోసం ఈ కంపెనీలు ఐపీఓ మార్కెట్‌కు వస్తున్నాయి.

ఇప్పటి వరకు రూ.75,000 కోట్లు : ఈ సంవత్సరం ఇప్పటి వరకు 55 కంపెనీలు ఐపీఓల ద్వారా మార్కెట్ నుంచి దాదాపు రూ.75,000 కోట్లు సమీకరించాయి. గత ఏడాది మొత్తం మీద 91 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.1.6 లక్షల కోట్లు సమీకరించాయి. ప్రైమరీ మార్కెట్‌లో ఈ జోష్ ఇలానే కొనసాగితే ఈ సంవత్సరం ఐపీఓల ద్వారా కంపెనీలు సమీకరించే మొత్తం రూ.2 లక్షల కోట్లకు చేరుతుందని మార్కెట్ వర్గాల అంచనా.

మార్కెట్‌కు వచ్చే కొన్ని ప్రధాన ఐపీఓలు :
- జైన్ రిసోర్స్ రిసైక్లింగ్ రూ.2,000 కోట్లు.
- పార్క్ మెడివరల్డ్ రూ.1,260 కోట్లు.
- సాత్విక్ గ్రీన్ ఎనర్జీ రూ.1,150 కోట్లు.
- ట్రూఆల్ట్ బయోఎనర్జీ రూ.1,000 కోట్లు.
- ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ రూ.750 కోట్లు.

కార్ లోన్... ఇప్పుడే వద్దు



జీఎస్‌టీ తగ్గాక తీసుకుంటాం: కస్టమర్లు.. చూసి పోతున్నారంతే అంటున్న డీలర్లు

న్యూఢిల్లీ: జీఎస్‌టీ మండలి నిర్ణయాల ప్రభావం కార్ లోన్లపై పడింది. షోరూమ్‌లకు వచ్చి చూసిపోవడమే తప్ప, కొనుగోలుదారులెవరూ కార్లు కొనడం లేదు. ఫలితంగా బ్యాంకులు ఇచ్చే కార్‌లోన్లకు గిరాకీ తగ్గింది. మంజూరైన కార్‌లోన్లను తీసుకునేందుకు కూడా ఖాతాదారులు ముందుకు రావడం లేదు. బ్యాంకులకు ఫోన్ చేసి, మా కార్ లోన్ అప్రూవల్ క్యాన్సిల్ చేయండి, తర్వాత చూద్దాం అని చెబుతున్నట్టు బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. లోన్ క్యాన్సిలేషన్ ఛార్జీలు నామమాత్రంగా ఉండడం సైతం ఇందుకు కలిసొస్తోంది. మాన్సూన్ ఆఫర్ కింద ప్రాసెసింగ్ ఛార్జీలు రద్దు చేసినా, ఈ నెల 4 నుంచి కార్ లోన్లు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని బ్యాంకర్లు చెబుతున్నారు. కార్ డీలర్లు ఇన్‌వాయిస్ జారీ చేస్తే పాత జీఎస్‌టీ రేట్ల ప్రకారం 28 శాతం జీఎస్‌టీ పడుతుంది. ఇన్‌వాయిస్ లేకపోతే మాత్రం తగ్గించిన కొత్త జీఎస్‌టీ 18 శాతం పడుతుంది. దీనికి తోడు ఈ నెల 7 నుంచి 21 వరకు పితృ తర్పణాలు విడిచే కాలం. దీన్ని చాలా మంది అశుభ కాలంగా పరిగణిస్తారు. కార్‌లోన్లకు గిరాకీ తగ్గడానికి ఇది కూడా ఒక కారణమని అధికారులు చెబుతున్నారు.

పెద్ద కారే కొందాం...

ఈ నెల 22 నుంచి కార్లు, ఎస్‌యూవీపై ప్రస్తుతం 28 శాతంగా ఉన్న జీఎస్‌టీ 18 శాతానికి తగ్గనుంది. పెట్రోల్ కార్లయితే 1200 సీసీ, డీజిల్ కార్లయితే 1,500 సీసీ ఇంజిన్ సామర్థ్యం వరకు 18 శాతం జీఎస్‌టీ వర్తిస్తుంది. అంతకు మించితే మాత్రం 18 శాతం జీఎస్‌టీతో పాటు ఒకటి నుంచి 22 శాతం వరకు ప్రత్యేక సెస్ వర్తిస్తుంది. దీంతో ఎంట్రీ లెవల్ కార్లు కొనాలనుకున్న వారు కూడా పునరాలోచనలో పడ్డారు. జీఎస్‌టీ భారం తగ్గడంతో ధర కొద్దిగా ఎక్కువైనా ఎంట్రీ స్థాయిని మించి కొద్దిగా హైఎండ్ వెహికల్స్ కొనేందుకు ఆసక్తి చూపిస్తూ కొనుగోలు నిర్ణయాల్ని వాయిదా వేస్తున్నారు. కార్‌లోన్లకు డిమాండ్ తగ్గడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అయితే ఈ నెల 22 నుంచి మాత్రం కార్‌లోన్లకు డిమాండ్ భారీగా ఉంటుందని బ్యాంకింగ్ వర్గాల అంచనా. ఫెస్టివల్ సీజన్ కూడా కావడంతో మరింత ఆకర్షణీయమైన ఆఫర్లను కస్టమర్లను ఆకర్షించేందుకు బ్యాంకులు సిద్ధమవుతున్నాయి.

నెల్లూరు ప్రాజెక్టు గిట్టుబాటు కాదు : నాల్కో

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో తలపెట్టిన మరో పారిశ్రామిక ప్రాజెక్టు అటకెక్కింది. రూ.4,500 కోట్ల పెట్టుబడితో ఏటా 60,000 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేయతలపెట్టిన ఉత్కర్ష్ అల్యూమినియం ధాతు నిగం ప్రాజెక్టు ఆర్థికంగా గిట్టుబాటు కాదని నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో) తేల్చింది. కంపెనీ తన తాజా వార్షిక నివేదికలో ఈ విషయం పేర్కొంది. కీలక మిశ్రమ లోహాల కోసం మరో ప్రభుత్వ రంగ సంస్థ మిశ్రధాతు నిగమ్‌తో కలిసి నాల్కో ఈ ప్రాజెక్టును తలపెట్టింది. ఇందుకోసం 2019లో చెరి సగం వాటాతో ఉత్కర్ష్ అల్యూమినియం ధాతు నిగం లిమిటెడ్ పేరుతో ప్రత్యేక జాయిం ట్ వెంచర్ కంపెనీ ఏర్పాటు చేశారు. నాల్కో తాజా నివేదికతో నెల్లూరు జిల్లాలో తలపెట్టిన ఈ భారీ ప్రభు త్వ రంగ ప్రాజెక్టు కూడా దుగ్గరాజపట్నం ఓడ రేవులా అటకెక్కింది.

25500 పైన బుల్లిష్

(సెప్టెంబరు 15-19 తేదీల మధ్య వారానికి)

గత వారం నిఫ్టీ : 25214 (+373)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం: 24711-25138 పాయింట్ల మధ్యన కదలాడి 373 పాయింట్ల లాభంతో 25214 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25500 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25030, 24893, 24786, 24489 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25500 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24750

నిరోధ స్థాయిలు: 25325, 25425, 25525 (25225 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 24495, 24825, 24725 (25025 దిగువన బేరిష్)

అభ్యాస శాస్త్రి

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	540
చిత్తూరు	573	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	135
కరీంనగర్	121	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	127
కర్నూలు	121	నెల్లూరు	132
విశాఖపట్నం	139	అనంతపురం	132
గోదావరి	140		

సానుకూల సంకేతాలు వస్తే..

దేశీయ బెంచ్‌మార్క్ సూచీలు ప్రస్తుతం కీలక దశకు చేరుకున్నాయి. నిఫ్టీ మళ్లీ 25000 పై స్థాయిలో ముగిసింది. గ్లోబల్ మార్కెట్ల నుంచి వస్తున్న సంకేతాలు, కొన్ని రంగాల్లో కొనుగోళ్లు ఇందుకు ఊతంగా మారాయి. ఈ నెలలో అమెరికన్ ఫెడరల్ వడ్డీరేట్లు తగ్గించవచ్చునన్న సంకేతాలు మళ్లీ ఇన్వెస్టర్లలో జోష్ పెంచుతున్నాయి. అదే జరిగితే సూచీలు మరింత పెరగడం ఖాయం. మార్కెట్ బ్రెడ్త్ కొంత మెరుగవ్వడం సానుకూల అంశం. ప్రస్తుతం మైనింగ్, నాన్ ఫెర్రస్ మెటల్స్, ఆటో మొబైల్స్-యాన్సిలరీస్, ఎలక్ట్రికల్స్ సెక్టార్లు బలంగా ఉన్నాయి.

స్టాక్ రికమెండేషన్స్

బీఈఎల్: జీవితకాల గరిష్ట స్థాయికి చేరిన అనంతరం ఈ షేర్లు దిద్దుబాటుకు లోనయ్యాయి. ప్రస్తుతం అన్ని ప్రధాన చలన సగటు స్థాయిలను అధిగమించాయి. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ బాగున్నాయి. గత శుక్రవారం రూ.399 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.425 టార్గెట్ ధరతో రూ.380 పై స్థాయిలో పొజిషన్ తీసుకోవచ్చు. డిప్స్ పద్ధతిలో కొనుగోలు చేస్తూ దీర్ఘకాలం హోల్డ్ చేయాలి. స్టాప్‌లాస్ : రూ.360.

లుపిన్: ఈ షేర్లు ఏడాది కాలంగా ఎలాంటి రాబడి ఇవ్వలేదు. సైడ్‌వేస్ కదలికలతో మంచి బేస్ ఏర్పడింది. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ పెరుగుతోంది. డెలివరీ వాల్యూమ్ రావడాన్ని బట్టి బుల్లిష్ ట్రెండ్ ఆరంభమైందని చెప్పొచ్చు. గత శుక్రవారం రూ.2,043 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ. 2,250 టార్గెట్ ధరతో రూ. 2,000 శ్రేణిలో కొనుగోలు చేయాలి. స్టాప్ లాస్ : రూ.1,960.

ఐసీఐసీఐ బ్యాంకు: కొన్ని నెలలుగా ఈ షేర్లు సైడ్ వేస్‌లో కదులుతున్నాయి. అయితే రూ.1,400 శ్రేణిలోనే కన్సాలిడేట్ అవుతూ వస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ. 1,417 వద్ద ముగిసింది. రూ. 1520/1550 టార్గెట్ ధరతో రూ. 1,400 శ్రేణిలో అక్యూములేట్ చేసుకుని దీర్ఘకాలం ఉంచుకోవాలి. స్టాప్‌లాస్ : రూ.1380.

కొచ్చిన్ షిప్‌యార్డు: డౌన్‌ట్రెండ్‌లో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ తర్వాత ఏర్పడిన భారీ స్వింగ్ అనంతరం ఈ షేర్లు మళ్లీ దిద్దుబాటుకు లోనయ్యాయి. ప్రస్తుతం నౌకా నిర్మాణంపై కేంద్రం దృష్టి పెట్టడంతో టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గత శుక్రవారం రూ.1,745 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.1,850 టార్గెట్ ధరతో రూ. 1700/1730 శ్రేణిలో పెట్టుబడి పెట్టవచ్చు. స్టాప్‌లాస్ : రూ.1680.

గ్లాండ్ ఫార్మా: ఈ షేర్లు ఇంట్రెస్టింగ్ జోన్‌లో ఉన్నాయి. మరోసారి నమోదైన గరిష్ఠానికి చేరువయ్యాయి. ఈ నిరోధాన్ని దాటితే మరింత పెరిగే అవకాశం ఉంటుంది. పైగా రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ బాగున్నాయి. గత శుక్రవారం రూ.2,021 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ. 2,160 టార్గెట్ ధరతో రూ. 2,000 శ్రేణిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ. 1,970.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

కీలక నిరోధం 25000 వద్ద పరీక్ష

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం రికవరీని కొనసాగించి వారం మొత్తం మీద 373 పాయింట్ల లాభంతో 25,140 వద్ద ముగిసింది. గత రెండు వారాల్లో నిఫ్టీ 700 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించింది. అయినప్పటికీ గత నాలుగు వారాలుగా ప్రధాన స్థాయి 25,000 వద్ద సైడ్‌వేస్ కదలికలు కొనసాగుతూనే ఉన్నాయి. మొత్తం మీద మార్కెట్ గత వారం నిలకడగా క్లోజయినా ప్రస్తుతం గతంలో ఏర్పడిన మేజర్ టాప్ 25,200 సమీపంలో ఉంది. గతంలో రివర్సల్ ఏర్పడిన ఈ స్థాయిలో వరుసగా నాలుగో వారం పరీక్ష ఎదుర్కొంటోంది. తదుపరి దిశ తీసుకునే ముందు ఈ స్థాయిలో కన్సాలిడేట్ కావచ్చు. ప్రస్తుత అప్‌ట్రెండ్ కొనసాగించాలంటే ఈ స్థాయిలో నిలదొక్కుకుని తీరాలి. మిడ్ క్యాప్-100, స్మాల్‌క్యాప్-100 సూచీలు సైతం గత వారం ర్యాలీ సాధించాయి.

బుల్లిష్ స్థాయిలు: అమెరికన్ మార్కెట్లో శుక్రవారం నాటి బలహీనత కారణంగా ఈ వారంలో నిఫ్టీ అప్రమత్త ట్రెండ్‌లో ట్రేడయ్యే ఆస్కారం ఉంది. అప్‌ట్రెండ్ కొనసాగించాలంటే 25,200 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. ప్రధాన నిరోధ స్థాయిలు 25600, 26000.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత స్థాయిల నుంచి దిగజారినట్టయితే భద్రత కోసం 25,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,800. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనపడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 24,500.

బ్యాంక్ నిఫ్టీ: రెండు నెలల డౌన్‌ట్రెండ్ అనంతరం ఈ సూచీ టెక్నికల్ రికవరీ సాధించి 54,800 వద్ద ముగిసింది. తదుపరి మానసిక అవధి 55,000. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే మరింత అప్‌ట్రెండ్ ఉంటుంది. బలహీనపడినా ప్రధాన మద్దతు స్థాయి 54,400 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది.

పాటర్న్: రెండు వారాల ర్యాలీ ప్రభావంతో నిఫ్టీ స్వల్ప ఓవర్‌బాట్ స్థితిలో ప్రవేశిస్తోంది. మరింత కన్సాలిడేషన్ ఉండవచ్చుననేందుకు ఇది సంకేతం. వీక్లీ చార్టుల్లో 25,200 వద్ద డబుల్ టాప్ ఏర్పడింది. సానుకూలత కోసం ఇక్కడ బ్రేకౌట్ సాధించాలి. అదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" పైన కూడా నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25120, 25200
మద్దతు	25000, 24930

నేడే మెగా డీఎస్సీ ఎంపిక జాబితాలు

» సుమారు 16 వేల మందికి ఉద్యోగాలు

అమరావతి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో కీలకమైన ఉద్యోగ ఎంపిక జాబితాలను పాఠశాల విద్యాశాఖ సోమవారం ప్రకటించనుంది. ఎవరెవరు ఉద్యోగాలకు ఎంపికయ్యారు? అనే పేర్లతో తుది ఎంపిక జాబితాలు విడుదల చేయనుంది. వీటిని జిల్లాల కలెక్టర్, డీఈవోల కార్యాలయాల్లో అందుబాటులో ఉంచుతారు. అలాగే http-s://apdsc.apcfss.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని డీఎస్సీ-2025 కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, నోటిఫికేషన్‌లో పేర్కొన్న 16,347 పోస్టులకుగానూ సుమారు 300కు పైగా మిగిలిపోయినట్లు తెలిసింది. దాదాపు 16 వేల మంది అభ్యర్థుల పేర్లను ఎంపిక జాబితాల్లో ప్రకటించనున్నారు. పలు మేనేజ్‌మెంట్లలో కొన్ని సామాజికవర్గాల్లో అభ్యర్థులు లేకపోవడంతో ఈ పోస్టులు మిగిలాయి. తొలుత 600కు పైగా పోస్టులు మిగిలే పరిస్థితి ఏర్పడగా.. మిగిలిన పోస్టులను వీలైనంత మేర తగ్గించేందుకు ఏడు విడతల్లో అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. ఆ అభ్యర్థులు ఏవైనా కారణాలతో తిరస్కరణకు గురైతే.. ఆ తర్వాత మెరిట్‌లో ఉన్న వారిని ఈనెల 13 వరకు సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. దీంతో చివరికి దాదాపుగా 16 వేల పోస్టులకు అభ్యర్థులు ఎంపికై ఉద్యోగాలు సాధించారు. మిగిలిన పోస్టులను తర్వాత డీఎస్సీల్లో భర్తీ చేస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 19న అమరావతి సచివాలయం సమీపంలో భారీ సభ నిర్వహించి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వనున్నారు. 30 వేల మందికి పైగా పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం ఈనెల 22 నుంచి 29 వరకు కొత్త టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. దసరా సెలవుల అనంతరం బడులు తెరుచుకునే రోజున కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా అధికారులు చర్యలు చేపట్టారు.

పకడ్బందీగా మెగా డీఎస్సీ ప్రక్రియ

రాష్ట్రవ్యాప్తంగా 16,347 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 20న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందని డీఎస్సీ-2025 కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఏప్రిల్ 20 నుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరించగా.. 3,36,300 మంది అభ్యర్థుల నుంచి 5,77,675 పోస్టులకు దరఖాస్తులు అందాయన్నారు. జూన్ 6 నుంచి జూలై 2 వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. అనంతరం ప్రాథమిక, తుది 'కీ'లు విడుదల చేశామన్నారు. టెట్ మార్కుల సవరణలకు పలుమార్లు అభ్యర్థులకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు.

కొండపై తిష్టవేసిన వారి తరలింపు

» తిరుమలలో తనిఖీలు.. 82 మంది గుర్తింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుమల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రతను దృష్టిలో ఉంచుకుని తిరుమల నుంచి యాచకులు, గుర్తింపులేని వ్యాపారులు, తిష్టవేసిన వ్యక్తులను ఆదివారం తరలించారు. ఇలాంటి వారి చర్యల వల్ల ఇటీవల తిరుమలలో జరుగుతున్న అపవిత్ర ఘటనలపై 'ఇదేం గోల గోవిందా!' శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈక్రమంలో సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో టీటీడీ విజిలెన్స్, హెల్త్, పోలీసులు సంయుక్తంగా ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కల్యాణకట్ట, షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఉన్న 82 మందిని గుర్తించి తిరుమల నుంచి తిరుపతికి తరలించారు. ఇకపై నిరంతరాయంగా ఈ తనిఖీలు కొనసాగుతాయన్నారు.

రాష్ట్రంలో కొత్తగా 17 అగ్నిమాపక కేంద్రాలు

» రాష్ట్ర అగ్నిమాపక డైరెక్టర్ జనరల్ పీవీ రమణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతనంగా 17 అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు 15వ ఆర్థిక సంఘం అనుమతించిందని రాష్ట్ర అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్ పీవీ రమణ తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఆర్యాపురం అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం అగ్నిమాపక శాఖకు రూ.252 కోట్లు బడ్జెట్ కేటాయించిందని, ఫేజ్-1లో రూ.72 కోట్లను విడుదల చేసిందని చెప్పారు.

ఆక్వా రైతును ఆదుకోండి

» అమెరికా సుంకాలతో రూ.25వేల కోట్ల నష్టం

» 5శాతం జీఎస్టీని తాత్కాలికంగా మినహాయించాలి

» కేంద్ర మంత్రులకు సీఎం చంద్రబాబు లేఖలు

అమరావతి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అమెరికా విధించిన సుంకాలతో ఇబ్బంది పడుతున్న ఆక్వా రైతాంగాన్ని ఆదుకోవాలని కేంద్రానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వివిధ శాఖల కేంద్ర మంత్రులకు ఆదివారం ఆయన వేర్వేరుగా లేఖలు రాశారు. జీఎస్టీ, ఆర్థిక వెసులుబాట్లు వంటి అంశాలు పరిశీలించాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు, ఇతర దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌కు, దేశీయ మార్కెట్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌కు లేఖలు రాశారు. 'ఏపీకి జాతీయ స్థాయిలో రొయ్యల ఎగుమతుల్లో 80శాతం వాటా, సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో 34శాతం వాటా ఉంది. రూ.21,246 కోట్ల విలువైన సముద్ర, మత్స్య ఉత్పత్తులు ఏపీ నుంచి ఎగుమతి అవుతున్నాయి. సుంకాలు పెరగడంతో రాష్ట్రంలో ఆక్వా రంగంపై ఆధారపడిన 2.5లక్షల ఆక్వా రైతు కుటుంబాలతో పాటు ఆక్వా అనుబంధ రంగాలపై ఆధారపడిన 30లక్షల మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుంకాల ప్రభావంతో రూ.25వేల కోట్ల మేర నష్టం జరిగి ఉంటుంది. 50శాతం మేర ఎగుమతుల ఆర్డర్లు రద్దయ్యాయి. దాదాపు 2వేల కంటైనర్లలో జరుగుతున్న ఎగుమతులపై రూ.600కోట్ల భారం పడింది' అని కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఆక్వా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఆక్వా ఫీడ్ ఉత్పత్తిదారులతో జరిగిన చర్చల ఫలితంగా కేజీ ఫీడ్ ఎమ్మార్పీపై రూ.9మేర తగ్గించగలిగామని, ఆక్వా రైతులకు సబ్సిడీతో ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేసే ఆలోచన చేస్తున్నామని వివరించారు. ఎగుమతిదారులకు, ఆక్వా కంపెనీలకు బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం, వడ్డీ చెల్లింపులపై 240 రోజుల పాటు మారటోరియం విధించాలని కేంద్ర ఆర్థికమంత్రిని కోరారు. వడ్డీ రాయితీ కల్పించడంతో పాటు, ఫ్రోజెన్ రొయ్యలపై ఉన్న 5శాతం జీఎస్టీని తాత్కాలికంగా మినహాయించడం వంటిచర్యలు తీసుకోవాలని కోరారు. అమెరికా కాకుండా ఇతర దేశాలకు ఆక్వా మార్కెట్‌ను విస్తరించే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఈయూ, దక్షిణ కొరియా, సౌదీ, రష్యాకు ఆక్వా ఎగుమతులు పెరిగేలా ఆయా దేశాలతో ఫ్రీట్రేడ్ ఒప్పందాలు కుదుర్చుకునే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఎగుమతిదారులకు మధ్యంతర ఆర్థిక సహాయం, ఎగుమతులపై విధించే సుంకాలు, పన్నుల ఉపశమనం పథకంపై మరింత స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యూరోపియన్ యూనియన్ దేశాలకు సీ-ఫుడ్ సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఎగుమతిదారులు తమకు సమాచారం ఇచ్చారని చంద్రబాబు వివరించారు. దేశీయంగా ఆక్వా మార్కెట్ పెంచుకోవటానికి రూ.100కోట్లతో కార్పస్ ఫండ్ కేటాయించాలని కోరారు. కోల్డ్ స్టోరేజీలు, హైజనిక్ ఫిష్, సీ-ఫుడ్ మార్కెట్ల ఏర్పాటు చేయాలన్నారు. రైతుల నుంచి ఆక్వా ఉత్పత్తులను నేరుగా మార్కెట్లకు తరలించేలా ఏపీ రొయ్యల ఉత్పత్తిదారుల సమన్వయ కమిటీని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అలాగే దేశంలోనూ సీ-ఫుడ్ వినియోగం పెంచేలా చర్యలు చేపట్టాలని, కోరారు. దక్షిణాది నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు ఆక్వా ఉత్పత్తుల రవాణా కోసం ప్రత్యేక రైళ్లు నడపాలని కోరారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా మత్స్యకారులకు రూ.1లక్ష వరకు వన్‌టైమ్ టాపప్ రుణాలివ్వాలని, కొత్త మార్కెట్లలో పోటీతత్వాన్ని పెంచడానికి ఎఫ్‌ఐడీఎఫ్ ద్వారా ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, కోల్డ్ చైన్ సౌకర్యాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఐకార్-సీఐబీఏ, ఐకార్-ఎన్‌బీఎఫ్‌జీఆర్ వంటి సంస్థల ప్రాంతీయ కార్యాలయాలు ఏపీలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులకు రాసిన లేఖల్లో సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

చెవిరెడ్డి లీలలు, వెంకటేశ్ విన్యాసాలతో నేడు మూడో చార్జిషీటు!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేసేందుకు 250 కోట్ల నుంచి రూ.300 కోట్లు పంపిణీ చేసినట్లు సిట్ గుర్తించింది. ఈ సొమ్మును హైదరాబాద్‌లోని రాజ్ కసిరెడ్డి గ్యాంగ్ వెంకటేశ్ నాయుడికి అందజేస్తే.. తర్వాత తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(తుడా) వాహనాల్లో చెవిరెడ్డి అనుచరులు హైదరాబాద్‌కు వెళ్లి డబ్బులు తీసుకొచ్చి ఏపీలో వైసీపీ నేతలకు చేర్చారు. ఈ క్రమంలో గత ఏడాది మే 9న.. లారీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలో హైదరాబాద్ నుంచి తీసుకొస్తున్న రూ.8.37 కోట్లు ఎన్టీఆర్ జిల్లా సరిహద్దులో చిల్లకల్లు పోలీసుల తనిఖీల్లో బయట పడింది. ఆ సొమ్ము ఎవరిదని ఆరా తీసిన సిట్ అధికారులు.. మద్యం ముడుపులు అందుకుని వైసీపీ అభ్యర్థులకు ఇచ్చేందుకు తెస్తున్నట్లు తేలడంతో జప్తు చేశారు. ఆ డబ్బులు లెక్క పెట్టిన వీడియోలను వెంకటేశ్ నాయుడి సెల్‌ఫోన్‌లో గుర్తించి ఫోరెన్సిక్ ఆడిట్‌లో నిర్ధారించుకున్నారు. ఈ ఆధారాలు చూపించి చెవిరెడ్డి, వెంకటేశ్‌నాయుడి పాత్రను కోర్టుకు వివరించనున్నట్లు సమాచారం.

పరారీ యత్నంలో పట్టివేత

మద్యం స్కాంలో తమను నిందితులుగా చేర్చినట్లు తెలియగానే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్‌నాయుడు శ్రీలంక మీదుగా విదేశాలకు పారిపోయే ప్రయత్నం చేశారు. అప్పటికే సీఐడీ లుక్‌అవుట్ సర్క్యులర్ జారీ చేయడంతో బెంగళూరు విమానాశ్రయంలో జూలై 17న ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకుని సిట్ అధికారులకు అప్పగించారు. మరోవైపు బాలాజీ కుమార్ యాదవ్, ఎద్దల నవీన్ కృష్ణ పారిపోయి మధ్యప్రదేశ్‌లో మకాం వేశారు. వారి ఆచూకీ గుర్తించిన సిట్ అక్కడకు వెళ్లి చాకచక్యంగా అదుపులోకి తీసుకుంది. చెవిరెడ్డి, వెంకటేశ్ విజయవాడ జిల్లా జైల్లో ఉండగా.. నవీన్, బాలాజీ గుంటూరు జిల్లా జైల్లో ఉన్నారు.

స్థానికంగా స్థిరాస్తుల.. ఆఫ్రికాలో పెట్టుబడులు..

మద్యం ముడుపుల సొమ్ములో కొంత మొత్తాన్ని చెవిరెడ్డి దారి మళ్లించి స్థిరాస్తి కొనుగోలు చేసినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఇటీవల తిరుపతిలో జరిపిన సోదాల్లో గూడూరులో రూ.6 కోట్లకు కొనుగోలు చేసి 26 కోట్లకు విక్రయించిన భూమి వివరాలు బయట పడ్డాయి. ఆ సొమ్ముతో తిరుపతి పరిసరాల్లో రైతుల నుంచి భూములు కొని.. తుడా నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించి భారీ ధరకు విక్రయించి రూ.వందల కోట్లు ఆర్జించినట్లు తేలింది. ఆ సొమ్మును ఆఫ్రికా దేశాల్లో మైనింగ్‌పై పెట్టుబడిగా పెట్టినట్లు సమాచారం. డొల్ల కంపెనీలు సృష్టించి మనీ రూటింగ్‌కు పాల్పడిన చెవిరెడ్డి.. స్థానికంగా భూముల కొనుగోలులో యజమానులను మోసగించినట్లు తిరుచానూరు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడి భార్య నుంచి దక్కించుకున్న భూమి రిజిస్ట్రేషన్‌లో బయటపడింది. వీటితో పాటు మాజీ ఉపముఖ్యమంత్రి (ఎక్సైజ్) నారాయణస్వామి వాంగ్మూలం, విదేశాల్లో దాక్కుని ఇటీవలే సిట్ ముందుకొచ్చి వాస్తవాలు వెల్లడించినవారి వాంగ్మూలాలు సైతం తాజా చార్జిషీటులో పొందుపరిచే అవకాశముంది.





శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ టీసీడీ శేఖర్, జస్టిస్ నగేష్ భీమపాక

శ్రీవారి సేవలో ఏపీ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక దర్శించుకున్నారు. న్యాయమూర్తులకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

బొట్టు పెట్టి పిలిచి.. భోజనాలు పెట్టి

» సౌదీ అరేబియాలో ఘనంగా పవన్ జన్మదినోత్సవం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సౌదీ అరేబియాలోని జనసేన అభిమానులు పవన్ కల్యాణ్ జన్మదినోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రియాద్ నగరంలోని ప్రవాసాంధ్ర కుటుంబాలను బొట్టుపెట్టి మరీ కార్యక్రమానికి ఆహ్వానించారు. వీర మహిళలు దుగ్గరపు ఉషా, చేతన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా జనసేన అధ్యక్షుడు తాటికాయల మురారి, ఆనందరాజు, పోకూరి ఆనంద్, రావూరి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భారతదేశంలో మహిళలకు పెద్దపీట వేస్తున్న ఏకైక నాయకుడు పవన్ కల్యాణ్ అని ఉష చెప్పారు. రికార్డు స్థాయిలో జనసేన కార్యకర్తలు రక్తదానం చేశారు. జనసేన కార్యకర్తలే వంటలు చేసి, వడ్డించారు. కార్మిక క్యాంపుల నుంచి ఐటీ ఉద్యోగుల వరకు ప్రవాసాంధ్రులంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలుగు ప్రవాసీ ప్రముఖులు స్వర్ణ స్వామి, ముజమ్మీల్ శేఖ్, అంటోనీ, రమ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణలో ఉభయ గోదావరి జిల్లాల ప్రవాసాంధ్రుల ప్రాబల్యం స్పష్టంగా కనిపించింది.

పాకాలవారిపల్లె అటవీ ప్రాంతంలో ఇద్దరి ఆత్మహత్య

» దంపతులుగా అనుమానం.. పిల్లలను పూడ్చి ఉంటారని అనుమానాలు!

చంద్రగిరి/ పాకాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం పాకాలవారిపల్లె అటవీ ప్రాంతంలో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పాకాలవారిపల్లె నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతం మూలకోనలో చెట్టుకు ఉరేసుకుని ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నట్టు గొర్రెల కాపరులు ఆదివారం సాయంత్రం పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వెళ్లి చూడగా మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయి. దంపతులై ఉంటారని, వారం కిందట మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. అక్కడే రెండు గోతులు తీసి, ఎత్తుగా మట్టి ఉండటం కనిపించింది. గోతిలో ఇద్దరు పిల్లలను పూడ్చివేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. సంఘటనా స్థలంలో మద్యం, కూల్ డ్రింక్ బాటిళ్ళు, మాత్రలు, సెల్‌ఫోన్ చార్జర్, చిన్న పిల్లల దుస్తులు, మొలతాళ్లు ఉన్నాయి.

సోమవారం 15 సెప్టెంబరు 2025
వివిధ
vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

పూల బాట కావాలా నాయనా...

1
నడుస్తున్నాను, నడుస్తూనే ఉన్నాను
దుఃఖపు తీగ పైపైకి ఎగబాకుతున్నప్పుడు
నడవడం ఇప్పుడొక అనివార్యత.

ఎందుకో తెలియదు, అర్థమూ కాదు
ఎప్పటివరకో, ఎందాకో గమ్యమూ ఉండదు
నడవడం ఇక తప్పనిసరి అని తెలిసాక
అడుగులు వాటంతటవే ఆలోచనలను వెంటేసుకుని
తెలియని దారెంబడి ప్రయాణం మొదలు పెడుతాయి.

2
ఒక్కసారి మొదలయ్యాక
నడుస్తూనే ఉండాలే నడుస్తూ సాగిపోతూనే ఉండాలే
మొండిచేసి, సాహసించి, ఆగిపోయి వెనుకడుగేస్తే
బతుకుమీద అవమానం బండ కూలిపోతది
నడకతో పాటు ఊపిరే శాశ్వతంగా ఆగిపోతది.

నడవాలే
తప్పక నడవాలే
ఆగిపోకుండా నడుస్తూనే ముందుకు సాగిపోవాలే

3
రాళ్లురప్పలు అడ్డొస్తాయి
బొబ్బలెక్కి రక్తమోడుతుంటది
ముళ్లపొదలు ఎదురవుతాయి
కాళ్లకు గీసుకొంటూ రక్త చరితలు రాస్తుంటాయి
ఉన్నట్టుండి దాటికే అడ్డంగా పెద్ద కంచె మొలుస్తుంది
తెలియకుండానే కాలం పరీక్షకు సిద్ధం చేస్తుంది



భరించాలే అన్నీ భరించాలే
ప్రేమించాలే అన్నింటినీ సమానంగా ప్రేమించాలే
సర్దుకోవాలే ఒక్కొక్కదానికి సుతారంగా సర్ది చెప్పాలే
సిద్ధం కావాలే అన్ని కాల పరీక్షలకు సిద్ధం కావాలే
బతిమిలాడో, ప్రాధేయపడో, ఓర్పుతోనో, నేర్పుతోనో
మెల్లగా ఒప్పించి
కొంచెం కొంచెం దారిచేసుకుంటూ
కంచె దాటి ముందుకు అడుగేసి నెగ్గాలే.

4
అంతే, ఏమీ లేదు
దుఃఖాన్ని నదిగా చేసుకుని ప్రవహించినంత కాలం
నువ్వు ఒట్టి పోతూనే ఉంటావు
పాదాలు నెత్తుటి మరకలవుతున్నాయని
ఆగి ఆగి చూసుకున్నంత కాలం
ఏ చిన్న కంచెనూ దాటలేవు.

5
నడవాలే, నడుస్తూనే ఉండాలే
దాటాలే, అన్నింటిని దాటాలే
సిద్ధ పడాలే అన్నింటికి సిద్ధపడి అడుగేయాలే

దుఃఖపు తీగ తెగి పడుతది
బతుకు తొవ్వ పూల దారై పరుచుకుంటది.

■ బిల్ల మహేందర్
✆ 91776 04430

మొదటి నవలల పోటీ

కొత్త రచయితల మొదటి నవలలకు పోటీ నిర్వహిస్తున్నాం ప్రథమ, ద్వితీయ బహుమతులు వరుసగా రూ.20వేలు, రూ.10వేలు. 2020–25 సంవత్సరాల మధ్య రాసిన, ప్రింట్‌లో 100 పేజీలకు తగ్గకుండా, 250 పేజీలకు మించకుండా ఏ పత్రికలోనూ ప్రచురితంకాని వాటిని తప్పనిసరిగా టైప్ చేసి అక్టోబరు 31లోగా చిరునామా: డి. స్వప్న, అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్, 20-7-71, ఎక్సైజ్ కాలనీ, హనుమకొండ, వరంగల్-506 001, ఫోన్: 99892 91299కు పంపాలి.

అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్

'బోరచెక్కు' & 'మ్యాజిక్ ఇఫ్' కథలు

ఇండ్ల చంద్రశేఖర్ రాసిన 'బోరచెక్కు' & 'మ్యాజిక్ ఇఫ్' కథా సంపుటాల ఆవిష్కరణ సభ సెప్టెంబరు 20 సా.6గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. 'బోరచెక్కు' ఆవిష్కర్త సిద్ధార్థ, 'మ్యాజిక్ ఇఫ్' ఆవిష్కర్త కె. శ్రీనివాస్. అధ్యక్షత కోయి కోటేశ్వరరావు, ఇతర వక్తలు రామచంద్రారెడ్డి, ఆదిత్య కొర్రపాటి.

బోధి ఫౌండేషన్

తెలంగాణ సంకలనం 'కందిలి'

పదకొండు మంది తెలంగాణ కథకుల కథలతో రూపొందిన సంకలనం 'కందిలి' ఆవిష్కరణ సెప్టెంబర్ 21న ఖమ్మంలో వేదిక ఫంక్షన్ హాల్‌లో జరుగుతుంది. ఈ సందర్భంగా 'కథ – చర్చ' సెమినార్ ఉ.10గంటల నుంచి సా.5గంటల వరకు జరుగుతుంది. ఎస్. వేణుగోపాల్, సంగిశెట్టి శ్రీనివాస్, జూపాక సుభద్ర, పెద్దింటి అశోక్ కుమార్, సిద్దెంకి యాదగిరి, పదకొండు మంది కథకులు పాల్గొంటారు.

ధరణికోట రమేష్ కుమార్

శిఖామణి సాహితీ పురస్కారాలు

'కవిసంధ్య', యానాం సాహిత్యంలో జీవన సాఫల్య కృషికి యిచ్చే శిఖామణి సాహితీ పురస్కారానికి కొలకలూరి ఇనాక్, యువ కవులకు యిచ్చే శిఖామణి యువ పురస్కారానికి అవధానుల మణిబాబు ఎంపికయ్యారు. కవిసంధ్య ప్రతిభా పురస్కారాలకు– పి.ఆర్.ఎల్. స్వామి, కోయి కోటేశ్వరరావు, వరుగు భాస్కర్ రెడ్డి, పచ్చిమాల శివనాగరాజు, పుప్పాల సూర్యకుమారి, పొనుగుమట్ల అశోక్ కుమార్, పెనుమాక రత్నాకర్, మిరప మహేష్ ఎంపికయ్యారు. వివరాలకు: 9440105978. అక్టోబర్ చివరి వారంలో పురస్కార ప్రదానం ఉంటుంది.

దాట్ల దేవదానం రాజు



అబ్రకదబ్ర అంటే అక్షరం పుట్టదు!

మనిషి భావోద్వేగాల పుట్ట. ఏ రచనకైనా భావోద్వేగం ఊపిరి. అంతమాత్రాన భావోద్వేగానికి గురైన ప్రతి మనిషీ రచన చేయలేడు. భావోద్వేగం సృజనగా రూపుదిద్దే పరిణామం వెనుక తర్జనభర్జన పడే రసచర్య మరీ మరీ కీలకం. ఏమిటా రసచర్య, దాని నేపథ్యం ఏమిటి.

కవితలోనో కథలోనో గొప్ప భావోద్వేగం పలికింది అని చదువరి అనుభూతించిన ప్రతి సందర్భంలోనూ ఆ భావోద్వేగం నిజమేనా. ఆ రసచర్యలో కొంత కవి మాంత్రిక చర్య కూడా ఉంటుందా. ఎప్పుడైనా ఎక్కడైనా భావోద్వేగం నిజమా. లేక సృజన కేవలం సామర్థ్యమా. కవితను నేను రాయలేదు, కవితే నాతో రాయించుకుంది; పాత్రలను నేను నడపలేదు, పాత్రలే నన్ను నడిపించాయి- అని సృజనకారులు చేసే నేరాంగీకారాలు నిజమేనా, కల్పితమా. ఆ రాయించుకోవడం వెనుకా, ఆ నడవడం వెనుకా సృజనకారుడి పాత్ర ఏమిటి, ఎంత. అసలేం లేనే లేదా.

ఏ రచనైనా అదాటున గాల్లోనుంచి ఊడిపడుతుందనీ, ఏదో ఒక మాయ వచ్చి చెవుల్లో గుసగుసలాడి వెళ్లిపోతుందనీ అనుకుంటే అది భ్రమే. నిజమైన క్రిమికీటకాలతో సహా ఊహాత్మక పూదోటను సృష్టించడమే రచన అన్నాడు మూర్.

సృజనకారుడు వెలిబుచ్చే భావోద్వేగాలు నిజాలు కానక్కరలేదు. నిజమని చదువరికి అనిపించాలి, అంతే. అదే సృజనకారుడి కళాలాఘవం. భావోద్వేగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడానికి కవి జర్నలిస్టు కాదు. సృజన అంటే అక్షరాలను భావోద్వేగంగా మార్చడం, కలలను నిజాలుగా మార్చడం, కళను మానవీయ అనుభవంగా మార్చడం. అందుకే కావచ్చు కళారూపంలోని అది కేవలం సామర్థ్యం. కేవలం కౌశలం. సృజనకారులుగా ఎవరూ పుట్టరు. పిచ్చిపట్టినట్టు చదవడం వల్ల, ఒళ్లు మరచి శ్రద్ధగా వినడం వల్ల, తరచూ విఫలం కావడం వల్ల మాత్రమే సృజనకారులు తయారవుతారు. పద ప్రయోగంలో యాదృచ్ఛికత వీలుకాదు.

పదాలను అప్రమత్తంగా ఎలా అమర్చాలి, ఎక్కడ వాక్యం తెగాలి, ఎక్కడ రూపకం పడాలి, ఎక్కడ ఏ అర్థం వ్యాపించాలి అనేది సృజనకారుడి నేర్పు. ఒక వేళ అలా అన్నీ అదాటున వచ్చి పడ్డట్టు అనిపించినా అది గత పఠనానుభవం, జీర్ణం చేసుకున్న సాహితీ అనుభూతుల మేళవింపు, అంతే. అమ్మ మరణం గురించి అనేక కవితలు వచ్చాయి. వాటిలో ఒకటో రెండో మాత్రమే గుర్తుపెట్టుకునేట్టుగా ఉండడానికీ అలా ఉండనివాటికీ నడుమ తేడా కేవలం కవి సాహితీ శ్రమ. కాల్ గర్ల్ వేదన చెప్పే కొన్ని వందల కవితలు వచ్చాయి. ఇక్కడా అంతే ఒకటో రెండో మాత్రమే గుండెను చెమర్చడానికీ, మిగతావి కేవలం పొడిపొడిగా మిగిలిపోవడానికీ కారణం కవి సత్తాలోని తేడా మాత్రమే. ఎప్పుడైనా ఎక్కడైనా వేదన నిజమేనని పాఠకుడికి భ్రాంతి కల్పించాలి అన్నాడు వేగుంట మోహన ప్రసాద్. భ్రమ కల్పించడం మోసం కదా అని ఎవరైనా వాదించొచ్చు. కానీ కళారూపంలో భ్రమ సృష్టి మోసం కాదు. భావోద్వేగ వాస్తవాన్ని చేరడానికి లేదా పాఠకుడిని చేర్చడానికి అదొక మాధ్యమం.

రచన మాయాజాలం కాదు. కవిత్వమైనా కథైనా నవలైనా ఏ సాహిత్య ప్రక్రియైనా అదొక కూర్పు, నిర్మాణం, నైపుణ్యం. భాషతో భావాన్ని కలిపి కచ్చితంగా ఎక్కడ కూడబెట్టాలో అక్కడ కూడబెట్టే కళ. భావోద్వేగం అనే భావన కేవలం ముడిసరుకు మాత్రమే. నిజమైన సృజన ఆ సృజనకారుడు ఒక శిల్పిలాగా బండరాయిని తన సామర్థ్యంతో శిల్పంగా చెక్కినపుడు మాత్రమే ఆకారం దాలుస్తుంది. సృజన ఒక ఉద్దేశ్యపూర్వక ప్రక్రియ. భావోద్వేగం ఒక ఆరంభపు మెరుపు లాగా మొదలుపెట్టించవచ్చుగాక. కానీ ఆ మెరుపు వెలుగుకు రూపాన్ని నిర్ణయించేది. సృజనలోకి భావోద్వేగంలో ఉండదు. లోచూపులో ఉంటుంది. దాని శిల్పచాతుర్యంలో ఉంటుంది.

గాయపడ్డ వ్యక్తి కొన్ని పదాలను కుమ్మరిస్తే అది నాటకీయత అవుతుందే తప్ప సృజన కాదు. సమర్థుడైన సృజనకారుడు కల్పిత దుఃఖాన్ని రచిస్తూ కూడా గుండెలు పిండే రూపంగా దాన్ని ఆవిష్కరించగలడు. ఇది హోంపట్నని జరిగే అబ్రకదబ్ర కాదు. అంగీకరించినా అంగీకరించకపోయినా కళ ప్రక్రియ అంతిమపు వైశిష్ట్యానికి రూపమిచ్చేది సృజనకారుడి ప్రతిభే తప్ప ఇంకేదో కాదు. గుండె పగిలిన కవిత్వం కేవలం కన్నీటి చుక్క వల్ల రాదు. అద్భుతంగా లోనైన స్పష్టత, రూపం కోసం పడే తపన వల్ల మాత్రమే సాధ్యం.

గొప్ప గొప్ప సృజనకారులు దాంటే, షేక్స్‌పియర్, మీరాబాయి, గాలిబ్, ఠాగూర్, గుల్జార్, నెరుడా, కాఫ్కా, పతంజలి, శ్రీశ్రీ, చండీదాస్, మో అందరూ నిర్మాణ కౌశలులే. అనేకానేక సార్లు తమ సృజనను మార్చిమార్చి తిరగ రాయడంలో చేయితిరిగినవారే. సృజన నియమాలను గౌరవిస్తూనే ఉల్లంఘించినవారే. సృజనకారులనేవారు భాషా భావ ప్రపంచాల శిల్పి. ఆ శిల్పం వెనుక కేవలం భావోద్వేగం ఉండదు. కాపీ బుక్ క్రమశిక్షణ ఉంటుంది. అలసట ఎరుగని సృజనకారుడి చెయ్యి ఉంటుంది. ఆ చేయికి తెలిసిన పట్టువిడుపులుంటాయి. ప్రతి కవితనూ ప్రతి రచననూ భావోద్వేగం ఒక్కటే పుట్టించదనీ ప్రతి విషాద రచయితా 'షేక్స్‌పియర్' కావాలి కదా. ఒక వాస్తవాన్ని వాస్తవంగా వెల్లడించినంత మాత్రాన అది సృజన అవదు. దానికి కవిత్వశకలం అవసరం. సంక్లిష్టతను కూర్చాలి. శబ్దాన్ని అమర్చాలి. అలా కాని నాడు డైరీ రాతకీ పద్యానికీ తేడా ఉండదు. డైరీలో నిజాలుంటాయేమో కానీ కవిత్వం ఉండదు.

రాసే ప్రతివాడి బాధా ప్రపంచం బాధ కాగలిగితే కుప్పలు తెప్పలు కృష్ణశాస్త్రులుండేవారు. ప్రపంచం బాధను ప్రతి రాసేవాడూ తన బాధగానే స్వీకరించి ఉంటే పుట్టకొద్దీ శ్రీశ్రీలుండేవారు. ఆ మిగతావాటికి శ్రీశ్రీ-కృష్ణశాస్త్రులకీ మధ్య ఉన్న తేడా కేవలం నైపుణ్యం, సామర్థ్యం మాత్రమే.

సారమే రూపాన్ని ఎంచుకుంటుంది అనే మరి కొందరి వాదన కూడా ఈ చర్చ పరిధిలోకే. అది పూర్తిగా భ్రమ. సారాన్నీ రూపాన్నీ రెంటినీ సృజనకారుడే ఎంచుకుంటాడు. రూపం కేవలం సారం వల్ల ఏర్పడే నిష్క్రియాత్మక అంశం కాదు.

రచన మాయాజాలం కాదు. కవిత్వమైనా కథైనా నవలైనా ఏ సాహిత్య ప్రక్రియైనా అదొక కూర్పు, నిర్మాణం, నైపుణ్యం. సృజనకారులుగా ఎవరూ పుట్టరు. పిచ్చిపట్టినట్టు చదవడం వల్ల, ఒళ్లు మరచి శ్రద్ధగా వినడం వల్ల, తరచూ విఫలం కావడం వల్ల మాత్రమే సృజనకారులు తయారవుతారు.

రూపానికీ స్వతంత్రంగా సాహిత్యాన్ని ప్రభావితం చేసే శక్తి ఉంటుంది. రూపం సారాన్ని పునర్నిర్మిస్తుంది. సారానికి బలాన్నిస్తుంది. తెలుగులో ప్రస్తుతం వస్తున్న కథల విషయంలోనూ ఇది నిజం. చాలామంది ఈ తరం కథకులు వాస్తవిక ప్రపంచాన్ని ఆవిష్కరించేందుకు కూడా రూపకాత్మక నిర్మాణాన్నే ఎంచుకుంటున్నారు. సారాన్ని ఆకారమంత విస్తృతం చేసే వైశాల్యం రూపం. అదొక సౌందర్యాత్మక తీవ్రత. ఎత్తుగడల గాఢత.

సృజనకారుడు కొన్ని కొన్ని ప్రకటనల ద్వారా తనను తాను హెచ్చించుకునేందుకు తగ్గించుకున్నట్టుగా నటిస్తాడు. నిర్మిత భావోద్వేగాన్ని అనుభవిక భావోద్వేగంగా ఏమార్చడమే సృజనకారుడు చేస్తాడు. ఏ సృజనా అద్భుతం కాదు. ప్రతి సృజన సౌధం వెనుకా కేవలం భావోద్వేగం ఉండదు. వ్యక్తిగత ఉద్వేగాన్ని సృజనకారుడు విశ్వ మానవీయ భావాత్మక ఉద్వేగంగా చెక్కాలి, నిర్మించాలి, కూర్చాలి, అమర్చాలి.

ప్రతి రచన వెనుకా అనేకానేక డిసిక్షనులు ఉంటాయి. అందుకే పాఠకుడు సృజనను అనుభవిస్తూనే సృజనకారుడిని డీమిస్టిఫై చేసుకోవాలి. వాస్తవ భావోద్వేగ మూలాల ఎరుక కన్నా అవాస్తవ భావోద్వేగ భ్రమలే సృజనలో ముఖ్యం.

■ ప్రసేన్
✆ 70133 58154

తల్లి పంచిన ప్రేమలూ గాయాల చిట్టా!


సాహిత్య ప్రపంచంలో సుపరిచితమైన పేరు అరుంధతి రాయ్. సామాజిక ఉద్యమకారిణిగా కూడా పేరు తెచ్చుకున్నారు. బుకర్ ప్రైజ్ పొందిన తన మొదటి నవల 'ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్'తో ప్రపంచాన్ని ఆకట్టుకున్న ఆమె, ఈసారి తన కలాన్ని తొలిసారిగా అంతర్గత ప్రపంచం వైపు మళ్లించారు. 'మదర్ మేరీ కమ్స్ టు మీ' అనే తన తొలి స్మృతిగ్రంథం (memoir)లో ఆమె తన తల్లి మేరీ రాయ్‌తో తనకు ఉన్న సంక్లిష్ట బంధాన్ని పాఠకుల ముందు ఉంచారు. ఇది కేవలం ఒక కూతురు తన తల్లికి నివాళిగా రాసిన పుస్తకం కాదు. ఈ పుస్తకం ఒక యుద్ధ ప్రకటనలా కనిపిస్తుంది. తల్లిలోని కాఠిన్యం వల్ల తనకు కలిగిన గాయాలకు, ఆ గాయాల నుంచి తాను పొందిన స్వేచ్ఛకు ఈ పుస్తకం అద్దం పడుతుంది. మేరీ రాయ్ ధైర్యం, ఆమె ప్రేమ, ఆమె కఠినత్వం, ఆమెలోని విషం... వీటన్నిటినీ అరుంధతి రాయ్ ఈ పుస్తకంలో సున్నితంగా విశ్లేషించారు.

అరుంధతికి తల్లిగా అపారమైన ప్రేమను, మద్దతును పంచి ఇచ్చారు మేరీ రాయ్. కానీ అదే సమయంలో ఆమె జీవితాన్ని ఒక



పెను తుపానులా కుదిపేశారు కూడా. "ఆమె ఆలోచించడం నేర్పింది, కానీ నా ఆలోచనలకే వ్యతిరేకంగా పోరాడింది. నన్ను రాయమంది, కానీ నేను రచయిత్రిగా ఎదిగినప్పుడు అసహనం చూపించింది. ఆమె నా ఆశ్రయం, ఆమే నా తుఫాను కూడా," అని రాస్తారు అరుంధతి.

"మేరీరాయ్ చాలామందికి రోల్ మోడల్. తిరుగుబాటుదారు, ప్రదర్శకురాలు. కానీ విద్యార్థులకు వీటన్నిటికీ మించిన వ్యక్తి. ఆమెను మేము భయంతోనూ, గౌరవంతోనూ చూసేవాళ్లం. ఆమెను సంతోషపెట్టడానికి ఏదైనా చేసేవాళ్లం. ఆమె నవ్వు మమ్మల్ని రోజంతా ఉత్సాహంగా వుంచేది. ఆమె కోపం దాన్ని పూర్తిగా నాశనం చేసేది. అమ్మ తన విద్యార్థులను ప్రేమతో చూసుకుంది. ఆ ప్రేమ వెలుగులోకి రావడానికి మేము- అంటే నేను, నా సోదరుడు ఆమె కోపాన్ని భరించాల్సి వచ్చింది. ఆమె సామ్రాజ్యంలో వాతావరణం బాగున్నపుడు ఆమె ప్రేమతో, ఆప్యాయతతో వుండేది. చిన్నప్పుడు నా సోదరుడు ఇంట్లో 'జాస్' అనే హారర్ సినిమా చూసేటప్పుడు ఆమె ఒడిలో ఎక్కి కూర్చున్నాడు. నేనైతే అలా చేయడానికి అస్సలు ధైర్యం చేసేదాన్ని కాదు. ఆ ఒడి బయటి ప్రపంచంలోని షార్క్ కన్నా ఎక్కువ భయాన్ని కలిగించింది," అని రాసారు అరుంధతి. తల్లి చేసిన గాయాలే ఇప్పటి తన బలానికి





ఒక ఆదర్శ మహిళగానే గాక, తన తల్లిలో ఉన్న సంక్లిష్టతలను, ఇతరులకు కష్టం కలిగించిన కోణాలను కూడా అరుంధతీ రాయ్ ఈ పుస్తకంలో నిస్సంకోచంగా ఆవిష్కరించారు. ఈ స్మృతిగ్రంథం ప్రతి పాఠకుడికి ఒక సత్యాన్ని గుర్తుచేస్తుంది: "మనల్ని గాయపరిచిన వారే మనల్ని నిలబెట్టేవారు కావచ్చు."

సాక్ష్యమంటారు! ఈ పుస్తకంలో తన తల్లి విరుద్ధమైన స్వభావాన్ని, ఆమె తన జీవితంపైనా, రచనలపైనా చూపిన లోతైన ప్రభావాన్ని నిజాయితీగా చిత్రించారు అరుంధతీ రాయ్.

మేరీ రాయ్ కేరళలో పుట్టి పెరిగిన సాధారణ మహిళ కాదు. ఆమె జీవితం సాంతం ఒక విప్లవమే! ట్రావెన్కోర్ క్రైస్తవ వారసత్వ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీం కోర్టు వరకు పోరాడి, క్రైస్తవ మహిళలనకు ఆస్తి హక్కును సాధించిన సాహసికురాలు. కేరళలో పళ్లికూడం స్కూల్ స్థాపించి, వేలాదిమంది పిల్లలకు విద్యను ప్రసాదించిన విద్యా సంస్కర్త. అరుంధతీ రాయ్ నవల 'ద గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్' లోని 'అమ్ము' పాత్రకు స్ఫూర్తి మేరీ రాయ్‌నే!

'మదర్ మేరీ కమ్స్ టు మీ' అనే ఈ పుస్తకం కేవలం మేరీ రాయ్ గొప్పతనాన్ని మాత్రమే చూపించలేదు. ఒక ఆదర్శ మహిళగానే గాక, తన తల్లిలో ఉన్న సంక్లిష్టతలను, ఇతరులకు కష్టం కలిగించిన కోణాలను కూడా అరుంధతీ రాయ్ నిస్సంకోచంగా ఆవిష్కరించారు. ఈ స్మృతిగ్రంథం ప్రతి పాఠకుడికి ఒక సత్యాన్ని గుర్తు చేస్తుంది: "మనల్ని గాయపరిచిన వారే మనల్ని నిలబెట్టేవారు కావచ్చు. మన జీవితంలోని కొన్ని గాయాల వెనుక కూడా ప్రేమ ఉంటుంది. ప్రేమ ఎప్పుడూ మధురంగానే ఉండదు. అది కన్నీటి తుఫానుగా కూడా వస్తుంది. కానీ, ఆ తుఫానులే మన బలానికి పునాదులు వేస్తాయి." తల్లీకూతుళ్ల బంధంలోని ఈ విరుద్ధాల మేళవింపును ఈ పుస్తకం అద్భుతంగా ఆవిష్కరించింది. అరుంధతి రాయ్ సాహిత్య ప్రతిభకు, జీవితంలోని లోతైన క్షణాలను ధైర్యంగా బయటపెట్టే ఆమె నిజాయితీకి 'మదర్ మేరీ కమ్స్ టు మీ' నిదర్శనం. ఈ పుస్తకం చదువుతున్నప్పుడు మనం కేవలం అరుంధతీ రాయ్ జీవితాన్ని మాత్రమే కాదు, మన తల్లులతో మనకున్న బంధాన్ని కూడా పునరాలోచించుకుంటాం.

■ కృష్ణ కానూరి
✆ 79813 05779

దేహపు విత్తు



విత్తనం మహిమ తెలిసిన ఇంట్లోనే కదా
ఆమె మొలకెత్తింది!

విత్తనంలో
విత్తడంలో
బతుకు ఉంటాదనే పాఠం తెలిసిన అమ్మ!

అమ్మ విత్తిన ప్రతి విత్తనమూ
మొలిచిన ప్రతి మొలకా
గెమనానికి వొస్తాయి నాకు!

నా పసితనం నుంచీ,
నన్ను అనాథను చేసేసేదాకా..
విత్తిన ప్రతి విత్తూ!

అమ్మ విత్తిన అక్షరాలు
నా చదువులుగా మొలకెత్తాయి!
అమ్మ విత్తిన ఆలోచనలు
నా బుద్ధిలో పరిణతిగా మొగ్గతొడిగాయి!
నాపై విత్తిన ఆశలు
మొలకెత్తి నా జీవితంగా వికసించాయి!
నా వీపుపై బెత్తంతో విత్తిన విత్తులు
నాకు అబ్బిన క్రమశిక్షణగా ఫలించాయి!

అమ్మ మంచి సేద్యగత్తె
విత్తడం అమ్మ లక్షణం!
నేలతల్లిని పొడుచుకుని వచ్చిన మోగు
రెండాకులు తొడిగిన కాణ్నించీ..
ఆ మొలకకు రక్షణ తొడుగు కూడా అమ్మే!
మొక్కకు దాహం తీర్చే చేరడు నీరూ అమ్మే!
వెలుతురుతో జీవం అందించే
ఏడుగుర్రాల రేడూ అమ్మే!

ఆకాశాన్ని లక్ష్యంగా ఎన్నుకుని
నిటారుగా ఎదగడం నేర్పింది అమ్మ!
బుర్ర తొలిచే పురుగులు చేరినప్పుడెల్లా
మందుల పిచికారీతో కాపాడిందే అమ్మ!
పనికిమాలిన కొమ్మల్ని ప్రూనింగ్ చేస్తూ
దృఢంగా తీరేలా చూసుకుంది అమ్మ!
అంటుకట్టి, పిలకలు ఎదిగేదాకా
ఆగి, ఆ సేద్యం అద్దంలో
తననూ, తన కష్టాన్నీ
తృప్తిగా చూసుకుంది అమ్మ!

ఆ మొక్క చెట్టు అయ్యాక..
ఆ ఫలాల్ని పూర్తిగా ఆస్వాదించకుండానే..
ఆ నీడన నిండా సేదతీరకుండా జారుకున్నదే అమ్మ!
ఆ నీడ తనకు చాలనుకున్నదా?
తన జాడ ఆ చెట్టుకు చాలనుకున్నదా?

ఆ నీడలో తన పాద తాడనాల సవ్వడులే..
ఆ చెట్టు వేర్ల గుండెచప్పుడులని
అమ్మకు తెలియదా?
నీడను ఏమార్చి తాను జారుకుంటే
ఆ గుండె నిస్సద్దు అవుతుందనీ
ఆ చెట్టు నిస్సత్తు వవుతుందనీ
అమ్మకి ఎరుకలేదా?

+++

అమ్మ తనను తాను విత్తుకుంది
తన దేహాన్ని విత్తుకుంది!
అనాటమీ ల్యాబులో మొలకెత్తుతుంది!
రేపటి డాక్టర్ల జ్ఞానంలో
పుష్పించి, ఫలించి వర్ధిల్లుతుంది!
చెట్టునీడన సేదతీరే రకం కాదు అమ్మ..
తనే శాఖోపశాఖలుగా మహావృక్షమై విస్తరిస్తుంది!

(మెడికల్ కాలేజీకి అమ్మ దేహదానం
తరువాత... మెలిపెడుతున్న యాదిలో)

■ కె.ఎ. మునిసురేష్ పిళ్లె
✆ 99594 88088

అర్థమయ్యే కథలే మేలైన కథలు అనుకునేవాణ్ని

చదువు ముచ్చట

సాయి వంశీ

రీసెంట్‌గా చదివి మీకు బాగా నచ్చిన రచన?

ఖదీర్ బాబు రాసిన 'వాన కురిసినప్పుడు మా ఇంట్లో'. ఆయన వాక్యం శ్రుతిలో రాగయుక్తంగా సాగుతున్న పాటలా ఉంటుంది.



మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

గురజాడ 'కన్యాశుల్కం'. ఇప్పటికి ఒక యాభైసార్లకు పైగానే చదివి ఉంటాను. ఎప్పుడు చదివినా మొదటిసారి చదువుతున్నట్లే అనిపిస్తుంది. అందులోని సంభాషణలు కంఠతా వచ్చేశాయి.

మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?

చందమామ, బాలమిత్ర మాసపత్రికలతో మొదలైన ప్రయాణం, ఆ తర్వాత వారపత్రికల దాకా చేరింది. 2016 నుంచి కథల మీద అమితమైన ఆసక్తి ఏర్పడింది. మొదట్లో నాకు సులభంగా అర్థమయ్యే కథలే మేలైన కథలు అనుకునేవాణ్ని. నాలో అంతర్మథనం కలిగించి, ఆలోచింప జేసే కథల ప్రాధాన్యాన్ని గుర్తించాక అలాంటి కథల్ని వెతుక్కుని చదవడం మొదలుపెట్టాను. ఇప్పటికీ కథలంటే చాలా ఆసక్తిగా చదువుతాను. నవలలంటే మాత్రం కొంత ఎక్కువ సమయం తీసుకుంటాను.



మీరు ఎక్కువసార్లు చదువుకున్న కథా సంపుటి?

చిలుకూరి దేవపుత్ర రాసిన 'వంకరటింకర ఓ!' కథాసంపుటిని ఎక్కువసార్లు చదువుకున్నాను. రాయలసీమ సాహిత్యం అంటే కరువు, రాజకీయాలు, రైతుల సమస్యలు అనే ఆలోచన ఉన్న సమయంలో ఆయన అక్కడి మనుషుల జీవితాల్లో హాస్యాన్ని కథలుగా రాశారు. వంశీ 'మా పసలపూడి కథలు' పుస్తకాన్ని కూడా ఎక్కువసార్లు చదివాను.


సాహిత్యంలో మీకు ఆల్టర్ ఈగోలా అనిపించిన పాత్ర ఏది, ఎందుకు?

నేను చదివిన పరిమిత సాహిత్యంలో ఏ పాత్రా నాకలా అనిపించలేదు. ముందు నాకు నేను పరిపూర్ణంగా అర్థమైతే, ఆ తర్వాత నాకు ఆల్టర్ ఈగోలా అనిపించే పాత్రను పోల్చుకోవచ్చు.

మీ నమ్మకాల్ని ప్రభావితం చేసిన రచన?

బిభూతి భూషణ్ బందోపాధ్యాయ రాసిన బెంగాలీ నవల 'పథేర్ పాంచాలీ' జీవితం పట్ల కొత్త దృక్పథాన్ని అందించింది. అప్పటిదాకా నేను చూస్తున్న జీవితాలకు భిన్నమైన మనుషులు ఈ ప్రపంచంలో ఉన్నారని తెలిసేలా చేసిన రచన అది. దాన్ని మద్దిపట్ల సూరి తెలుగులోకి అనువదించారు. ఆయన అనువాదం అద్వితీయం.

(2024లో 'మైక్రో కథలు' కథాసంపుటి వెలువరించారు. 'రేగి అచ్చులు' పేరుతో పుస్తక ప్రచురణ చేస్తున్నారు.)



బెడిసి కొట్టింది!

పర్యాటక యూనిట్లను ప్రైవేటీకరించాలన్న అధికారుల నిర్ణయం బెడిసి కొట్టింది. విజయవాడ డివిజన్ పరిధిలోని పర్యాటక యూనిట్లను నిర్వహించటానికి ఏ ప్రైవేటు సంస్థ కూడా ఆసక్తి చూపలేదు. సోమవారంతో నోటిఫికేషన్ గడువు పూర్తి కానుంది. దీంతో 5వ తేదీ వరకు గడువు పొడిగించాలని భావిస్తున్నారు.

పర్యాటక యూనిట్ల ప్రైవేటీకరణకు ముందుకురాని సంస్థలు

నేటితో ఆసక్తి వ్యక్తీకరణ గడువు పూర్తి

- హరిత బెర్మ్‌పార్క్‌ను తాకట్టు పెట్టి బ్యాంకు నుంచి రుణం
- లీగల్ సమస్యలు వస్తాయన్న ఉద్దేశంతో వెనకడుగు
- భవానీ ద్వీపం, సూర్యలంక, నాగార్జున సాగర్ ప్రాజెక్టులపైనా అనాసక్తి
- ఉద్యోగుల ఆందోళనలు, న్యాయ పోరాటాల నేపథ్యంలోనూ అయిష్టత

అధికారుల తీరుపై విమర్శలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ డివిజన్ పరిధిలోని హరిత బెర్మ్‌పార్క్ (పున్నమి), భవానీ ద్వీపం, సూర్యలంక, నాగార్జునసాగర్ తదితర పర్యాటక యూనిట్లను ప్రైవేటీకరణ చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయితే వీటిని నిర్వహించటానికి ఏ ఒక్క ప్రైవేటు సంస్థ కూడా ధైర్యం చేయలేదు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పేరుతో అప్పగించే వీటికి భారీగా పెట్టుబడులు పెట్టి నిర్వహించే బదులు.. అదేదో తాము స్వయంగానే బయట చేసుకుంటే వ్యాపారం బాగుంటుందన్న ఆలోచనలు చేయటంతో ఏ సంస్థ కూడా ముందుకు రాలేదని తెలుస్తోంది. కొన్ని మిగతా 6లో..

ముఖ్యమంత్రి ఆదేశాలకు భిన్నంగా..

ముఖ్యమంత్రి ఆదేశాలకు భిన్నంగా పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్ జైన్ లాభాలు వచ్చే యూనిట్లను కూడా ప్రైవేటీకరణ జాబితాలో పెట్టారు. దీంతో వివాదం రాజుకుంది. విజయవాడ డివిజన్ పరిధిలో అయితే బ్యాంకులో తనఖా ఉన్న యూనిట్లను కూడా ప్రైవేటీకరణ జాబితాలో పెట్టారు. హరిత బెర్మ్ పార్క్ పై రూ. 150 కోట్ల రుణాన్ని తీసుకోవటం జరిగింది. ఈ రుణాన్ని రాష్ట్ర వ్యాప్తంగా కాటేజీలను అభివృద్ధి చెయ్యటం కోసం అని తీసుకున్నారు. ఇప్పటి వరకు రూ. 80 కోట్ల మేర అయితే పనులు జరిగాయి. సడెన్‌గా పనులు ఆపివేసి.. ప్రైవేటీకరణ జపం ఎత్తుకున్నారు. తాకట్టులో ఉన్న బరం పార్కును ఓఅండ్ఎం కింద నిర్వహించటానికి ఏ సంస్థ కూడా ఆసక్తి చూపలేదు. ఒకవేళ దీనిని కనుక తీసుకుంటే .. భవిష్యత్తులో లీగల్ సమస్యలు వస్తాయని సంస్థలు భావించాయి. తాకట్టులో ఉన్న ఏ ఆస్తిని కూడా మరొకరికి వాణిజ్యపరంగా అప్పగించటం అన్నది లీగల్‌గా సమస్యలను కలిగిస్తుందని సంస్థలు భావించినట్టు తెలుస్తోంది. రేపు బ్యాంకు తన తనఖాలో ఉన్న యూనిట్‌ను ఏ విధంగా మరొకరికి అప్పగిస్తారని ప్రశ్నిస్తే సమాధానం చెప్పుకునే పరిస్థితి ఉండదని భావించాయి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని హరిత బరం పార్కు వైపు ఏ సంస్థ కూడా కన్నెత్తి చూడటం లేదు. భవానీ ద్వీపం తరచూ వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉందని వయబిలిటీ కాదని సంస్థలు భావించాయి. సూర్యలంక, నాగార్జున సాగర్ వంటి ప్రాజెక్టులు పట్ల కూడా ప్రైవేటు సంస్థలు ఆసక్తి చూపించలేదు. పర్యాటక శాఖ ఉద్యోగులు గట్టిగా ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నారు. న్యాయ పోరాటాలు దిశగా అడుగులు వేస్తున్నారు. దీంతో ఇబ్బందులు తలెత్తుతాయన్న ఉద్దేశ్యంతో ప్రైవేటు సంస్థలు ఏవీ ఆసక్తి చూపించటం లేదని తెలుస్తోంది.

స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, చిత్రంలో మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



వెంటాడుతున్న డయేరియా కలవరం

వైద్య శిబిరానికి పెరుగుతున్న రోగులు

- దుకాణాలు మూయిస్తున్న అధికారులు
- సీపీఎం ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు
- వద్దని వారించిన అధికారులు

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా కలవరం ఇంకా వెంటాడుతూనే ఉంది. స్థానిక కేర్ అండ్ షేర్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి రోగులు వస్తున్నారు. ఆదివారం 90 మంది రాగా, వారిలో 16 మందికి వ్యాధి లక్షణాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించి చికిత్స అందించారు. డయేరియా నివారణ చర్యల్లో భాగంగా అధికారులు న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతంలోనే కాకుండా చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో కూడా దుకాణాలు, బిర్యానీ పాయింట్లు, బార్లు, వైన్ షాపులతో పాటు మటన్, చికెన్ దుకాణాలను మూయించారు. న్యూ ఆర్ఆర్‌పేటలో ఇంటింటికి మినరల్ వాటర్‌ను పంపిణీ చేసి ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచిస్తున్నారు.

అధికారులతో సీపీఎం నేతల వాగ్వాదం

న్యూ ఆర్ఆర్‌పేటలో డయేరియాతో ప్రజలు ఇబ్బందులు పడుతుండటం, అధికారులు దుకాణాలు మూయించడంతో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం భోజన ఏర్పాట్లు చేశారు. వీటిని ఫుడ్ ఇన్స్‌పెక్టర్ రమేష్‌బాబు, ఏఎంహెచ్‌వో బాబు శ్రీనివాసరావు, నార్త్‌జోన్ మిగతా 6లో..



● ఎయిర్‌పోర్టులో దుర్గమ్మ

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ బిల్డింగ్ అరైవల్ బ్లాక్, డిపార్చర్ బ్లాక్‌లలో కనకదుర్గమ్మ చిత్రపటాలను ఆదివారం ఆవిష్కరించారు. ప్రయాణికులు దుర్గమ్మను దర్శించుకునేందుకు వీటిని ఏర్పాటు చేసినట్టు దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్ తెలిపారు. -ఇంద్రకీలాద్రి-ఆంధ్రజ్యోతి

దసరా ఏర్పాట్లు @ రూ.4 కోట్లు

ఇంద్రకీలాద్రిపై ఉత్సవాలకు నిధుల కేటాయింపు

కొండ దిగువన పనులకు రూ.2.54 కోట్లు

కొండపైన పనులకు రూ. 1.50 కోట్లు

22 నుంచి ప్రారంభం కానున్న దేవీ నవరాత్రులకు చురుగ్గా ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రిపై ఈ నెల 22వ తేదీ నుంచి జరగనున్న దసరా ఉత్సవాలకు దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.4 కోట్ల విలువైన పనులను ఇప్పటికే కాంట్రాక్టర్లకు అప్పగించారు. కొండ దిగువన రూ.2.54 కోట్లు, కొండపైన 1.50 కోట్లతో పనులు చేయనున్నారు.

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్న దసరా మహోత్సవాల ఏర్పాట్లు ఊపందుకున్నాయి. కొండ దిగువన, కొండపైన సుమారు రూ.4 కోట్ల విలువ గల పనులను కాంట్రాక్టర్లకు అధికారులు అప్పగించారు. సాధారణంగా ఆయా పనులకు సంబంధించి మిగతా 6లో..



దుర్గగుడిపై క్యూలైన్లకు రంగులు అద్దుతున్న కార్మికులు

జోరు వాన

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఎ.కొండూరు, గంపలగూడెం, ఇబ్రహీంపట్నం, వత్సవాయి, జగ్గయ్యపేటలో రోడ్లు జలమయం అయ్యాయి. బుడమేరుకు స్వల్పంగా వరద వచ్చింది. జి.కొండూరు మండలం హెచ్.ముత్యాలంపాడు వద్ద బుడమేరుపై ఉన్న లో లెవల్ చప్టాపై నుంచి వరద ప్రవహించింది. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్దకు సుమారు 1,724 క్యూసెక్కుల వరద నీరు చేరినట్లు ఏఈ వెంకటేష్ తెలిపారు. విజయవాడ నగరంలో సాయంత్రం ఐదు గంటల నుంచి సుమారు అర్ధగంట పాటు వర్షం పడింది. కొద్దిపాటి వర్షానికే పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

అన్ని రంగాల్లోనూ ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలు పురోభివృద్ధి సాధించే దిశగా ఈ ఆర్థిక సంవత్సరంలో అడుగులు వేస్తున్నాయి. భవిష్యత్తులో విప్లవాత్మక ఆర్థికాభివృద్ధి దిశగా పయనించనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలలో తమ వంతు పాత్రను పోషించబోతున్నాయి. జిల్లాల ఆర్థికాభివృద్ధికి తీసుకునే భవిష్య ప్రణాళికలను రెండు జిల్లాల కలెక్టర్లు సోమవారం ముఖ్యమంత్రితో జరిగే కలెక్టర్ల సమావేశంలో వివరించబోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతలు, ప్రాజెక్టులకు ఇచ్చే నిధుల మంజూరుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

జంటగా వృద్ధిలో పైపైకి..

ఈ ఆర్థిక సంవత్సరంలో దూసుకుపోతున్న ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు

- వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాలలో ఎన్టీఆర్ జిల్లా గణనీయ వృద్ధి
- వ్యవసాయ రంగంలో కృష్ణా ప్రగతి వీచిక.. పారిశ్రామికంపై కన్ను
- సేవా రంగంలో ముందుకెళ్లడానికి కృష్ణాజిల్లాలో అపార వనరులు
- రెండు జిల్లాల నుంచి జిల్లా వృద్ధి ప్రణాళికలు సిద్ధం
- నేటి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రికి వివరించనున్న లక్ష్మీశ, బాలాజీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లా 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు నాటికి రూ.1,12,057 కోట్ల జిల్లా దేశీయ స్థూల ఉత్పత్తి (జీడీడీపీ) సాధించి రికార్డు సృష్టించింది. అలాగే తలసరి ఆదాయం కూడా రూ. 4,17,412లను సాధించింది. గత ఆర్థిక సంవత్సరం 2024 - 25లో జిల్లా దేశీయ స్థూల ఉత్పత్తి (జీడీడీపీ) రూ.94,561 కోట్లు కాగా, తలసరి ఆదాయం రూ.3,53,150గా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో సాధించిన వృద్ధి సంతృప్తికరంగా ఉంది. వ్యవసాయ అనుబంధ రంగాలలో కానీ, పారిశ్రామికానుబంధ రంగాలలో కాని, సేవల రంగంలో కానీ ఏ రంగాన్ని చూసినా ఎన్టీఆర్ జిల్లా గణనీయమైన వృద్ధిని సాధించింది. దీనిని దృష్టిలో పెట్టుకుని 2047 నాటి కల్లా మిగతా 6లో..





మహిళా ప్రయాణికులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

స్త్రీశక్తితో మహిళా సాధికారతకు ఉత్తేజం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

బస్‌స్టేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం పథకం విజయవంతంగా అమలవుతోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. స్త్రీశక్తితో మహిళా సాధికారతకు సరికొత్త ఉత్తేజం వచ్చిందని, లబ్ధిదారుల ఆనందంతో చెబుతున్న మాటలే అందుకు నిదర్శనమని కలెక్టర్ అన్నారు. ఆదివారం కలెక్టర్ విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌ను సందర్శించి వివిధ మార్గాల్లో వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లోని మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. కలెక్టర్ పలువురు మహిళలను స్త్రీశక్తి పథకం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఉంటే 1100 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్‌చేసి తెలియపరచాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, విద్య, ఉద్యోగం, ఉపాధి, ఇతర అవసరాల కోసం ఆర్థిక భారం లేకుండా బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తూ సాధికారతతో సరికొత్త మైలురాళ్లను చేరుకుంటున్నారన్నారు. పథకం ప్రవేశపెట్టిన సీఎం చంద్రబాబుకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

నారా దేవాన్ష్‌కు శాప్ చైర్మన్ అభినందన

విజయవాడ (స్పోర్ట్స్), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తొమ్మిదేళ్ల వయస్సులోనే చదరంగంలో ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్-175 పజిల్స్‌లో ప్రపంచ రికార్డు సాధించిన నారా దేవాన్ష్‌కు శాప్ చైర్మన్ రవినాయుడు అభినందనలు తెలిపారు. లండన్ వెస్ట్ మినిస్టర్ హాల్‌లో జరిగిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డుల వేడుక జరిగింది. వేదికపై నారా దేవాన్ష్ అవార్డు అందుకున్నారు. గత ఏడాది చెక్ మేట్ మారథాన్ 175 చెక్ మేట్ సవాళ్లను పరిష్కరించి దేవాన్ష్ ప్రపంచ రికార్డు సాధించాడు. గతంలో చెస్ డొమైన్ లోనూ రికార్డులు నెలకొల్పిన దేవాన్ష్ చదరంగం పట్ల ఆయనకున్న అసాధారణ దృష్టి, అంకిత భావం, మక్కువే ప్రపంచ రికార్డును సంపాదించిపెట్టింది. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

గన్నవరం విమానాశ్రయానికి పింగళి పేరు పెట్టాలి

» బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య

గవర్నర్‌పేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పతాక రూపశిల్పి, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య పేరును విజయవాడ, గన్నవరం విమానాశ్రయానికి పెట్టాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. ఆదివారం విజయవాడ హనుమాన్‌పేటలోని శ్రీరాజరాజేశ్వరీ కళ్యాణ మండపం (శంకరమఠం)లో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి సమాఖ్య గౌరవాధ్యక్షుడు కొప్పవరపు వెంకట బలరామకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కొప్పవరపు మాట్లాడుతూ, బ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలని, సమాజ సేవకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా సమావేశంలో పలుతీర్మానాలు ఆమోదించారు.

జంటగా వృద్ధిలో పైపైకి..

(5వ పేజీ తరువాయి)

తగిన ప్రణాళికలతో రూ. 18,23,203 కోట్ల జీడీడీపీని, రూ.62,88,851 తలసరి ఆదాయాన్ని సాధించే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దీని కోసం ఆర్థిక సంవత్సరాల వారీగా నిర్దేశించుకున్న లక్ష్యాలను కలెక్టర్ లక్ష్మీశ ముఖ్యమంత్రికి వివరించనున్నారు.

ముఖ్యమైన ప్రణాళికలు ఇవీ

విస్సన్నపేటలో పిట్టలవారిగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు జిల్లా యంత్రాంగం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు వల్ల అదనంగా 16 వేల ఎకరాల ఆయకట్టు సాగు పెరుగుతుంది. 7,241 మంది రైతులు లబ్ధి పొందుతారు. ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం చేయూత అందిస్తే కనుక ఎన్టీఆర్ జిల్లాకు రూ.32 కోట్ల స్థూల విలువ జోడింపు (జీవీఎం) జరుగుతుందని జిల్లా యంత్రాంగం అంచనా వేస్తోంది. అలాగే లక్ష్మీపురంలో ఎన్‌హెచ్ - 216 పరిధిలో హైవే రెస్టారెంట్స్ రెస్టింగ్ పాయింట్స్‌కు ప్రతిపాదిస్తోంది. విజయవాడ, హైదరాబాద్‌లు చేరుకోవటానికి ఈ మార్గంలో ఆటంకాలు లేకుండా ప్రయాణం చేయవచ్చు. మల్లెలలో లెదర్ పార్క్‌కు ప్రతిపాదించారు. ఈ లెదర్ పార్క్ ద్వారా రూ.1000 - 1500 మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి. తిరువూరులోని ఐటీఐ కాలేజీకి ప్రతిపాదించటం జరిగింది. వృత్తి నైపుణ్యం మెరుగుపరచుకునేందుకు, యువ పారిశ్రామికవేత్తలను తయారు చేసేందుకు దీనిని ప్రతిపాదిస్తున్నారు. తిరువూరులోనే జవహర్ నవోదయ విద్యాలయాన్ని ప్రతిపాదిస్తున్నారు. దీని ద్వారా ఉచితంగా విద్యనందించవచ్చు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రతిభావంతమైన పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును కల్పించవచ్చు. జిల్లా స్థాయిలో తీసుకున్న ప్రణాళికలు ఇవైతే.. నియోజకవర్గాల వారీగా తీసుకున్న ప్రణాళికలు చాలా ఉన్నాయి. ఇవన్నీ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబుకు కలెక్టర్ లక్ష్మీశ ప్రజెంటేషన్ చేయనున్నారు.

కృష్ణాజిల్లా నుంచి పోర్టు ఆధారిత అంశాలు

కృష్ణాజిల్లా ఈ సారి ప్రధాన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించింది. మచిలీపట్నంలో నిర్మిస్తున్న పోర్టుపై దృష్టి సారించింది. బందరు పోర్టు పనులు ప్రస్తుతం 46 శాతం పూర్తయ్యాయి. వచ్చే ఏడాది కల్లా పూర్తి చేయగలిగితే.. కృష్ణాజిల్లా దశ తిరగనుంది. జిల్లా రూపురేఖలే మారనున్నాయి. మచిలీపట్నం పోర్టు ద్వారా కంటెయినర్ ఇండస్ట్రీ ఏర్పడుతుంది. అనేక పరిశ్రమలు ఏర్పాటుకు బీజం పడుతుంది. ప్రధానంగా పోర్టు నుంచి లాజిస్టిక్స్ ట్రాన్స్‌పోర్ట్ జరుగుతుంది. ఇవన్నీ జిల్లాకు అదనపు ఆదాయాన్ని, వృద్ధిని తెచ్చిపెడతాయి. వ్యవసాయం, ఆక్వా ప్రధానంగా ఉన్న జిల్లా ముఖచిత్రం ఒక్కసారిగా పారిశ్రామిక ప్రగతిని సాధించటానికి అవకాశం దక్కుతుంది. జిల్లా పారిశ్రామిక ప్రగతి దిశగా అడుగులు వేస్తే ఊహించని వృద్ధి జరుగుతుంది. అందుకే కలెక్టర్ బాలాజీ దీనికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాల్సిందిగా ఆదేశించారు. గిలకలదిండి ఫిషింగ్ హార్బర్‌పై కూడా ప్రధానంగా దృష్టి సారించారు. ఈ హార్బర్ కనుక వస్తే ఆక్వా రంగానికి మంచి ఊతం ఇస్తుంది. మచిలీపట్నం పోర్టుకు కనెక్టివిటీ ముఖ్యం. దీని కోసం రోడ్ల విస్తరణాభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. వీటికి సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి క లెక్టర్ నివేదించనున్నారు. జిల్లాలో సేవా రంగం తక్కువగా ఉంది. సేవా రంగాన్ని గణనీయంగా పెంపొందించుకునేందుకు అవకాశాలు ఉన్నాయి. కృష్ణాజిల్లా టూరిజంగా అభివృద్ధి చెందటానికి అన్ని అవకాశాలు ఉన్నాయి. బీచ్‌లు, సాగర తీరాలు, నదీ తీరాలు, మడ అడ వులు, దీవులు ఉన్నాయి. వీటిపై కూడా దృష్టి సారిస్తే సేవా రంగంలోనూ కృష్ణా జిల్లా దూసుకుపోయే అవకాశం ఉంది.

బెడిసి కొట్టింది!

(5వ పేజీ తరువాయి)

ప్రైవేటు హోటల్స్ యాజమాన్యాలు సమావేశాలు పెట్టుకున్నా కూడా ఆసక్తి వ్యక్తీకరించటానికి వెనుకాడాయి. ఆదివారం వరకు ఒక్కటంటే ఒక్క సంస్థ కూడా ఆసక్తి చూపలేదు. సోమవారం వరకు గడువు ఉన్నా కూడా.. ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి కనిపించటం లేదు. దీంతో పర్యాటకశాఖ అధికారులు ఆర్‌ఎఫ్‌పీ గడువును అక్టోబరు 5వ తేదీ వరకు పొడిగించాలని భావిస్తున్నారు. సోమవారం పొడిగింపు పేరుతో నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. ఒక విధానం లేకుండా పర్యాటక యూనిట్లను ఓఅండ్‌ఎం కింద అప్పగించేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్‌జైన్ ఏకపక్షంగా చేసిన ప్రయోగం బెడిసికొట్టినట్టు అయింది. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక యూనిట్ల ప్రైవేటీకరణపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

సమాజ దిశను మార్చే మేధస్సు

నేడు ఇంజనీర్స్ డే సందర్భంగా..

» అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం
» ఇంజనీర్లు లేనిదే ప్రగతి లేదు
» ఇంజనీరింగ్ నైపుణ్యంతోనే.. అభివృద్ధి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

మనిషి మేధస్సుకు శాస్త్రీయత తోడైతే జరిగే అద్భుతాలు ప్రపంచ దశ, దిశను మార్చేస్తాయి. భవిష్యత్తు తరాల జీవన గమనాన్ని ముందుగానే గ్రహించి, వారికి కావాల్సిన సౌకర్యాలను సిద్ధం చేయడం ఒక్క ఇంజనీర్ వల్లే అవుతుందనడంలో అతిశయోక్తి లేదు. భావితరాల వందేళ్ల అవసరాలను గుర్తించి సమాజ మౌలిక వసతుల కల్పనకు అంచనాలు వేయగలగే ఇంజనీర్ మేధస్సును అందుకోవడం ఎవరితరం కాదు. సమాజానికి అవసరమైన సాగు, తాగునీరు అందించడం, సురక్షిత, సౌకర్యవంత ప్రయాణానికి బాటలు వేయడం, కళ్లు చమర్చే ఇంద్రభవనాలను నిర్మించడం ఇంజనీర్‌కే సాధ్యమవుతుంది. బడి నుంచి గుడి వరకు, గ్రామం నుంచి నగరం వరకు భవనాలు, రోడ్లు, వంతెనలు, కాలువలు, తాగునీటి పైప్‌లైన్‌లు ఏదైనా నిర్మాణం చేయగలిగే సత్తా ఇంజనీర్ల సొంతం. నేటితరం మానవ మనుగడ సజావుగా సాగుతుందంటే.. దాని వెనుక ఎందరో ఇంజనీర్ల కష్టం దాగి ఉంది. 'నేడు ఇంజనీర్ల దినోత్సవం' సందర్భంగా వారు సాధించిన ఘనతను జ్ఞప్తికి తెచ్చుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.

దేశం గర్వించగదగ్గ ఇంజనీర్ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినోత్సవం సెప్టెంబరు 15న ఇంజనీర్స్ డే జరుపుకుంటున్నాం. కర్ణాటకలోని మద్దినేహళ్లి అనే చిన్న గ్రామంలో 1861 జన్మించిన ఆయన 19వ మైసూరు మహారాజు ఆస్థానంలో పని చేశారు. 1927 నుంచి 1955 వరకు స్టీల్ బోర్డు ఆఫ్



డైరెక్టర్‌గా ఉన్నారు. వరద నీటి నుంచి హైదరాబాద్‌ను రక్షించింది, దక్కన్ నీటి పారుదల వ్యవస్థ నిర్మాణం చేసింది, కోతకు గురికాకుండా విశాఖపట్నం తీరాన్ని కాపాడింది, తిరుమల మధ్య రోడ్డు నిర్మాణం చేసింది విశ్వేశ్వరయ్యే. రైలులో ప్రయాణిస్తూ- ముందు కొంత దూరంలో రైలు పట్టాలు పగిలి పోయాయని విశ్వేశ్వరయ్య గుర్తించి, పెను ప్రమాదాన్ని ఆపగలిగారని చరిత్ర చెబుతోంది.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇంజనీర్ల అద్భుతాలు

ఉమ్మడి కృష్ణాజిల్లా ఆర్థిక, సామాజిక అభివృద్ధి వెనుక ఎందరో ఇంజనీర్ల కృషి ఉంది. జిల్లా ఆర్థిక పరిపుష్టిలో ఇంజనీర్ల భాగస్వామ్యం ఉందనడానికి బలమైన నీటిపారుదల వ్యవస్థే నిదర్శనం. 1957లో నిర్మాణం చేసిన ప్రకాశం బ్యారేజీ నిర్మాణం జిల్లా స్థితిగతులనే మార్చేసింది. డెల్టా భూములకు కేవలం గురుత్వాకర్షణ(గ్రావిటీ) ద్వారానే నీళ్లు పారేలా ప్రధాన కాలువలు, అనుసంధాన కాలువల డిజైన్ ఇంజనీర్ల మేథో శక్తికి ప్రత్యక్ష సాక్ష్యం. ప్రకాశం బ్యారేజీ నిర్మాణానికి పూర్వమే.. కృష్ణానదికి ఆనకట్ట వేసి నీటిని కాలువల ద్వారా బ్రిటీషర్స్ హయాంలోనే డెల్టాకు సరఫరా చేశారు. అప్పట్లో కొంత దూరం వరకు మాత్రమే సాగునీరు అందేది. బ్యారేజీ నిర్మాణంతో నేడు సముద్ర తీర ప్రాంతాల్లోని చౌడు భూములను సైతం కృష్ణాజలాలను మన ఇంజనీర్‌లు పంపారు. దీనితో పాటు మచిలీపట్నం మండలం సముద్రతీరంలోని మాలకాయలంక నుంచి కొత్తపల్లెతుమ్మలపాలెం వరకు సముద్రపు నీరు రాకుండా కరకట్ట నిర్మాణం, నాగాయలంక, కోడూరు ప్రాంతాల్లో సముద్రం కోతకు గురికాకుండా అవుట్‌ఫాల్ రీచ్‌లు, విజయవాడను ముంపు నుంచి కాపాడేందుకు బుడమేరు రిటైనింగ్ నిర్మాణం, కృష్ణా నది పరివాహకంలోని కృష్ణలంక, రాణిగారితోట, రామలింగేశ్వరనగర్‌కు రక్షణగా ఐదు కిలోమీటర్ల రిటైనింగ్ వాల్ నిర్మాణం, మెట్ట ప్రాంతాల్లో లిఫ్ట్ ఇరిగేషన్.. ఇవన్నీ ఇరిగేషన్ ఇంజనీర్‌లు సాధించిన ఘనతే. దివంగత ముఖ్యమంత్రులు డాక్టర్ ఎన్టీ రామారావు హయాంలో నిర్మాణమైన తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు తీరగ్రామాల ప్రజల దాహార్తిని తీర్చుతుండగా, వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నిర్మాణమైన పులిచింతల ప్రాజెక్ట్ కృష్ణా డెల్టాలకు అండగా నిలబడింది. జిల్లాలోని జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు గ్రామీణ రహదారులను ఎప్పటికపుడు అభివృద్ధి, మరమ్మతులు చేపడుతూ ప్రజల ప్రయాణాన్ని సులభతరం, సౌకర్యవంతం చేశారు. విజయవాడ నగరంలో ఆర్ అండ్ బీ అధికారులు నిర్మాణం చేసిన సివిల్ కోర్టు భవనాలు నగరానికి మరింత శోభను తీసుకొచ్చాయి.

భవిష్యత్తు అవసరాలు లక్ష్యం కావాలి



- ఆర్.మోహనరావు, ఎస్.ఈ., నీటి పారుదల శాఖ

భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి అవసరాలు ఉంటాయో వాటిని ముందుగానే గుర్తించగలడమే ఇంజనీర్ల ప్రధాన లక్ష్యం కావాలి. ప్రభుత్వాలు ప్రజాధనం వెచ్చించి నిర్మాణం చేసే ప్రతి ప్రాజెక్టు భావితరాల మనుగడకు ఉపయోగంగా ఉండాలి. గతంలో మా సీనియర్ ఇంజనీర్‌లు చేపట్టిన అద్భుత ప్రాజెక్టుల ద్వారా డెల్టా ప్రజలకు సాగునీటిని అందిస్తున్నాం. ప్రస్తుతం ఇంజనీరింగ్ వ్యవస్థ మరింత స్మార్ట్‌గా తయరవుతుంది. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత సౌకర్యాలను అందించే వీలుంది.

అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం

- సీహెచ్‌వీ నగేష్‌కుమార్, డీ.ఈ., పంచాయతీ రాజ్



సమాజ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం. మానవ మనుగడకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేది ఇంజనీర్లే. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన అద్భుతాలు మాకందరికీ ఆదర్శం. జీవిత కాలంలో ఎన్నో ప్రజా ప్రయోజన నిర్మాణాలు చేశారు. భావితరాల ఇంజనీర్లకు ఆయన జన్మదినం ఓ పండుగ. నేటి తరం ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి.

దసరా ఏర్పాట్లు @ రూ. 4 కోట్లు

(5వ పేజీ తరువాయి)

ఎస్టిమేటెడ్ కాంట్రాక్టు వ్యాల్యూ కన్నా టెండర్ ప్రీమియం తగ్గించినప్పటికీ ఇంకా ఎక్కువగానే ధరలు ఉన్నట్లుగా చెప్పుకుంటున్నారు. వాస్తవంగా ఏటా దుర్గగుడిలో దసరా ఉత్సవాలకు సంబంధించి ఎస్టిమేటెడ్ వ్యాల్యూ పెరుగుతూనే ఉంది. మెటీరియల్‌ను శాశ్వతంగా ఏర్పాటు చేసుకోకపోవటంతో ఎప్పటికప్పుడు క్యూలు ఏర్పాటు, ఇతరత్రా పనుల కోసం భారీగా నిధులు వ్యయమవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కొండ దిగువన తాత్కాలిక క్యూల ఏర్పాటుకు ఎస్టిమేటెడ్ కాంట్రాక్టు వ్యాల్యూ రూ.32,66,191 నిర్ధారించారు. తొలుత అంచనా రూ.39 లక్షలుగా ఉండటం విశేషం. అయితే 15 శాతం లెస్‌తో విజయవాడకు చెందిన గోరిపర్తి భాస్కర్ సాయి ఈ టెండర్‌ను రూ.27,76,262 దక్కించుకున్నారు. వినాయకుడి గుడి దగ్గర నుంచి ఘాట్ రోడ్డు టోల్‌గేట్ వరకు తాత్కాలిక వాటర్ ప్రూఫ్ షామియానాలకు రూ.40 లక్షలకు ఎస్టిమేషన్ వేయగా, ఎస్టిమేటెడ్ కాంట్రాక్టు వ్యాల్యూ రూ.33,66,886 నిర్ధారించారు. విశాఖపట్నానికి చెందిన బాలాజీ సప్లయర్స్ 18.90 శాతం లెస్‌తో రూ.27,30,544 దక్కించుకున్నారు. స్నాన ఘాట్ల వద్ద షామియానాలు, షెడ్లు ఏర్పాటు చేయటానికి రూ.50 లక్షలు అంచనా వేశారు. తాడేపల్లిగూడేనికి చెందిన కె.కిషోర్ 18 శాతం లెస్‌తో రూ.34,68,347 దక్కించుకున్నారు. దీని ఎస్టిమేటెడ్ వ్యాల్యూ తొలుత రూ.42.29 లక్షలుగా ఉంది. తెప్పోత్సవంలో వినియోగించే హంస వాహనానికి విద్యుద్దీకరణ, మరమ్మతుల కోసం రూ.11.70లక్షలు అంచనా వేశారు. అయితే ఎస్టిమేటెడ్ వ్యాల్యూ రూ.9.60 లక్షలుగా నిర్ధారించారు. దీనిపై 23.99 శాతం లెస్‌తో రూ.7.30 లక్షలకు పైగా టెండర్ వ్యాల్యూతో గుడివాడకు చెందిన తుమ్మల నరేంద్ర టెండర్ దక్కించుకున్నారు. స్నాన ఘాట్ల వద్ద ఫ్లోరింగ్ చదును చేయటానికి విజయవాడకు చెందిన వి.ఎస్.బి.డి. వి.ప్రసాద్ ఎస్టిమేటెడ్ కాస్ట్ రూ.16.42 లక్షలకుగాను 25.21 శాతం లెస్‌తో రూ.12.28 లక్షలకు టెండర్ దక్కించుకున్నారు. దీనికి తొలుత రూ.20లక్షలు అంచనా వేశారు. బాణాసంచా సరఫరా, బాణాసంచా పేల్చటం కోసం రూ.7.25 లక్షలు అంచనా వేయగా, టెండర్ ఎస్టిమేటెడ్ వ్యాల్యూ రూ.6.11లక్షలుగా తేలింది. నాలుగు శాతం లెస్‌తో రూ.5.86 లక్షలకు టెండర్‌ను కాకినాడకు చెందిన పెద్దిరెడ్డి సత్యనారాయణ మూర్తి దక్కించుకున్నారు. అర్జునవీధిలో తాత్కాలిక విద్యుద్దీకరణ కోసం రూ.40 లక్షలు అంచనా వేశారు. టెండర్ వ్యాల్యూ 32.72 లక్షలు ఉండగా, దీనిలో 25.20 శాతం లెస్‌తో రూ.24.47 లక్షలకు తెనాలికి చెందిన గాయత్రీ ఏజెన్సీస్ టెండర్ దక్కించుకుంది. అన్ని ఘాట్‌లు, కేశఖండనశాల ప్రాంతంలో తాత్కాలిక విద్యుద్దీకరణకు రూ.40 లక్షలు అంచనా వేయగా, రూ.32.84 లక్షలపై 25.20 లెస్‌తో రూ.24.56 లక్షలకు అదే కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. కొండ దిగువన మైక్ ప్రసారాల ఏర్పాటుకు రూ.12లక్షలు అంచనా వేయగా, ఎస్టిమేటెడ్ కాంట్రాక్టు వ్యాల్యూ రూ.9,39,680 నిర్ధారించారు. ఈ కాంట్రాక్టును 25.20 శాతం లెస్‌తో రూ.7,02,880లకు కాంట్రాక్టు ఇచ్చారు. పోలీసు అధికారులకు లైవ్ వీక్షించేందుకు తాత్కాలిక సీసీ టీవీలను అద్దె ప్రాతిపదికన తీసుకునేందుకు రూ.9.50 లక్షలకు అంచనా వేయగా, ఎస్టిమేటడ్ కాస్ట్ రూ.7.80లక్షలకు రాగా, దీనిపై 1.40 శాతం ఎక్కువ ధరతో రూ.7.91 లక్షలకు మచిలీపట్నానికి చెందిన మేజిక్ ఐ సొల్యూషన్స్ టెండర్ దక్కించుకుంది. సీతమ్మవారి పాదాలు, కేశఖండన శాల వద్ద తాత్కాలిక జల్లు స్నానాలు ఏర్పాటు చేసేందుకు రూ.8.20లక్షలు అంచనా వేయగా, రూ.6.70 లక్షలు ఎస్టిమేటెడ్ కాస్ట్ వచ్చింది. దీని పై 19.89 లెస్‌తో గుడివాడకు చెందిన తుమ్మల నరేంద్ర రూ.5.37 లక్షలకు టెండర్ దక్కించుకున్నారు. ఈ మొత్తం అన్ని పనులకు సంబంధించి రూ.4,86,60,000 అంచనా వేయగా, ఎస్టిమేటెడ్ వ్యాల్యూ రూ.3,24,35,694 రాగా, లెస్‌లు, ఎక్సెస్‌లతో మొత్తం రూ.2,54,81,597 ఖర్చుగా వచ్చింది.

కొండపైన పనులు ఇలా..

కొండపైన క్యూల ఏర్పాటుకు రూ.13లక్షలు, షామియానాకు రూ.14లక్షలు, విద్యుత్ లైట్లకు రూ.80 లక్షలు, 11రోజుల పాటు 40 వీఐపీ వాహనాలకు రూ.17లక్షలు, ప్రధాన ఆలయం, ఉపాలయాలకు, అవసరమైన చోట్ల మరి కొన్ని ప్రదేశాలలో పెయింటింగ్‌కు రూ.10.50 లక్షలు, సుమారు రెండున్నర కిలో మీటర్లు ఐరన్ మెష్ ఏర్పాటుకు సుమారు రూ.8.50 లక్షలు, వీఐపీ వాహనాలకు, దేవస్థానం బస్సులు, ఇతర వాహనాలకు మొత్తం 50 మంది డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్‌లకు 11 రోజుల పాటు రూ.3.50 లక్షలు ఖర్చు చేయనున్నారు. కాగా, మహామండపంలో సీసీటీవీ ఆపరేషన్, కమాండ్ కంట్రోల్ రూమ్‌ల కోసం రూ.32.74 లక్షలకు ఎస్టిమేటెడ్ కాంట్రాక్టు వ్యాల్యూను నిర్ణయించారు.

వీఎంసీ నిర్వహించే పనులు ఇవే..

దసరా ఉత్సవాలలో వాటర్ బాటిల్స్, ప్యాకెట్ల సరఫరా, వాటర్ ప్యాకెట్లు అందించేందుకు పనివారి నియామకం, దుర్గాఘాట్, పున్నమిఘాట్, టీటీడీ స్థలం, కెనాల్ రోడ్‌లలో తాత్కాలిక మొబైల్ టాయిలెట్ల ఏర్పాటు, కేశఖండనశాల, సీతమ్మవారి పాదాలు, ధోబీ ఘాట్ల వద్ద తాత్కాలిక టాయిలెట్ల ఏర్పాటు బాధ్యతలు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌కు అప్పగించారు. అయితే వీటికి అయ్యే ఖర్చును మరల దేవస్థానం నుంచి చెల్లించవలసి ఉంటుంది. ఇందుకు అయిన బిల్లులను సమర్పించి అమౌంట్‌ను దేవస్థానం నుంచి తీసుకుంటారు. కాగా, గత ఏడాది ఉత్సవాలలో వాటర్ బాటిల్స్, వాటర్ పాకెట్లు, వీటిని భక్తులకు సప్లయ్ చేసే సిబ్బందికి గాను మొత్తం దేవస్థానం సుమారు రూ.2కోట్లు కార్పొరేషన్‌కు చెల్లించింది. అదే విధంగా భక్తులు భద్రపరచుకునే పాదరక్షలు, లగేజీ కౌంటర్లను కూడా కార్పొరేషనే ఏర్పాటు చేస్తుంది. వాటికి అయ్యే ఖర్చును దేవస్థానం చెల్లించింది.

వెంటాడుతున్న డయేరియా కలవరం

(5వ పేజీ తరువాయి)

ఏసీపీ శ్రవంతిరాయి, సీఐలు లక్ష్మీనారాయణ, కృష్ణమోహన్ అడ్డుకున్నారు. దీంతో సీపీఎం నేతలు తాము వేడివేడిగా వండిన భోజనాన్ని మాత్రమే బాధితులకు అందిస్తున్నామని, న్యూ ఆర్ఆర్‌పేటలో దుకాణాలు మూయించేసిన కారణంగా ప్రజలు భోజనం లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనిపై కొంత సేపు నేతలకు అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. వండిన భోజన పదార్థాలను ఏం చేయమంటారు అని నేతలు నిలదీయడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం పార్టీ నేతలు బాధితులకు భోజనం అందజేశారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కొత్త రాజరాజేశ్వరి పేటలో డయేరియాను కట్టడి చేసే చర్యల్లో భాగంగా పటిష్ట ప్రణాళిక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఏ సహాయం, సమాచారం కావాలన్నా కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ 9154970454 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఆదివారం సాయంత్రం కొత్త రాజరాజేశ్వరి పేటలో ఇంటింటికి వెళ్లి హైజీన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సబ్బులు, హ్యాండ్ వాష్, ఫినాయిల్‌తో పాటు పదిచొప్పున ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక కరపత్రాలతో డయేరియాపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వైద్య శిబిరంలో, ఆసుపత్రిలోనూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు.

పీఎన్‌బీఎస్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

బస్‌స్టేషన్ : ప్రయాణికుల భద్రత, బస్టాండ్ పరిశుభ్రతలో రాజీ ప్రసక్తే లేదని, ఆహార పదార్థాల విక్రయశాలలు కచ్చితంగా ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందేనని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. ఆదివారం కలెక్టర్ లక్ష్మీశ విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాట్‌ఫాంలతో పాటు తాగునీటి పాయింట్లు, మరుగుదొడ్లు పరిసరాలను పరిశీలించారు. ప్రయాణికుల ఆహార భద్రతకు భరోసా కల్పించేలా పరిశుభ్రతా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పక్కా ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణతో ప్రయాణికులు సంతృప్తి చెందేలా సౌకర్యాలతో సేవలందించాలన్నారు.

ఆప్కాబ్‌కు జాతీయ బహుమతి

విజయవాడ, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్(ఏపీసీఓబీ) దేశంలోనే ద్వితీయ స్థానంలో నిలిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో "త్రి-టైర్ స్ట్రక్చర్"లో భాగంగా కో-ఆపరేటివ్ బ్యాంకుల పనితీరుకు ఆధారంగా ఇచ్చే ఈ అవార్డుల్లో రాష్ట్రానికి ద్వితీయ బహుమతి లభించింది. సిమ్లాలో జరిగిన నేషనల్ కో-ఆపరేటివ్ కాన్ఫరెన్స్‌లో మంగళవారం ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మీడియాకు విడుదలచేసిన లేఖలో తెలుపుతూ, ఆప్కాబ్ జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో మొత్తం 13 డీసీసీబీలు కోర్ బ్యాంకింగ్(అన్ని బ్రాంచిలను ఒకే సెంట్రల్ సర్వర్‌తో అనుసంధానించడం)కు మారాయన్నారు. మొత్తం 465 బ్రాంచులు, 6 వేల టచ్‌పాయింట్లు కలిపి పీఏసీఎస్ కంప్యూటరైజేషన్ ప్రాజెక్టును విజయవంతంగా నిర్వహించామని, దీనివల్ల ఆధార్ ఈ కైవీసీ, డిజిటల్ పాస్‌బుక్, మెంబర్ సర్వీస్ కిట్లతో ఆధునిక వసతులు కల్పించామన్నారు. భవిష్యత్తులో "విజన్ అమృత్‌కాల్ 2047"లో భాగంగా సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఆప్కాబ్ పనిచేస్తుందన్నారు.



బహుమతి అందుకుంటున్న గన్ని వీరాంజనేయులు

ప్రత్యక్ష, పరోక్ష పూజల టికెట్లు విడుదల

» దుర్గగుడిలో దసరా మహోత్సవాలలో భక్తులకు అవకాశం
» టికెట్ల వివరాలు వెల్లడించిన ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరగనున్న దసరా మహోత్సవాల్లో నిర్వహించే ప్రత్యేక ఖడ్గమాలార్చన, కుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీయాగం టికెట్లను ఈవో వి.కె. శీనానాయక్ ఆదివారం విడుదల చేశారు. ఖడ్గమాలార్చన ఈ నెల 23 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు పదిరోజుల పాటు ఒక షిఫ్టు మాత్రమే నిర్వహిస్తారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు నిర్వహించే ఖడ్గమాలార్చనకు రుసుం రూ.5,116 చెల్లించాల్సి ఉంటుంది. 22వ తేదీ దసరా ప్రారంభం రోజున అమ్మవారికి స్నపన కార్యక్రమం ఉన్నందున ఆరోజు ఖడ్గమాలార్చన ఉండదు. ప్రత్యేక కుంకుమార్చనకు మూలా నక్షత్రం రోజున రూ.5,000 రుసుం చెల్లించాలి. మిగతా అన్ని రోజులు రూ.3వేల చొప్పున రుసుం చెల్లించాలి. దసరా ప్రారంభం రోజున ఉదయం 9 గంటల నుంచి మాత్రమే నిర్వహిస్తారు. 23వ తేదీ నుంచి ఉదయం 7 గంటల నుంచి కుంకుమార్చనలు ప్రారంభమవుతాయి. ప్రత్యేక శ్రీచక్రనవావరణార్చన ప్రతిరోజూ ఒక షిఫ్టులోనే ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తారు. ఇందుకు రుసుం రూ.3వేలు చెల్లించాలి. ప్రత్యేక చండీయాగం ఉదయం 9 గంటల నుంచి ఒక షిఫ్టు మాత్రమే నిర్వహిస్తారు. రుసుం రూ.4వేలు చెల్లించాలి. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తులు ఇరువురిని ముఖమండపం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. రుసుం చెల్లించిన భక్తులు పూజలో పాల్గొనేందుకు సంప్రదాయ వస్త్రధారణలోనే రావాలి.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీ జనార్దన్ తదితరులు

రేపు ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమం సజీవ చరిత్ర పుస్తకావిష్కరణ

» ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్

పెనమలూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆగస్టు 1984 దేశ చరిత్రలో మరచిపోలేని మహాసంఘటన ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంపై సీనియర్ పాత్రికేయుడు విక్రం పూల బృందం రచించిన 'సజీవ చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్టు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్ తెలిపారు. పోరంకి మురళీ రిసార్ట్సులో ఈనెల 16న సాయంత్రం 6గంటలకు జరగనున్న కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, జాతీయ పాత్రికేయులు ఎస్.వెంకటనారాయణ తదితరులు హాజరుకానున్నట్టు జనార్ధన్ తెలిపారు. ఆదివారం మురళీ రిసార్ట్సులో విలేకరులతో జనార్ధన్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ భావజాలాన్ని ఇప్పటితరానికి, రాబోయేతరానికి అందించే ఉద్దేశ్యంతో ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీని ఏర్పాటుచేసి పలు గ్రంథాలను ఇప్పటికే వెలువరించడం జరిగిందని తెలిపారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, అన్న ఎన్టీఆర్ పదవీచ్యుతుడైనప్పుడు రాష్ట్రంలో జరిగిన ఉద్యమం అంతకు మునుపెన్నడూ జరగలేదన్నారు. ఎన్టీఆర్ చరిత్ర మహోన్నతమైనదని, దానిని విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చాల్సిన అవసరం ఎంతయినా ఉందని అభిప్రాయపడ్డారు. పుస్తక రచయిత విక్రం పూల మాట్లాడుతూ, 1984 ఆగస్టు ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం ఓ సజీవ చరిత్ర అని, చరిత్రలో ఈఘటనకు ఎనలేని ప్రాధాన్యత ఉందని తెలిపారు. తాము చూసింది, అనేక మార్గాల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా పుస్తక రూపకల్పన చేశామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రఘురాం, రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీల సీట్ల కోసం ఐక్య ఉద్యమాలు

» రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

గాంధీనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జనగణనలో కులగణన, స్థానిక సంస్థల్లో బీసీల సీట్ల సాధన కోసం రాష్ట్రస్థాయి ఐక్య ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో వివిధ బీసీ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ బీహార్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో జనగణన సందర్భంగా తిరిగి కులగణన చేపట్టనున్నట్టు ఆయా ప్రభుత్వాలు వెల్లడించాయన్నారు. తమది బీసీల ప్రభుత్వమని చెబుతున్న సీఎం చంద్రబాబు కులగణన చేపట్టేందుకు ముందుకు రావట్లేదన్నారు. చంద్రబాబు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలతో రాష్ట్రానికి, రిజర్వేషన్ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీమంత్రి ఎన్.రఘువీరారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. జనరల్ కేటగిరీలో 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కొందరికే అందుతున్నాయన్నారు. ప్రతి పేదవాడికి సమాన అవకాశాలు దక్కాలంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ కులగణన చేపట్టాలన్నారు. బీసీ సంఘం నేత కేశన శంకర్రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి, సామాజిక, రాజకీయ న్యాయం, రాజ్యాంగబద్ధమైన హామీల సాధనకై రెండు దశాబ్దాలుగా పోరాటం కొనసాగుతోందన్నారు. సీపీఎం, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు తులసీదాస్, కొలనుకొండ శివాజీ, పాశ్యం వెంకటేశ్వర్లు, ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం నేత హనుమంతరావు, రజక సంఘం నేత నాగమల్లేశ్వరరావు, పద్మశాలి సంఘం నేత మహేశ్, సీపీఐ నేతలు అక్కినేని వనజ, దోనేపూడి శంకర్, జల్లి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

నవంబరులో 'చలో ఢిల్లీ'

» ఆర్‌ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి

విజయవాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినా విద్యారంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్‌ఎస్‌యూ) జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి ఆరోపించారు. నగరంలో నిర్వహించిన ఆర్‌ఎస్‌యూ 10వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ నవంబరులో 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ, సెంట్రల్ యూనివర్సిటీలు.. నిధులు లేక కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. యూనివర్సిటీల్లో అధ్యాపకులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించి కేంద్రప్రభుత్వం కాలం వెళ్లదీస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న గిరిజన సెంట్రల్ యూనివర్సిటీలను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం చిన్నచూపు చూస్తోందని, గుజరాత్‌పై ఉన్న శ్రద్ధ ఆంధ్రప్రదేశ్‌పై లేదని మండిపడ్డారు. అమరావతిలో విద్యాశాఖ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంతంలో ఉండేలా శాశ్వత భవనాలు నిర్మించాలని ఆయన కోరారు. ఇంజనీరింగ్ కాలేజీలకు రియింబర్స్‌మెంట్‌పై ఉన్న శ్రద్ధ ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం అధ్యాపకులను నియమించడంలో లేదని రవిశంకర్‌రెడ్డి మండిపడ్డారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

ప్రభుత్వ భూముల పరిరక్షణకు కమిటీ

ప్రసాదంపాడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను పరిరక్షించాలని,ఆక్రమణలపై సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన డిస్ట్రిక్ రివ్యూ మీటింగ్‌లో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ లక్ష్మీశ విజయవాడ ఆర్డీవో, ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి, విజయవాడ రూరల్ మండల తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. యార్లగడ్డ మాట్లాడుతూ విజయవాడ రూరల్ మండల పరిధిలోని 9 గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారుల దేనన్నారు. ఆక్రమణలను నిగ్గు తెల్చాలన్నారు.

దసరా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ


సీపీ రాజశేఖరబాబు, అధికారులు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈనెల 22నుంచి ప్రారంభం కానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అధికారులు చేపట్టిన పనులను ఆదివారం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, పోలీసు అధికారులతో కలిసి పరిశీలిం చారు. కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి నుంచి కాలినడకన క్యూలు, వాహనాల పార్కింగ్ కోసం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. హోల్డింగ్ ప్రదేశాలను పరిశీలించిన ఆయన భక్తులు రాకపోకల మార్గాలను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం భవానీపురం పున్నమీఘాట్, తదితర ప్రాంతాల్లో వాహనాలకు పార్కింగ్ స్థలాలను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. సీపీ వెంట ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, సౌత్ ఏసీపీ డి.పావన్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ జె.రామచంద్రరావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ పాల్గొన్నారు.

నూతన అన్నదాన భవనం పరిశీలన

దుర్గగుడి ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనాన్ని ఆదివారం ఈవో వి.కె.శీనానాయక్ అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తులకు శివాలయం మెట్ల పక్కన నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనంలో అన్న ప్రసాద విభాగాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేయాలని కమిషనర్ రామ చంద్రమోహన్ ఆదేశించారు. ఆ పనులను ఈవో పరిశీలించి,రెండు, మూడు రోజుల్లో అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈఈ-2 రాంబాబు, ఏఈఓలు బి.వెంకటరెడ్డి, పి.చంద్రశేఖర్, సీఈవో గంగాధర్ ఉన్నారు.



కనకదుర్గమ్మ సన్నిధిలో స్వామీజీల బృందం

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను ఆదివారం స్వామీజీల బృందం దర్శించుకుంది. ఈ సందర్భంగా అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామీజీలు అమ్మవారికి పూజలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందించారు. తాళ్ళాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి, తిరుపతి ఇస్కాన్‌కి చెందిన రాధామనోహర్ స్వామీజీ, తెలంగాణ రాష్ట్రం విశ్వేశ్వరక్షేత్ర పీఠాధిపతి ఆత్మ నంద భారతీస్వామి, గిద్దలూరుకు చెందిన స్వామి సిద్ధేశ్వరానంద, రాజమం డ్రికి చెందిన విశ్వశంకరానందస్వామి, తిరుపతికి చెందిన రాజేంద్రప్రసాద్ గురుజీ స్కంద స్వామి, గుంటూరుకు చెందిన భవానీశంకర్ ఆనంద్ స్వామి, విజయ వాడకు చెందిన భజిల్ గురుస్వామి, మాతా చైత్యానందమయి ఉన్నారు.

వెలంపల్లి, దేవినేని అవినాష్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి : టీడీపీ

వన్‌టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ఉనికికి కోసం, జగన్ మెప్పు కోసం ఎంపీ కేశినేని శివనాథ్‌పై వైసీపీ నాయకులు వెలంపల్లి శ్రీనివాసరావు, దేవినేని అవినాష్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని టీడీపీ నాయకులు కొట్టేటి హనుమంతరావు, జి.వి.నరసింహారావు అన్నారు. ఆదివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ విజయవాడ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయటానికి, విజయవాడ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఎంపీ విజయవాడ ఉత్సవ్ నిర్వహించేందుకు కృషి చేస్తుంటే వైసీపీ నాయకులు తమ రాజకీయ ఉనికి కోసం అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకుల వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు.


జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థి వడ్డే సంజయ్ లక్ష్మణ్‌రాజును అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

అండర్-19 జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు
నారాయణ కళాశాల విద్యార్థి ఎంపిక

పెనమలూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం విజయవాడ ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో జరిగిన అండర్-19 ఫుట్‌బాల్ జిల్లాస్థాయి జట్ల ఎంపికల్లో కానూరు నారాయణ కళాశాల విద్యార్థి వడ్డే సంజయ్ లక్ష్మణ్‌రాజు కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. త్వరలో కర్నూలులో జరగనున్న అంతరజిల్లా ఫుట్‌బాల్ పోటీలకు కృష్ణాజిల్లా జట్టు తరఫున ఆడనున్నాడు. కర్నూలులో జరగబోయే ఫైనల్లో అర్హత సాధించిన జట్టు నుంచి నలుగురు క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన లక్ష్మణ్‌రాజును నారాయణ సంస్థల డీజీఎం జాగర్లమూడి రవిశంకర్, డీన్ శ్రీరాంచంద్ చౌదరి, ఏజీఎం రాజశేఖర్, ప్రిన్సిపాళ్లు పీఎస్సార్, అంజిబాబు, జితేంద్ర, ఏవోలు అభినందించారు.

నూతన కమిటీలు కాపుల సంక్షేమానికి కృషి చేయాలి

వన్‌టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లకు నూతనంగా నియమించిన కమిటీలు కాపుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని ప్రజా కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు అన్నారు. ఆదివారం కొత్తపేటలోని ప్రజాకాపునాడు సంఘం కార్యాలయంలో 51వ డివిజన్ నూతన కమిటీ నియామకం జరిగింది. డివిజన్ అధ్యక్షుడిగా సకినాల వెంకట రాజేంద్ర ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా రాజనాల రమేష్ బాబు, ఉపాధ్యక్షుడు నారిండి సాంబశివరావు, సహాయ కార్యదర్శిగా సుంకర భరత్ ప్రకాష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా అంజిబాబు నియామకపత్రాలను అందజేశారు. నగరంలో 64 డివిజన్‌లలో కమిటీలను నియమించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణపా రాము, పశ్చిమ కార్యదర్శి క్షర్రి గౌరి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలయ నిర్మాణానికి మద్దతు ఇవ్వాలి

గాంధీనగర్, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆలయ నిర్మాణ ప్రతిపాదనను కార్పొరేటర్ అంబడిపూడి నిర్మల కుమారి వీఎంసీలో ప్రవేశ పెట్టడంపై అంబేడ్కర్ ఆలయ కమిటీ అధ్యక్షుడు రవిప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో ఆనందం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ అందరికీ సమాన హక్కులు, విద్యా అవకాశాలు కల్పించారన్నారు.త్వరలో జరిగే కౌన్సిల్‌లో ఆలయ నిర్మాణ ప్రతిపాదనకు ప్రజాప్రతినిధులు, అధికారులు మద్దతు తెలపాలని కోరారు.


11వ డివిజన్‌లోని గొల్లు రంగారావు - రమాదేవి పార్కు


లోపల పేరుకుపోయిన ఎండుగడ్డి


అపరిశుభ్రంగా వాకింగ్ ట్రాక్

పార్కును పట్టించుకోరా..?

పటమట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పరిసర ప్రాంత వాసులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన గొల్లు రంగారావు- రమాదేవి పార్క్ అపరిశుభ్రంగా మారిపోయింది. 11వ డివిజన్ రైతు బజారు వెనుక మారుతి కాలనీలో ఉన్న ఈపార్క్‌లో పచ్చగడ్డి బీడులా పేరుకుపోయింది. లోపల ఎండు గడ్డి పెద్ద మొత్తంలో పేరుకుంది. వాకింగ్ ట్రాక్ చెత్తా చెదారంతో నిండిపోయింది. కూర్చునేందుకు వేసిన బల్లలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. గత కొన్ని నెలలుగా ఈపార్క్ తెరవకపోవడంతో అపరిశుభ్రంగా మారింది. లోపల పెరిగిన బీడు గడ్డిని తొలగించి వాకింగ్ ట్రాక్‌పై ఉన్న వ్యర్థాలను శుభ్రం చేస్తే ఉదయం, సాయంత్రం వేళల్లో ఆప్రాంతవాసులకు వాకింగ్ ట్రాక్ వాకింగ్ చేసేందుకు వయో వృద్ధులు అక్కడకు చేరుకొని కాలక్షేపం చేసేందుకు అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

పార్క్‌ను వినియోగంలోకి తేవాలి..



పార్క్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలి. ఈప్రాంత ప్రజలకు, వృద్ధులకు, వాకింగ్ చేసే వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. అధికారులు దృష్టి సారించి తక్షణం పార్క్‌ను బాగు చేయాలి.

బెజవాడ నజీర్ (స్థానికుడు)



చెత్త తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఆటోనగర్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): 'ఆటోనగర్‌లో పేరుకున్న చెత్తకుప్పలు' శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి జవహర్ ఆటోనగర్ ఐలా సర్వీస్ సొసైటీ అధికారులు స్పందించారు. కార్మికవాడలోని పురవీధుల్లోని చెత్తకుప్పలు, మట్టికుప్పలను యంత్రాల సహాయంతో తొలగించారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆటోనగర్‌వాసులు కూడా సహకరించాలని ఐలా అధికారులు కోరారు. దుకాణాలు, ఖార్ఖానాల్లో తయారైన చెత్తను ఎక్కడపడితే అక్కడ రోడ్లపై పడవేయకుండా కొంత నిర్దిత ప్రదేశాల్లో ఉంచాలని ఐలా అధికారులు సూచించారు.


కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న అఖిల భారత పద్మశాలి సంఘ నాయకులు

పద్మశాలీలకు అండగా కూటమి

లబ్బీపేట, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): లబ్బీపేట పద్మశాలి భవన్‌లో అఖిల భారత పద్మశాలి సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి వివిధ రాష్ట్రాల నుంచి పద్మశాలి సంఘ ప్రతినిధులు, సభ్యులు హాజరయ్యారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి.వి.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అఖిల భారత పద్మశాల సంఘం అధ్యక్షుడు కండగట్ల స్వామి మాట్లాడుతూ చేనేత బంధు ప్రగడ కోటయ్య జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు 25వేల ఆర్థిక సహాయం అందజేశారు. చేనేతలకు 200 యునిట్లు, పవర్‌లూమ్ యజమానులు 500 యునిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నందుకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళగిరిలో ప్రగడ కోటయ్య పేరుతో చేనేత పార్కు, చేనేత మ్యూజియం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం చేనేత రంగానికి అండగా నిలుస్తూ అనేక పథకాలు అమలు చేస్తుందని తమ సామాజిక వర్గాన్ని గౌరవిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అఖిల భారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథ్, రాయలసీమ పద్మశాలి సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రాష్ట్ర యువజన అధ్యక్షుడు బళ్ల పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వివాహ పత్రికను అందజేస్తున్న రాజా దంపతులు

సీఎంకు వివాహ ఆహ్వానం

ఆటోనగర్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా తన కుమార్తె వివాహ ఆహ్వానపత్రికను సీఎం చంద్రబాబుకు కుటుంబసభ్యులతో కలిసి అందజేశారు. తన ఏకైక కుమార్తె వివాహానికి తప్పక హాజరు కావాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారని నల్లమోతు రాజా తెలిపారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కంభంపాటి రామ్మోహనరావు, గుమ్మడి వెంకట గురుప్రసాద్ ఉన్నారు.

ఇరిగేషన్ లాక్ సూపరింటెండెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం

సత్యనారాయణపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : ఏపీ ఇరిగేషన్ లాక్ సూపరింటెండెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఏకగ్రీవమైంది. సత్యనారాయణపురం జీఎస్‌రాజు రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడిగా సీహెచ్ బ్రహ్మాజీరావు (నిడదవోలు), రాష్ట్రఅధ్యక్షుడిగా బి.ప్రసాద్‌బాబు(విజయవాడ), ఉపాధ్యక్షులుగా వి.నాగేశ్వరరావు (గన్నవరం), రాష్ట్రప్రధానకార్యదర్శిగా పి.విజయ 'సమార్ (ధవళేశ్వరం), రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎస్. శ్రీనివాసరావు(ఈస్ట్‌గోదావరి), జాయింట్‌సెక్రటరీగా ఎస్.శ్రీమన్నారాయణ(కృష్ణాజిల్లా), మహిళ విభాగంలో ఎ.వెంకటరమణను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా సీహెచ్ మురళీధర్, మహిళ విభాగం నుంచి పి.ముత్యాలరాణీలను నియమించారు. విజయవాడ సర్కిల్ అధ్యక్షుడిగా ఎస్. దావీదు, కోశాధికారిగా కాటూరి ప్రసాద్, డివిజన్ కార్యదర్శిగా డి.త్రిమూర్తులు, కె. ఆనంద్ కుమార్‌లను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో లాకుల పరిస్థితి బాగాలేదన్నారు. లాకుల వద్ద లస్కర్‌ల కొరత ఉందన్నారు.

ఆర్‌డీటీపై కుట్రలను ఎదుర్కొందాం: ఎమ్మార్పీఎస్

గాంధీనగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్‌డీటీ)పై జరుగుతున్న కుట్రలు, ప్రజా సంక్షేమంపై జరుగుతున్న దాడులుగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరావు అభివర్ణించారు. గాంధీనగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సేవా సంస్థలపై జరుగుతున్న కుట్రలు అత్యంత విచారకమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆసుపత్రులు, మొబైల్ హెల్త్ యూనిట్లు, దివ్యాంగులకు ఆపరేషన్లు, పాఠశాలు, మహిళలు, రైతులకు సహకారం అందిస్తుందన్నారు. ఆర్‌డీటీ లైసెన్స్‌ను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎంఈఎఫ్ అధ్యక్షుడు ఉండుర్తి సుబ్బారావు, వేగూరు విజయ్‌కుమార్, యలపల్లి శ్రీనివాస్, పొలిమేర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి

బీసీలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ డిమాండ్ చేశారు. బీసీలకు ప్రత్యే రక్షణ చట్టం తేవాలని కోరారు. సంఘం సమావేశం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోట కల్పించాలని డిమాండ్ చేశారు.

బీసీలకు టీడీపీ ప్రాధాన్యం

ఆత్మీయ సత్కారం కార్యక్రమంలో వక్తలు

చిట్టినగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ బీసీలకు ప్రాధాన్యతనిస్తుందని పలువురు వక్తలు అన్నారు. శ్రీనగరాలసంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చిట్టినగర్ నగరాల మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కల్యాణ మండపములో కూటమి ఏర్పాటు చేసిన నగరాలు వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్లకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ 15 నియోజకవర్గాల్లో ఈ సామాజివర్గానికి ఓటు బ్యాంకు ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని విధాల అవకాశాలు కల్పించి పలు పదవులు ఇవ్వడం ఆనందించతగిన విషయమన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య) మాట్లాడుతూ రాజకీయాలకు కేంద్రబిందువు విజయవాడ అని అన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.నాగుల్‌మీరా మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో నగరాలు ఎటు నిలిస్తే అటే విజయం ఉంటుదన్ని అందరికి తెలిసిన విషయమే అన్నారు. సంఘం అధ్యక్షుడు నల్లాన సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎన్వీరావు, నగరమేయర్ శ్రీమతి రాయన భాగ్యాలక్ష్మి, నగరాల కార్పొరేషన్ ఛైర్మన్ మరుపిళ్ల తిరుమలేశ్వరావు, బుద్ధవారి దేవస్థానం కమిటీ ఛైర్మన్ పిళ్లా సుదర్శనరావు, పోతిన ప్రసాద్, పీఏసీఎస్ ఛైర్మన్, గొల్లపూడి మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ అడ్డూరి లక్ష్మి తదితరులను సత్కరించారు.


సన్మాన గ్రహీతలతో నగరాల నాయకులు

ప్రతి స్త్రీకి చదువు అవసరం..

ప్రతి స్త్రీకి చదువు చాలా అవసరమని కే బీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ జి.కృష్ణవేణి అన్నారు. నగర మహాసభ నగర అధ్యక్షురాలు కె.శేషు మణి అధ్యక్షతన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా పశ్చిమ నగర కమిటీ ఆదివారం కొత్తపేట మోటూరి హనుమంతరావు శ్రామిక భవనంలో జరిగింది. సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ ఆర్థిక స్వాలంబన సాధించడం ద్వారా దేశ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన మహిళలపై అత్యాచారాలు హింస ఆగడం లేదన్నారు. మద్యం, మత్తు పదార్థాలు, ఆన్లైన్ బెట్టింగులు, కుటుంబాలను వీధులు పాలు చేస్తున్నాయన్నారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ రుణాలు అమలు చేయాలన్నారు. షేక్ రాజా హాస్పటల్‌ని 100 పడకల హాస్పటల్‌గా అభివృద్ధి చేయాలని కోరారు. రేషన్ డిపోలో ద్వారా 14రకాల నిత్యవసర సరుకులు ఇవ్వాలన్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షురాలిగా ఎ.ఆదిలక్ష్మి, అధ్యక్ష కార్యదర్శులుగా విజయలక్ష్మి వెంకటరత్నం, సహాయ కార్యదర్శి ఓ.రమ, ఓ.వరలక్ష్మి తదితరులను ఎన్నుకున్నారు.

టీటీడీలో పేద బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

సత్యనారాయణపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : టీటీడీ దేవస్థానంలో లడ్డూ ప్రసాదాల తయారీ విభాగంలో బ్రాహ్మణులను వెంటనే పర్మినెంట్ చేయటంతోపాటు ఆరోగ్య బీమా కల్పించాలని ధార్మిక పరివార్ జాతీయ అధ్యక్షుడు వి.వి. రామారావు, వ్యవస్థాపకులు బాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆందోళనల్లో భాగంగా ఆధ్వర్యంలో ఆదివారం సత్యనారాయణపురంలో 146 నదీ జలాలతో మహా రుద్రాభిషేక నిర్వహించారు. ఈ సందర్భంగావి.వి. రామారావు, శ్రీనివాస్ మాట్లాడుతూ టీటీడీ దేవస్థానంలో 25 సంవత్సరాలుగా లడ్డూ ప్రసాదాల తయారీ విభాగంలో పని చేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలడి ధార్మికపరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదికల తరుపున నిర్ణయించామన్నారు. ఈ సమస్యపై త్వరలో దేవదాయశాఖ మంత్రి, ,డిప్యూటీ సీఎంకు వినతి పత్రాన్ని అందజేస్తామన్నారు.

దిక్సూచి



మేనేజ్‌మెంట్, కామర్స్ విద్యార్థుల కోసం ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో) కొన్ని ఉచిత కోర్సులను అందిస్తోంది. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని 'స్వయం' (https://swayam.gov.in) - పోర్టల్‌లో ఈ కోర్సుల పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు, అలాగే ఎన్‌రోల్ కావచ్చు.

మేనేజ్‌మెంట్ విద్యార్థుల కోసం 'ఇగ్నో' ఉచిత కోర్సులు

ఫైనాన్షియల్ అకౌంటింగ్: అకౌంటింగ్, అకౌంటింగ్ ప్రాసెస్, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ ప్రిపరేషన్, అండర్ స్టాండింగ్, ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ తదితరాలను ప్రొఫెసర్ సునీల్ కుమార్ బోధిస్తారు. మొత్తం 16 వారాల కోర్సు. 2025 డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు.

బిజినెస్ ఆర్గనైజేషన్ అండ్ మేనేజ్‌మెంట్: బిజినెస్ అండ్ బిజినెస్ ఎంట్రప్రెజెస్‌పై ఉంటుంది. ప్రొఫెసర్ నావెల్ కిశోర్, అతని టీమ్ దీనిని బోధిస్తారు. 16 వారాల కోర్సు. పరీక్షలు 2025 డిసెంబర్‌లో నిర్వహిస్తారు.

బిజినెస్ లా: సోషల్, డొమెస్టిక్, మోరల్, రిలీజియస్, కమర్షియల్‌కి సంబంధించిన అగ్రిమెంట్స్ మొదలైన వాటిపై కోర్సు ఉంటుంది. 16 వారాల కోర్సు. పరీక్షలు డిసెంబర్ రెండో వారంలో ఉంటాయి. ప్రొఫెసర్ డా.మధులిక సారికర్ బోధిస్తారు.

ఇన్‌కంటాక్స్ లా అండ్ ప్రాక్టీస్: ఇన్‌కంటాక్స్ చట్టాలు, ప్రాక్టీస్ పట్ల విద్యార్థులకు అవగాహన పెంచడం కోసం ఉద్దేశించిన 15 వారాల కోర్సు ఇది. డిసెంబర్ రెండో వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

ప్రిన్స్‌పల్స్ ఆఫ్ మార్కెటింగ్: ఏ వ్యాపారంలోనైనా మార్కెటింగ్ రోల్‌ను అర్థం చేసుకోవడం, తదితరాలపై ఏర్పాటు చేసిన కోర్సు ఇది. ప్రొఫెసర్ డాక్టర్ అనుప్రియా పాండే దీనిని బోధిస్తారు. 16 వారాలో కోర్సు. డిసెంబర్ రెండో వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

బిజినెస్ కమ్యూనికేషన్: బిజినెస్ కమ్యూనికేషన్ ఎలా జరుగుతుంది, మీటింగ్స్, బిజినెస్ డీలింగ్స్, క్లయింట్ ప్రజంటేషన్ తదితరాలన్నీ ఇందులో బోధిస్తారు. ప్రొఫెసర్ డాక్టర్ రశ్మీ బన్సాల్ దీనిని బోధిస్తారు. మొత్తం 12 వారాల కోర్సు. పరీక్షలు 2025 డిసెంబర్‌లో ఉంటాయి.

ఫైనాన్షియల్ లిటరసీ: ఫైనాన్స్‌లో కెరీర్ ఎంచుకోవాలనుకునే వారికి ఉద్దేశించిన కోర్సు ఇది. భారత దేశంలో ఫైనాన్షియల్ సెక్టార్‌లో పేరొందిన వారు బోధిస్తారు.

ఎంట్రప్రెన్యూర్ స్కిల్స్ అండ్ డిజిటల్ మార్కెటింగ్ స్ట్రాటజీస్: కోర్సు వ్యవధి 12 వారాలు. ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఫండమెంటల్స్, డిజిటల్ మార్కెటింగ్ స్ట్రాటజీస్ తదితరాలపై కోర్సు ఉంటుంది. ఎంట్రప్రెన్యూర్స్ కావాలనుకునే వారిని, కాలేజ్ లెర్నర్స్, చిన్న బిజినెస్ వారిని ఉద్దేశించి తయారు చేశారు. వారికి ప్రాక్టికల్ నాలెడ్జ్ కల్పిస్తారు.

స్కూలు టీచర్ల కోసం మద్రాసు ఐఐటీ ఫ్రీ ఏఐ కోర్సులు



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ప్రతీ రంగాన్ని రీషేపింగ్ చేసింది. దీనికి అతీతమైన రంగం అంటూ ఇప్పుడు లేదు. దీనికి ఎడ్యుకేషన్ మినహాయింపు ఏమీ కాదు. లెర్నింగ్ ప్రక్రియను ఏఐ పూర్తిగా మార్చేసింది. ఈ ప్రక్రియను ఎవరైతే తరగతి గది వరకు తీసుకెళ్లగలరో వారే భవిష్యత్తులో విజయవంతమైన ఉపాధ్యాయులుగా నిలబడగలుగుతారు. దేశానికి అలాంటి టీచర్లను తయారు చేయడం కోసం మద్రాస్ ఐఐటీ ఒక ప్రోగ్రామ్‌ను రూపొందించింది. కిండర్ గార్టెన్ మొదలుకుని ఇంటర్ వరకు దేశవ్యాప్తంగా ఉన్న స్కూలు టీచర్ల కోసం 'ఏఐ ఫర్ ఎడ్యుకేటర్స్' పేరుతో ఉచిత ఆన్‌లైన్ కోర్సులను ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వ స్వయం పోర్టల్ ద్వారా ఈ కోర్సులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. గతంలో 'ఏఐ ఇన్ ఫిజిక్స్', 'ఏఐ ఇన్ కెమిస్ట్రీ', 'ఏఐ ఇన్ అకౌంటింగ్', 'క్రికెట్ అనాల్సిస్ విత్ ఏఐ', పైథాన్ ద్వారా ఏఐ/ఎంఎల్ కోర్సులను తెచ్చింది.

- 'ఏఐ ఫర్ ఎడ్యుకేటర్స్' కోర్సు కాలవ్యవధి 25 నుంచి 45 గంటలు. ఇది పూర్తిగా ఉచితం. దీనిలో సర్టిఫికెట్ కావాలనుకునే వ్యక్తులు నామ మాత్రపు ఫీజు చెల్లించి, ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్ష రాయాలి. సర్టిఫికెట్ వద్దు అనుకునేవారు ఆన్‌లైన్ కోచింగ్‌తోనే ఆపేయవచ్చు.
- ఏఐ అవగాహన పెంచుకోవాలనుకునేవారు, ఏఐతో తమ బోధన ప్రమాణాలు పెంచుకోవాలనుకునేవారు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి ఎలాంటి ఏఐ, కోడింగ్ అనుభవం అవసరం లేదు. డిజిటల్ లిటరసీ ఉంటే చాలు అని చెబుతున్నారు మద్రాస్ ఐఐటీ డైరెక్టర్ వి.కామకోటి. ఆర్ట్స్, కామర్స్, సైన్స్ ఇలా అన్ని రంగాల వారికీ ఉపయోగ పడేలా ఈ కోర్సును డిజైన్ చేశారు. 2025 అక్టోబర్ 10లోపు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు.

వెబ్‌సైట్: swayamplus.swayam2.ac.in/aiforallcourses

బ్యాంక్ ఉద్యోగాలు

ఎస్‌బీఐలో మేనేజర్లు

ఖాళీలు 122

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెగ్యులర్ ప్రాతిపదికన 122 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- మేనేజర్(క్రెడిట్ అనలిస్ట్): 63 పోస్టులు
- మేనేజర్(ప్రొడక్ట్స్-డిజిటల్ ప్లాట్‌ఫామ్స్): 34 పోస్టులు
- డిప్యూటీ మేనేజర్(ప్రొడక్ట్స్ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్): 25 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ/ ఎంబీఏ/పీజీడీబీఏ/ పీజీడీబీఎం/ సీఏ/సీఎఫ్ఏ/ఐసీడబ్ల్యూఏ/ బీఈ/బీటెక్ తోపాటు పని అనుభవం ఉండాలి.

వయస్సు: మేనేజర్‌కు 28-35 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 25-32 ఏళ్లు, మేనేజర్ క్రెడిట్ అనలిస్ట్ 25-35 ఏళ్ల మధ్యలో ఉండాలి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 2

వెబ్‌సైట్: https://sbi.bank.in/



ఐఓబీలో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీలు 127

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్(ఐఓబీ)లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువడింది.

అర్హత: డిగ్రీ/బీఆర్క్/బీటెక్/బీఈ, ఎంఎస్సీ/ ఎంఈ/ ఎంటెక్ ఎంబీఏ/పీజీడీబీఏ/పీజీడీఎమ్ పాసై ఉండాలి.

వయస్సు: 2025 సెప్టెంబర్ 1 నాటికి పోస్టులను అనుసరించి 25 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా జరుగుతుంది.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 3

వెబ్‌సైట్: www.iob.bank.in/Careers

ఆర్‌బీఐలో గ్రేడ్-బీ ఆఫీసర్లు

ఖాళీలు 120

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 120 ఆఫీసర్ గ్రేడ్-బీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

- ఆఫీసర్స్ గ్రేడ్ బీ(జనరల్ కేడర్): 83
- ఆఫీసర్స్ గ్రేడ్-బీ(డీఈపీఆర్ కేడర్): 17
- ఆఫీసర్స్ గ్రేడ్-బీ(డీఎస్ఐఎమ్ కేడర్): 29

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ పాసై ఉండాలి. పని అనుభవం కూడా ఉండాలి.

వయస్సు: 2025 సెప్టెంబర్ 1 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 30

వెబ్‌సైట్: https://opportunities.rbi.org.in/

SCHOLARSHIP ALERT

JK Tyre Shiksha Sarthi Scholarship Program

Description: JK Tyre & Industries Limited invites applications from daughters of heavy vehicle drivers who are pursuing general or professional undergraduate or diploma courses and reside in select locations.

Eligibility: Open to female students who are HMV Driver's daughters and are enrolled in general or professional undergraduate or diploma courses.

- Applicants must have secured a minimum of 55% marks in their previous academic year.
- Annual family income must be less than or equal to 5,00,000.
- Applicants must be residents of Rajasthan, Madhya Pradesh, Uttarakhand, Karnataka, and Tamil Nadu.
- Children of employees of JK Tyre and Buddy4Study are not eligible to apply.

Prizes & Rewards: Annual Fixed Scholarship Details:

- Professional Undergraduate Courses: INR 25,000
- General Undergraduate Courses: INR 15,000
- Diploma Courses: INR 15,000

Last Date to Apply: 06-10-2025 ***Application mode:*** Online Application only

Short Url: www.b4s.in/aj/JKTS3

OakNorth STEM Scholarship Programme

Description: The OakNorth STEM Scholarship Programme is an initiative by OakNorth aimed at supporting underprivileged women aspiring to pursue a degree in STEM (Science, Technology, Engineering, Mathematics). This scholarship is available to female students from Haryana, Uttarakhand, and Bihar who have completed their Class 12 and are currently enrolled in a STEM-related undergraduate program (any year) at government colleges or universities.

Eligibility: The scholarship is available to students who are residents of Haryana, Uttarakhand, and Bihar.

- Only female applicants are eligible for consideration.
- Applicants should be enrolled in an undergraduate STEM program (Science, Technology, Engineering, Mathematics) at government universities or colleges in India, regardless of the year of study.
- Candidates must have secured an aggregate of 75% or more in their Class 12 (or equivalent) exam, with at least 65% in the previous class/semester/year (if applicable).
- The annual family income of the applicant should not exceed 3 lakhs.
- Children of Buddy4Study and OakNorth employees are not eligible to apply.

Prizes & Rewards: 30,000 (fixed amount) ***Last Date to Apply:*** 30-09-2025


Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/ONSS4

buddy4study.com

చిత్రజ్యోతి

SINCE 1965



దసరాకు ఇడ్లీకొట్టు

ధనుశ్ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఇడ్లీ కొట్టు'. డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్ బేనర్‌పై ఆకాశ్ భాస్కరన్, ధనుశ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఇది ధనుశ్ దర్శకత్వం వహిస్తోన్న నాలుగో చిత్రం కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. దసరా సందర్భంగా తెలుగు, తమిళ్‌లో అక్టోబరు 1న విడుదలవుతోందీ చిత్రం. తెలుగులో వేదక్షర మూవీస్ బ్యానర్‌పై నిర్మాత చింతపల్లి రామారావు విడుదల చేస్తున్నారు. సత్యరాజ్, అరుణ్ విజయ్, నిత్యా మీనన్, షాలినీ పాండే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: జీకే ప్రసన్న, డీఓపీ: కిరణ్‌కౌశిక్, సంగీతం: జీవి ప్రకాశ్‌కుమార్.

సినిమా విడుదలకు అనుమతివ్వలేదు



పాకిస్థాన్ నటుడు ఫవాద్ ఖాన్, బాలీవుడ్ నటి వాణి కపూర్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'అబీర్ గులాల్'. అయితే ఈనెల 26న సినిమా ఇండియాలో విడుదల కానున్నదనే వార్తలు కొద్ది రోజులుగా బీటౌన్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. తాజాగా ఈ వార్తలు అవాస్తవమని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) పేర్కొంది. ఈ సినిమా విడుదలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేసింది. నిజానికి సినిమా ఈ ఏడాది మే 9న ఇండియాలో విడుదల కావాల్సి ఉంది. అయితే ఏప్రిల్ 22న పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అనంతరం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో విడుదల నిలిచిపోయింది. కాగా, భారతదేశం మినహా ప్రపంచ వ్యాప్తంగా ఈనెల 12న సినిమా విడుదలైంది.



'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ పూర్తి

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తర్వాత పవన్ కల్యాణ్- హరీశ్ శంకర్ కలయికలో వస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై అభిమానుల్లో అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. తాజాగా చిత్రబృందం భారీ షెడ్యూల్‌ను విజయవంతంగా ముగించింది. పవన్ కల్యాణ్ కూడా తన భాగం చిత్రీకరణను పూర్తి చేశారు. త్వరలోనే నిర్మాణాంతర కార్యక్రమాలు మొదలు పెట్టనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

మరో పాట సిద్ధం



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓజీ'. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై డీవీవీ దానయ్య నిర్మించారు. సినిమా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అయితే తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన 'గన్స్ అండ్ రోజెస్' గీతాన్ని నేడు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం పేర్కొంది. తమన్ సంగీతం అందించారు. ఈ సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన స్పెషల్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది.

ఊర్వశీ రౌతేలాకు ఈడీ సమన్లు



బెట్టింగ్ యాప్స్ కేసులో భాగంగా బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. '1 ఎక్స్ బెట్' అనే బెట్టింగ్ యాప్ కేసుకు సంబంధించి ఈడీ మంగళవారం ఊర్వశీని విచారించనుంది. నేడు నటి, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మిమి చక్రవర్తి కూడా ఇదే యాప్ కేసు విషయంలో ఈడీ విచారణకు హాజరు కానుంది. కాగా, ఇప్పటికే ఈ కేసు విషయంలో పలువురు సెలబ్రిటీలను ఈడీ విచారించింది.

అలాంటి పాటలు రాయడం చాలా కష్టం



శ్రీమణి

నాగచైతన్య నటించిన '100% లవ్' చిత్రంతో గీతరచయితగా టాలీవుడ్‌లో అడుగుపెట్టారు శ్రీమణి. ఆ తర్వాత వరుస చిత్రాలలో ఆయన రాసిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం 'ఆకాశంలో ఒక తార', 'సంబరాల యేటి గట్టు', 'ఇండియా హౌస్' చిత్రాలకు గీతాలు రాస్తున్న శ్రీమణి, తాజాగా మీడియాతో ముచ్చటించారు. 'అత్తారింటికి దారేది'లో పవన్‌కల్యాణ్ కోసం రాసిన 'ఆరడుగుల బుల్లెట్టు' సాంగ్ నా కెరీర్‌కు ఎంతగానో దోహదపడింది. నాకు కావాల్సిన బ్రేక్ఇచ్చింది. 'ఎమ్‌సీఏ'లో 'ఎక్కడ ఎక్కడ' పాట వల్ల ప్రేమ పాటలకు ఎక్కువగా రాసే అవకాశం దక్కింది. ఒకప్పుడు పాట ప్రేక్షకులకు చేరువ కావడానికి కొంత సమయం పట్టేది. కానీ ఇప్పుడున్న సోషల్ మీడియా ట్రెండ్ పుణ్యమా అని విన్న వెంటనే నచ్చేయాలి. అలాంటి పాటలు రాయడం గీత రచయితలకు చాలా కష్టం. అయినా ఆ సవాల్‌ను స్వీకరించి పాటను పదేళ్ల పాటు గుర్తుపెట్టుకునేలా రాస్తున్నాం. దర్శకుడు సుకుమార్ నేను ఆరాధించే వ్యక్తుల్లో ఒకరు. 'గీత గోవిందం'లో నేను రాసిన 'వచ్చిందమ్మా' పాట విని ఆయన అభినందించడం చాలా గొప్పగా అనిపించింది. అలాగే దివంగత గేయరచయిత, సిరివెన్నెల సీతారామశాస్త్రి గారు 'మహర్షి' పాట విని బాగా రాశావని ప్రశంసించడం మరిచిపోలేని అనుభూతి' అని చెప్పారు.

కదిలించే సన్నివేశాలతో...



బి గణేశ్, బద్దెల శ్రీనివాస్, నవ్యశ్రీ ప్రధాన పాత్రధారులుగా టీకేఎస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ప్రేమతో దెయ్యం'. బి కుమారస్వామి నిర్మించారు. తాజాగా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ 'ఇదో విభిన్న తరహా చిత్రం. ఇందులోని సన్నివేశాలు ప్రేక్షకులను కదిలించేలా ఉంటాయి' అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: డీఆర్ శ్యామ్‌కుమార్, సినిమాటోగ్రాఫర్: శేఖర్, సంగీతం: సీహెచ్ అమ్మ పాండు.

వినోదంతో పాటు ఆలోచింపజేస్తుంది

\- రామాంజనేయులు జవ్వాజి



"భద్రకాళి' లాంటి పొలిటికల్ థ్రిల్లర్ ఇప్పటివరకూ రాలేదు. ఈ సినిమాలో మంచి వినోదంతో పాటు ప్రేక్షకులను ఆలోచింపజేసే అంశాలూ ఉన్నాయి. ఇందులో విజయ్ ఆంటోనీ పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది' అని నిర్మాత రామాంజనేయులు జవ్వాజి అన్నారు. విజయ్ ఆంటోని కథానాయకుడిగా అరుణ్ ప్రభు దర్శకత్వం వహించిన చిత్రమిది. సర్వంత్‌రామ్ క్రియేషన్స్ బేనర్‌పై రామాంజనేయులు నిర్మించారు. ఈ నెల 19న ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

- విజయ్ ఆంటోనీతో కలసి వరుస చిత్రాలు ప్లాన్ చేశాం. మా కాంబినేషన్‌లో వచ్చిన 'మార్గన్' చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. దానికి మించిన విజయాన్ని ఈ సినిమా అందుకుంటుందని భావిస్తున్నాం. అరుణ్ ప్రభు చెప్పిన లైన్ ఆకట్టుకుంది. ఆయన విజన్ వల్లే సినిమా బాగా వచ్చింది. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఆయన కథ రాసుకున్నారు. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి సినిమా తీయడంలో ఆయనకు ఆయనే సాటి. సినిమా మొదలైన రెండు నిమిషాల్లోనే ప్రేక్షకులు కథలో లీనమైపోతారు. ఆరంభం నుంచి ముగింపు వరకూ ఎక్కడా బోర్ కొట్టదు. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది.
- 'భద్రకాళి' విజయ్ ఆంటోనికి 25వ సినిమా. మంచి బడ్జెట్‌తో అన్ని హంగులతో తెరకెక్కించాం. విజయ్ పాత్ర సహజత్వానికి దగ్గరగా ఉంటుంది. ప్రస్తుతం తమిళం, మలయాళంలోనూ మా బేనర్‌పై సినిమాలు చేస్తున్నాం. తెలుగులో సత్యదేవ్‌తో 'ఫుల్ బాటిల్', తమిళంలో 'బిచ్చగాడు' దర్శకుడు శశితో విజయ్ ఆంటోని హీరోగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాను.

ఆద్యంతం ఉత్కంఠభరితం



సూపర్ రాజా కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రానికి 'ఇలాంటి సినిమా మీరెప్పుడూ చూసుండరు' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సూపర్‌రాజా మాటాడుతూ 'సహజత్వానికి దగ్గరగా ఉండే కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. ప్రతి ఒక్కరి జీవితానికి దగ్గరగా ఉంటుంది. ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో సినిమాను రూపొందించాం. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది' అని చెప్పారు.

ఆ టైటిల్ మాకే సొంతం



'అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' పేరుతో వీఎస్ఆర్ ఫిల్మ్స్ సంస్థ బయోపిక్‌ను నిర్మిస్తోంది. దీనికి అచ్చర్ల రాజుబాబు దర్శకత్వం వహిస్తున్నారు ఏఆర్‌టీ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్‌ని కూడా ప్రారంభించబోతున్నారు. ప్రస్తుతం నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతోంది. 'అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' టైటిల్ హక్కులు తమకే సొంతమని, ఫిల్మ్ ఛాంబర్‌లో రిజిస్టర్ చేయించామని వీఎస్ఆర్ ఫిల్మ్స్ సంస్థ పేర్కొంది. మరోవైపు ఎలాంటి టైటిల్ రిజిస్ట్రేషన్ లేకుండానే 'ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' పేరుతో రవి నారాయణ్ దర్శకత్వంలో ఉషారాణి మూవీస్ బేనర్‌పై వల్లూరి రాంబాబు నిర్మిస్తున్నారని వీఎస్ఆర్ ఫిల్మ్స్ ఆరోపించింది. 'రవి నారాయణ్ గతేడాది టైటిల్ ఇవ్వమని అడిగారు. మేము ఇవ్వడం కుదరదు అని తేల్చి చెప్పాం. అయినా కూడా మా అనుమతి లేకుండానే సినిమా షూటింగ్ చేస్తున్నారు. చట్టపరంగా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం' అని వీఎస్ఆర్ ఫిల్మ్స్ సంస్థ తెలిపింది.


మీనాక్షి

మన బంగారాలు
మీనాక్షి, జైస్మిన్


జైస్మిన్


నూపుర్

- రెండు స్వర్ణాలు కొల్లగొట్టిన భారత బాక్సర్లు
- నూపుర్‌కు రజతం
- పూజకు కాంస్యం

లివర్‌పూల్ (ఇంగ్లండ్): జైస్మిన్ లంబోరియా, మీనాక్షి హుడా ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణ పతకాలు కొల్లగొట్టారు. తద్వారా భారత బాక్సింగ్ చరిత్రలో తమ స్థానాలను సుస్థిరం చేసుకున్నారు. జైస్మిన్, మీనాక్షి అద్భుత ప్రతిభతో విదేశీ గడ్డపై పోటీల మహిళా విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన (2-1-1=4 పతకాలు) చేసిన ఘనతను భారత్ అందుకుంది. ఆదివారం జరిగిన మహిళల 57 కి. విభాగం ఫైనల్లో జైస్మిన్ 4-1 స్కోరుతో పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత జూలియా సెజెర్‌మెటా (పోలెండ్)ను చిత్తు చేసి ప్రపంచ విజేతగా ఆవిర్భవించింది. 48 కి. కేటగిరీ తుదిపోరులో మీనాక్షి హుడా 4-1 స్కోరుతోనే పారిస్ విశ్వక్రీడల్లో కాంస్యం సాధించిన నజిమ్ కిజబై (కజకిస్థాన్)ను ఓడించి వరల్డ్ టైటిల్ దక్కించుకుంది. ఇక హోరాహోరీగా సాగిన మహిళల 80+కి. స్వర్ణ పతక పోరులో నూపుర్ షెరాన్ 2-3తో కజమరస్కా అగాట (పోలెండ్) చేతిలో ఓడి రజతం కైవసం చేసుకుంది. మహిళల 80 కిలోల విభాగం సెమీఫైనల్లో పూజారాణి 4-1తో సెర్మెటా జూలియా (పోలెండ్) చేతిలో పరాజయం చవిచూడడంతో కాంస్య పతకానికే పరిమితమైంది. మొత్తంగా..ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత మహిళలు రెండు స్వర్ణ, ఒక రజత, ఒక కాంస్యంతో అత్యుత్తమ ప్రదర్శన చేయడం విశేషం. పసిడి పతకాలు సాధించడం ద్వారా..ప్రతిష్ఠాత్మక వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో ఆరు స్వర్ణాలు చేజిక్కించుకున్న మేరీ కోమ్, రెండుసార్లు విజేత నిఖత్ జరీన్, సరితాదేవి, జెనీ ఆర్‌ఎల్, కేసీ లేఖ, నితూ ఘన్గాస్, లవ్లీనా బోర్గొహైన్, స్వీటీ బూరా సరసన మీనాక్షి, జైస్మిన్ చేరారు.



మేఘనకు కాంస్యం

షూటింగ్ వరల్డ్‌కప్

నింగ్బో (చైనా): భారత షూటర్ మేఘన సజ్జనార్ తన కెరీర్‌లో తొలిసారిగా వరల్డ్‌కప్ పతకం సాధించింది. ఆదివారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో ఆమె కాంస్యం అందుకుంది. శనివారం 10 మీ. ఎయిర్ పిస్టల్‌లో ఇషా సింగ్ స్వర్ణం సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఈ రెండు పతకాలతో ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్ రైఫిల్/పిస్టల్ ఈవెంట్‌లో భారత్ ఐదో స్థానంలో నిలిచింది. గత ఎనిమిదేళ్లలో తొలిసారి వరల్డ్‌కప్ ఫైనల్‌కు చేరిన మేఘన 230 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. అలాగే చైనాకు చెందిన 16 ఏళ్ల షూటర్ పెంగ్ జిన్ 255.3తో వరల్డ్ రికార్డుతో పసిడి పతకం దక్కించుకుంది. ఇక పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో ఫైనల్‌కు చేరిన కిరణ్ అంకుశ్ జాదవ్ ఎనిమిదో స్థానంలో నిలిచాడు. ఇదే ఈవెంట్‌లో స్వప్నిల్ కుశాలే ఫైనల్ చేరలేకపోయాడు.

రెండో స్థానంలో అర్జున్

సమర్కాండ్ (ఉజ్బెకిస్థాన్): ఫిడే గ్రాండ్ స్విస్ టోర్నమెంట్‌లో ఆదివారం పదో రౌండ్ ముగిసేసరికి ఇరిగేసి అర్జున్ (6) మరో ఆరుగురితో కలిసి రెండో స్థానంలో నిలిచాడు. బ్లూబామ్ (జర్మనీ-6.5) మరో ముగ్గురితో కలిసి టాప్‌లో ఉన్నాడు. పదో రౌండ్‌లో చైనా జీఎం యు యాంగితో తలపడిన అర్జున్ 54వ ఎత్తు వద్ద డ్రా చేసుకున్నాడు. స్థానిక జీఎం నోడిర్బెక్ అబ్దుసత్తొరోవ్‌తో తలపడిన నిహాల్ సరీన్ 53వ ఎత్తు వద్ద డ్రాకి అంగీకరించి రెండో స్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో ముజిచుక్ (ఉక్రెయిన్)పై వైశాలి (6.5) 42 ఎత్తుల్లో నెగ్గి మరో ముగ్గురితో కలిసి ప్రథమ స్థానంలో కొనసాగుతోంది.


భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ పుట్టినరోజు (ఆదివారం) సందర్భంగా దుబాయ్‌లోని హోటల్లో జరిగిన కార్యక్రమంలో అతన్ని అభినందిస్తున్న చాముండేశ్వర్‌నాథ్

పాక్‌ను కుమ్మేశారు

- రాణించిన సూర్య, అభిషేక్, తిలక్
- కుల్దీప్‌నకు మూడు వికెట్లు
- ఆసియాకప్

ఏడు వికెట్లతో టీమిండియా ఘనవిజయం

దేశమంతటా బాయ్‌కాట్ డిమాండ్ గట్టిగా వినిపిస్తున్న వేళ.. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను టీమిండియా కోలుకోలేని దెబ్బకొట్టింది. తమతో ఆట అంత సులువు కాదని చాటి చెబుతూ ఆసియా కప్‌లో పాక్‌పై విజయభేరి మోగించింది. స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్ బంతితో చెలరేగితే.. బ్యాటింగ్‌లో అభిషేక్ మెరుపు ఇన్నింగ్స్‌కు సూర్యకుమార్, తిలక్ జత కలవడంతో పాక్ నిర్దేశించిన స్వల్ప స్కోరును భారత్ సులువుగా ఛేదించింది.


సూర్యకుమార్ (47 నాటౌట్)

కుల్దీప్ (3/18)

దుబాయ్: ఆసియాకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు దూసుకెళ్తోంది. పాకిస్థాన్‌పై తమ ఆధిపత్యాన్ని చాటుకుంటూ ఆదివారం గ్రూప్ 'ఏ'లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో ఏడు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. సూర్యకుమార్ (37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 47 నాటౌట్) అజేయంగా నిలిచాడు. తాజా టోర్నీలో భారత్‌కిది వరుసగా రెండో విజయం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 127 పరుగులు చేసింది. ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ (44 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 40), షహీన్ అఫ్రీది (16 బంతుల్లో 4 సిక్సర్లతో 33 నాటౌట్) ఆకట్టుకున్నారు. స్పిన్నర్ కుల్దీప్‌నకు మూడు.. అక్షర్, బుమ్రాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 15.5 ఓవర్లలో 3 వికెట్లకు 131 పరుగులు చేసి నెగ్గింది. అభిషేక్ (13 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 31), తిలక్ (31 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 31) రాణించారు. సయీమ్‌కు 3 వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కుల్దీప్ యాదవ్ నిలిచాడు. ఇక.. గతంలో మాదిరిగా ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో అమితోత్సాహం కనిపించలేదు. అలాగే దుబాయ్ స్టేడియాన్ని కమ్మేసే సెలెబ్రిటీల హంగామాగానీ అసలే కనిపించలేదు.

దూకుడుతో మొదలు..

స్వల్ప ఛేదనను భారత్ మెరుపు వేగంతో ఆరంభించడంతో పవర్‌ప్లేలోనే సగం స్కోరందుకుంది. ఇన్నింగ్స్ తొలి రెండు బంతులనే ఓపెనర్ అభిషేక్ శర్మ 4,6గా మలిచాడు. అటు గిల్ (10) తర్వాతి ఓవర్‌లోనే రెండు వరుస ఫోర్లు సాధించినా సయీమ్ అయూబ్ క్యారమ్ బాల్‌కు స్టంపౌట్ అయ్యాడు. ఇక షహీన్ ఓవర్‌లో అభిషేక్ మరోసారి 4,6తో దాటిని కనబర్చాడు. అయితే తను కూడా సయీమ్ అయూబ్‌కే చిక్కాడు. నాలుగో ఓవర్‌లో రెండు వరుస ఫోర్లు సాధించిన అభిషేక్ లాంగాఫ్‌లో అష్రాఫ్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఇక తిలక్ ఆరో ఓవర్‌లో 13 రన్స్ అందించడంతో జట్టు 61/2 స్కోరుతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. అనంతరం స్పిన్నర్లు అబ్రార్, సుఫియాన్ కట్టడి చేయడంతో సూర్య, తిలక్ కాసేపు ఆచితూచి ఆడారు. అయితే డ్రింక్స్ బ్రేక్‌కు ముందు తిలక్ 6,4తో బ్యాట్‌కు పనిజెప్పాడు. చక్కగా కుదురుకున్న ఈ జోడీని మళ్లీ సయీమ్ విడదీశాడు. 13వ ఓవర్‌లో అద్భుతంగా టర్న్ అయిన బంతికి తిలక్ బౌల్డ్ కావడంతో, మూడో వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో సూర్య వేగం పెంచాడు. గతంలో పాక్‌పై ఎన్నడూ 20+ రన్స్ దాటని తను ఈసారి ఆ అడ్డంకిని అధిగమిస్తూ వరుస ఫోర్లతో చెలరేగాడు. దూబే (10 నాటౌట్)తో కలిసి నాలుగో వికెట్‌కు అజేయంగా 34 రన్స్ జోడించిన సూర్య ఓ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు.

దెబ్బతీసిన స్పిన్నర్లు

టాస్ గెలిచిన పాక్ జట్టు కెప్టెన్ సల్మాన్ భారీ స్కోరు సాధించాలనే ఆలోచనతో బ్యాటింగ్ ఎంచుకున్నాడు. కానీ అతడి వ్యూహం దారుణంగా బెడిసికొట్టింది. క్రీజులోకి దిగిన ప్రతీ బ్యాటర్ ఎదురుదాడికి దిగే ప్రయత్నంలో చకచకా పెవిలియన్‌కు చేరారు. భారత స్పిన్‌త్రయం ఆరు వికెట్లను నేలకూల్చగా.. ఓపెనర్ ఫర్హాన్ ఒక్కడే దీటుగా ఆడాడు. అయితే ఆఖర్లో షహీన్ షా చెలరేగి ఊరటనిచ్చాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ సయీమ్ అయూబ్‌ను హార్దిక్ గోల్డెన్ డకౌట్ చేశాడు. ఇక రెండో ఓవర్‌లో మహ్మద్ హారిస్ (3)ను బుమ్రా అవుట్ చేయడంతో ఆరు పరుగులకే పాక్ రెండు వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో మరో ఓపెనర్ ఫర్హాన్, ఫఖర్ జమాన్ (17) జోడీ ఆదుకునే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా ఫర్హాన్ భారత బౌలర్లను ఇబ్బంది లేకుండా ఎదుర్కొన్నాడు. మూడో ఓవర్‌లో ఫఖర్ రెండు ఫోర్లతో 13 రన్స్ వచ్చాయి. ఇక బుమ్రా రెండు వరుస ఓవర్లలోనూ ఫర్హాన్ రెండు సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. వాస్తవానికి పాక్‌తో ఆడిన చివరి ఐదు టీ20ల్లో బుమ్రా కనీసం ఒక్క సిక్సర్‌ను కూడా ఇవ్వలేదు. వీరి జోరుతో పవర్‌ప్లేలో జట్టు 42/2 స్కోరుతో ఫర్వాలేదనిపించింది. కానీ ఆ తర్వాత స్పిన్నర్ల రాకతో పాక్ కష్టాలు పెరిగాయి. కాస్త కుదురుకున్న ఫఖర్ జమాన్‌ను అక్షర్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 39 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కెప్టెన్ సల్మాన్ (3)ను కూడా అక్షర్ అవుట్ చేయగా, 13వ ఓవర్‌లో కుల్దీప్ వరుస బంతుల్లో హసన్ (5), నవాజ్ (0)లను వెనక్కి పంపాడు. మరో ఎండ్‌లో ఓపిగ్గా క్రీజులో నిలిచిన ఫర్హాన్‌ను సైతం కుల్దీప్ దెబ్బతీయడంతో పాక్ 83 రన్స్‌కే 7 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో వంద పరుగులు కూడా కష్టమే అనిపించింది. అయితే షహీన్ షా వచ్చీ రావడంతోనే భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. ఆఖరి ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో 16 రన్స్ అందించాడు. దీంతో పాక్ కాస్త పోరాడగలిగే స్కోరందుకుంది. అలాగే జట్టు మొత్తంగా 63 డాట్ బాల్స్‌ను ఆడడం గమనార్హం.

ఆసియా కప్‌లో నేటి మ్యాచ్‌లు
యూఏఈ x ఒమన్ (సా.5.30)
శ్రీలంక x హాంకాంగ్ (రా.8.00)

స్కోరుబోర్డు

పాకిస్థాన్: సయీమ్ (సి) బుమ్రా (బి) హార్దిక్ 0, ఫర్హాన్ (సి) హార్దిక్ (బి) కుల్దీప్ 40, హరీస్ (సి) హార్దిక్ (బి) బుమ్రా 3, ఫకర్ (సి) తిలక్ (బి) అక్షర్ 17, సల్మాన్ (సి) అభిషేక్ (బి) అక్షర్ 3, హసన్ నవాజ్ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 5, మహ్మద్ నవాజ్ (ఎల్బీ) కుల్దీప్ 0, ఫహీమ్ (ఎల్బీ) వరుణ్ 11, అఫ్రీది (నాటౌట్) 33, సుఫియాన్ (బి) బుమ్రా 10, అబ్రార్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 127/9; వికెట్ల పతనం:** 1-1, 2-6, 3-45, 4-49, 5-64, 6-64, 7-83, 8-97, 9-111; **బౌలింగ్:** హార్దిక్ 3-0-34-1, బుమ్రా 4-0-28-2, వరుణ్ చక్రవర్తి 4-0-24-1, కుల్దీప్ యాదవ్ 4-0-18-3, అక్షర్ పటేల్ 4-0-18-2, అభిషేక్ 1-0-5-0.

భారత్: అభిషేక్ (సి) ఫహీమ్ (బి) సయీమ్ 31, గిల్ (స్టంప్డ్) హరీస్ (బి) సయీమ్ 10, సూర్యకుమార్ (నాటౌట్) 47, తిలక్ (బి) సయీమ్ 31, శివమ్ దూబే (నాటౌట్) 10, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 15.5 ఓవర్లలో 131/3; వికెట్ల పతనం:** 1-22, 2-41, 3-97; **బౌలింగ్:** అఫ్రీది 2-0-23-0, సయీమ్ 4-0-35-3, అబ్రార్ 4-0-16-0, మహ్మద్ నవాజ్ 3-0-27-0, సుఫియాన్ 2.5-0-29-0.

నో షేక్‌హ్యాండ్స్



పాక్‌తో మ్యాచ్ ఆడడంపై దేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే. దీన్ని దృష్టిలో ఉంచుకుని భారత ఆటగాళ్లు కూడా వారితో అంటీముట్టనట్టుగా మెలిగారు. వారితో మాట్లాడడం కాదు కదా.. కనీసం షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు కూడా ఇష్టపడలేదు. టాస్ సమయంలోనూ పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా, భారత్ కెప్టెన్ సూర్యకుమార్ కరచాలనం చేసుకోలేదు. అలాగే సూర్య సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాక పాక్ ప్లేయర్లను కలవకుండానే దూబేతో కలిసి చకచకా పెవిలియన్‌కు వెళ్లిపోయాడు. అటు పాక్ ఆటగాళ్లు భారత డగౌట్ వైపు వచ్చినా భారత క్రికెటర్లు మాత్రం బయటికి రాలేదు. ఈ విషయమై పాక్ కోచ్ మైక్ హెస్సెన్ మ్యాచ్ అధికారులతో మాట్లాడుతూ అసహనం ప్రదర్శించడం కనిపించింది.

100 మీటర్ల విజేతలు..

ప్రపంచ అథ్లెటిక్స్

మెలిస్సా, సెవిల్లె


మెలిస్సా


సెవిల్లె

టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అత్యంత ఆసక్తి రేకెత్తించిన 100 మీటర్ల రేసులో కొత్త చాంపియన్లు అవతరించారు. పురుషుల వంద మీటర్ల టైటిల్‌ను జమైకాకు చెందిన 24 ఏళ్ల ఒబ్లిక్ సెవిల్లె ఎగరేసుకుపోయాడు. ఫైనల్ రేసును సెవిల్లె 9.77 సెకన్లలో ముగించాడు. ఈ క్రమంలో ఉస్సేన్ బోల్ట్ తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పురుషుల 100 మీటర్ల స్వర్ణం నెగ్గిన జమైకా అథ్లెట్‌గా సెవిల్లె చరిత్రకెక్కాడు. జమైకాకే చెందిన ఫేవరెట్ కిషానె థాంప్సన్ 9.82 సెకన్ల టైమింగ్‌తో రెండోస్థానంలో నిలిచి రజతంతో సరిపెట్టుకున్నాడు. ఇక, టైటిల్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న అమెరికా స్టార్ నోవా లైల్స్ (9.89 సెకన్లు) మూడో స్థానంతో కాంస్యానికి పరిమితమయ్యాడు. పారిస్ ఒలింపిక్స్ మహిళల 100 మీటర్లలో కాంస్య పతకం గెలిచిన అమెరికా యువ కెరటం మెలిస్సా జెఫర్సన్ వుడెన్.. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మాత్రం స్వర్ణంతో మెరిసింది. పారిస్ విశ్వక్రీడల చాంప్ జులియన్ అల్‌ఫ్రెడ్, షెకారి రిచర్డ్‌సన్, షెరికా జాక్సన్‌లాంటి స్టార్లను వెనక్కి నెడుతూ 24 ఏళ్ల మెలిస్సా ఫైనల్లో 10.61 సెకన్ల టైమింగ్‌తో తొలిసారి విజేతగా నిలిచింది. జమైకా అథ్లెట్ టీనా క్లేటన్ (10.76 సెకన్లు) రజతం దక్కించుకోగా, సెయింట్ లూసియాకు చెందిన జులియన్ అల్‌ఫ్రెడ్ (10.84 సెకన్లు) కాంస్యానికి పరిమితమైంది. తనకు ఇదే చివరి ప్రపంచ చాంపియన్‌షిప్ అని ప్రకటించిన జమైకా దిగ్గజ అథ్లెట్, 38 ఏళ్ల షెల్లీ అన్‌ఫ్రేజర్ (11.03 సె) ఆరో స్థానంలో నిలిచింది. షెరికా జాక్సన్ (జమైకా- 10.88 సె), షకారి రిచర్డ్‌సన్ (అమెరికా- 10.94 సె) వరుసగా నాలుగు, ఐదు స్థానాలతో సరిపెట్టుకున్నారు.

భారత్ షెడ్యూల్ నేడు

ఉ. 7 గం.: మహిళల 3 వేల మీటర్ల స్టీపుల్‌చేజ్ హీట్స్ - పారుల్ చౌదరి, అంకితా ధ్యాని; **సా. 4.10 గం:** పురుషుల లాంగ్ జంప్ క్వాలిఫికేషన్స్ - మురళీ శ్రీశంకర్; **సా. 4.53 గం:** పురుషుల 110 మీటర్ల హర్డిల్స్ హీట్స్ - తేజాస్ షిర్సే

హైజంప్ ఫైనల్‌కు సర్వేశ్

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ సర్వేశ్ అనిల్ కుశారె హైజంప్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో రెండు గ్రూప్‌ల నుంచి ఓవరాల్‌గా సంయుక్తంగా తొమ్మిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. తద్వారా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో హైజంప్ ఫైనల్ చేరిన తొలి భారత అథ్లెట్‌గా 30 ఏళ్ల సర్వేశ్ రికార్డు సృష్టించాడు. ఇక, పురుషుల 10వేల మీటర్ల రేస్‌లో పోటీపడ్డ గుల్వీర్ సింగ్ 29 నిమిషాల 13.33 సెకన్ల టైమింగ్‌తో 16వ స్థానంలో నిలిచి నిరాశపరిచాడు.



గెలుపు దిశగా 'సెంట్రల్'

సౌత్‌జోన్‌తో దులీప్ ట్రోఫీ

బెంగళూరు: దులీప్ ట్రోఫీని 11 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సొంతం చేసుకునేందుకు సెంట్రల్‌జోన్ 65 పరుగుల దూరంలో నిలిచింది. ఆటకు నాలుగో రోజైన ఆదివారం సౌత్‌జోన్ మిడిలార్డర్ బ్యాటర్లు అంకిత్ శర్మ, సిద్ధార్థ్ అద్భుతమైన పోరాటంతో ఏడో వికెట్‌కు 192 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో దక్షిణాది జట్టు 426 పరుగులకు ఆలౌటైంది. సెంట్రల్‌జోన్ బౌలర్లలో కార్తికేయ 4, సారాంశ్ జైన్ 3 వికెట్లు దక్కాయి. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో సౌత్‌జోన్ 149, సెంట్రల్‌జోన్ 511 పరుగులు చేశాయి.

హాంకాంగ్ ఓపెన్
రన్నరప్‌తో సరి

ఫైనల్లో లక్ష్య, సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమి





హాంకాంగ్: హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో భారత షట్లర్లు ఆఖరి మెట్టుపై బోల్తా పడ్డారు. ఆదివారం జరిగిన సింగిల్స్ ఫైనల్లో లక్ష్య సేన్, డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ శెట్టి ద్వయం పరాజయం పాలై రన్నరప్‌గా నిలిచారు. రెండేళ్లలో తొలిసారి ఓ మేజర్ టోర్నీ ఫైనల్‌కు చేరిన లక్ష్య వరల్డ్ నెంబర్ 4 లి షి ఫెంగ్‌పై 15-21, 12-21 తేడాతో ఓడాడు. తొలి గేమ్‌లో 4-0తో ఆధిపత్యం చూపినా.. ఆ తర్వాత ఫెంగ్ జోరు ముందు నిలువలేకపోయాడు. రెండో గేమ్‌లోనూ 4-1తో చక్కటి అవకాశం వచ్చినా మరోసారి పట్టు కోల్పోయాడు. ర్యాలీ, క్రాస్ కోర్ట్ స్మాష్‌లతో విరుచుకుపడిన ఫెంగ్ సులువుగానే మ్యాచ్‌ను పూర్తి చేశాడు. మరోవైపు 16 నెలల తర్వాత ఓ టోర్నీ ఫైనల్ ఆడిన సాత్విక్-చిరాగ్ సైతం చక్కటి అవకాశాన్ని చేజార్చుకున్నారు. ఒలింపిక్ రజతం సాధించిన లియాంగ్ వీ కెంగ్-వాంగ్ చాంగ్ (చైనా) ద్వయంతో 61 నిమిషాల పాటు జరిగిన పోరులో 21-19, 14-21, 17-21 తేడాతో భారత్ జోడీ ఓటమి పాలైంది. ఉత్కంఠగా సాగిన తొలి గేమ్‌లో ఆధిపత్యం చూపిన సాత్విక్-చిరాగ్ టైటిల్‌కు చేరువగా వచ్చారు. కానీ కీలక రెండో గేమ్‌లో అదే జోరును చూపడంలో విఫలం కాగా.. నిర్ణాయక చివరి గేమ్‌లోనైతే 2-11తో వెనుకబడ్డారు. ఆ తర్వాత కాస్త పుంజుకున్నా చైనీస్ జోడీ పవర్‌ఫుల్ స్మాష్, సూపర్ నెట్ గేమ్‌తో చాంపియన్‌గా నిలిచింది.

ఆసీస్‌దే తొలి వన్డే

8 వికెట్లతో భారత మహిళల ఓటమి


కెప్టెన్ హర్మన్

ముల్లన్‌పూర్ (న్యూ చండీగఢ్): లిచ్‌ఫీల్డ్ (88), బెత్ మూనీ (77 నాటౌట్), అనాబెల్ సదర్లాండ్ (54 నాటౌట్) హాఫ్ సెంచరీలతో మెరిసిన వేళ భారత మహిళలతో మూడు వన్డేల సిరీస్‌లో ఆస్ట్రేలియా ఘనమైన బోణీ చేసింది. ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లతో విజయం సాధించింది.. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 281/7 స్కోరుకు పరిమితమైంది. ప్రతికా రావల్ (64), మంధాన (58), హర్లీన్ (54) అర్ధ శతకాలు చేశారు. ఛేదనలో ఆస్ట్రేలియా 44.1 ఓవర్లలో 282/2 స్కోరు చేసి నెగ్గింది. రెండో వన్డే బుధవారం ఇక్కడే జరగనుంది.

సంక్షిప్త స్కోర్లు: భారత్ 50 ఓవర్లలో 281/7 (ప్రతికా రావల్ 64, స్మృతి మంధాన 58, హర్లీన్ డియోల్ 54, మేఘన్ షూట్ 2/45, అలనా కింగ్ 1/28, సదర్లాండ్ 1/31, తహిలా మెక్‌గ్రాత్ 1/33); **ఆస్ట్రేలియా 44.1 ఓవర్లలో 282/2** (లిచ్‌ఫీల్డ్ 88, బెత్ మూనీ 77 నాటౌట్, సదర్లాండ్ 54 నాటౌట్, పెర్రీ (33 రిటైర్డ్ హర్ట్) స్నేహ్ రాణా 1/51, క్రాంతి గౌడ్ 1/55)



అయ్యో.. అమ్మాయిలు!

- ఫైనల్లో చైనా చేతిలో ఓడిన భారత్
- ప్రపంచ కప్ బెర్త్ మిస్

ఆసియా కప్ హాకీ

హంగ్జౌ (చైనా): ఆసియా కప్ రూపంలో ప్రపంచ కప్‌నకు నేరుగా అర్హత సాధించే అద్భుత అవకాశాన్ని భారత హాకీ అమ్మాయిలు చేజార్చుకున్నారు. ఆసియా కప్‌లో ఆరంభం నుంచి అద్భుత ప్రదర్శన కనబరచి టైటిల్‌పై ఆశలు కల్పించిన మనోళ్లు.. తుది మెట్టుపై బోల్తా పడ్డారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఫైనల్లో భారత్ 1-4తో ఆతిథ్య చైనా చేతిలో పరాజయంపాలై రన్నరప్‌తో సరిపెట్టుకుంది. భారత క్రీడాకారిణి నవ్‌నీత్ కౌర్ మ్యాచ్ మొదలైన నిమిషానికే పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచింది. చైనా తరఫున జిగ్నియా వూ (21వ నిమిషంలో), హోంగ్ లి (41వ), మీరోంగ్ జూ (51వ), జియాకి జోంగ్ (53వ) తలో గోల్ సాధించి జట్టును చాంపియన్‌గా నిలిపారు. టైటిల్ నెగ్గడంతో చైనా.. వచ్చే ఏడాది బెల్జియం, నెదర్లాండ్స్ వేదికలుగా జరిగే ప్రపంచ కప్‌లో నేరుగా పోటీపడనుంది. చైనాకు ఇది మూడో ఆసియా కప్ టైటిల్. గతంలో 1989, 2009లో చైనా చాంపియన్‌గా నిలిచింది.



బరువు ఎక్కువై.. అనర్హతకు గురై

ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ నుంచి అమన్ అవుట్

జాగ్రెబ్ (క్రొయేషియా): ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఆదివారం భారత్‌కు నిరాశే ఎదురైంది. కచ్చితంగా పతకం సాధిస్తాడనుకున్న పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత అమన్ సెహ్రావత్ (57 కిలోలు) అనూహ్యంగా తన పోటీకి ముందే అనర్హతకు గురవడం గమనార్హం. ఆదివారం పోటీకి ముందు రెజ్లర్ల బరువు తూచే క్రమంలో అమన్ నిర్ణీత బరువు కన్నా 1.7 కిలోలు అధికంగా ఉన్నట్టు నిర్వాహకులు గుర్తించారు. దీంతో నిబంధనల ప్రకారం అమన్‌పై టోర్నీలో పాల్గొనకుండా అనర్హత విధించారు. ఫలితంగా ఒక్క బౌట్ కూడా ఆడకుండానే అమన్ నిరాశగా వెనుదిరిగాడు. ఇక.. మిగతా భారత రెజ్లర్లలో దీపక్ పూనియా (92 కిలోలు) తొలి రౌండ్ గెలిచినా, రెండో రౌండ్లో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించగా.. వికాస్ సింగ్ (74 కి), అమిత్ (79 కి) ఆరంభ బౌట్లలోనే పరాజయం పాలయ్యారు. తొలి రౌండ్లో ఓడిన ముకుల్ దహియా (86 కిలోలు).. ప్రత్యర్థి ఫైనల్ చేరడంతో దక్కిన రెపిచేజ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. అతను రెపిచేజ్‌లో గెలిచి కాంస్య పతక పోరుకు అర్హత సాధించాడు.



కలంకారీ తయారీ ప్రక్రియ తెలిసిన కళాకారులకు వ్యాపారాలు, విక్రయాలు తెలియవు. విక్రయిస్తూ వ్యాపారం చేసేవారికి కలంకారీ తయారీ ప్రక్రియ తెలియదు. ఈ రెండూ తెలిసిన అరుదైన మహిళే, మచిలీపట్నానికి చెందిన తుమ్మలపల్లి లక్ష్మీ మనోజ్ఞ. కలంకారీ కళకు కొత్త హంగులు జోడిస్తూ లెగ్గింగ్స్, బ్లౌజులతో వినూత్న ఆదరణ పొందుతున్న మనోజ్ఞతో నవ్య మాటా మంతీ...

కలంకారీకి కొత్త హంగులు

మాది నూజివీడు. చిన్నప్పుడే మచిలీపట్నం వలసొచ్చేశాం. నాన్న ఆరోగ్యం దెబ్బ తినడంతో కుటుంబ పోషణ భారం నా మీద పడింది. 2000 సంవత్సరంలో ఆంధ్రప్రభలో టైపిస్ట్‌గా పని చేశాను. ఆ సమయంలో దుస్తులు కుట్టించుకోవడం కోసం పెడన వెళ్లి నచ్చిన కలంకారీ వస్త్రాలను తెచ్చుకునేదాన్ని. ఆ వస్త్రాల్లో ఉండే సౌకర్యం, తయారీ ప్రక్రియలు నాకెంతో బాగా నచ్చేశాయి. నాక్కూడా ఆ వస్త్రాలతో ప్రయోగాలు చేయాలనే కోరిక బలంగా ఉండేది. కానీ అందుకు పరిస్థితులు అనుకూలించలేదు. 2009లో పెళ్లయింది. మా దంపతులిద్దరి లక్ష్యాలు ఒకటే కావడంతో, మా ఆలోచనలు కూడా కలిశాయి. అప్పటికే ఆయన కూడా వ్యాపారంలో నష్టపోయి ఉన్నారు. టైపిస్ట్ ఉద్యోగంతో, అదనపు పనివేళలతో నేను కూడా విసిగిపోయి ఉన్నాను. దాంతో ఇద్దరం కొత్త వ్యాపార మార్గంలోకి అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నాం. అప్పట్లో కలంకారీ కర్చీఫ్స్ తయారవుతూ ఉండేవి. కాబట్టి వాటిని కొనుక్కొచ్చి, ప్లెయిన్ చీరల మీద కర్చీఫ్ డిజైన్లు కట్ చేసి అప్లిక్ వర్క్ చేయడం మొదలుపెట్టాను. బొటిక్స్‌కు సప్లై చేసినా ఆదరణ అంతంత మాత్రంగానే ఉండడంతో, పెడనలో ఎవరి దగ్గరైతే ప్రింటింగ్ వేయించుకున్నామో, వాళ్లకే రెడీమేడ్ ప్యాచ్‌లను అందజేశాం! ఆ ప్యాచ్‌వర్క్స్ రెండేళ్ల పాటు చాలా బాగా అమ్ముడైపోయాయి. ఆ తర్వాత వాళ్లు మాకు ముడిసరుకు ఇవ్వడం మానేశారు. దాంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. అలా మొదటిసారిగా ఉత్పత్తి రంగంలోకి అడుగుపెట్టవలసిన పరిస్థితి తలెత్తింది.

క్రెడిట్ అంతా మా వారిదే!

ఇద్దరు మాస్టర్లను తీసుకొచ్చి, జాగా వెతుక్కుని ఉత్పత్తి మొదలుపెట్టాం. కానీ ఆ మాస్టర్లు మెలకువలను వివరించేవారు కాదు. అనుభవం లేని వాళ్లు ప్రింట్లు తప్పుగా గుద్దేసేవారు. అలాంటి వాటితో సంచులు కుట్టించి, అప్లిక్స్ అంటించి లేపాక్షిలో విక్రయించడం మొదలుపెట్టాను. పెడన నుంచి కూడా కొనుగోళ్లు జరిగాయి. అలా మాస్టర్లతో పలు విధాలుగా ముప్పుతిప్పలు పడిన తర్వాత, దంపతులిద్దరం, కలంకారీ లోతుపాతులను నిశితంగా పరిశీలించి, ప్రయోగపూర్వకంగా నేర్చుకున్నాం. నిజానికి ఈ క్రెడిట్ మొత్తం మా వారు సబ్బిశెట్టి నవీన్ కుమార్‌కే దక్కాలి. క్లిష్టమైన పరిస్థితి తలెత్తిన ప్రతిసారీ, కొత్తగా ఏం చేయొచ్చని మాత్రమే నేను ఆలోచించేదాన్ని. ఆ కొత్త ఆలోచనకు కార్యరూపమిచ్చి, ఉత్పత్తిని మార్కెట్‌కు చేరువ చేయడంలో మా వారి కృషి ఎంతో ఉంది.

అలా అసలైన కలంకారీ ఉత్పత్తిలో అంచెలంచెలుగా ఎదిగిన తర్వాత మరొక పెద్ద సమస్య తలెత్తింది. నాణ్యతలో రాజీ పడకుండా తయారుచేసినా, పెడనతో పోల్చి మమ్మల్ని నీరుగార్చేవాళ్లు పెరిగిపోయారు. చివరకు దంపతులిద్దరం హైదరాబాద్‌లో షోరూమ్ పెట్టాలని నిర్ణయించుకున్నాం! అలా 2019లో ఇద్దరు పిల్లలతో సహా హైదరాబాద్ వచ్చేశాం! షోరూమ్‌కు అడ్వాన్స్ కూడా ఇచ్చేశాం. అదే సమయంలో కొవిడ్ మొదలై, రెండోసారి మా వ్యాపారానికి గండి పడింది. దాంతో మచిలీపట్నం తిరుగుముఖం పట్టి, అక్కడి సొంత ఇంట్లోనే పనులు మొదలుపెట్టేశాం. కానీ పాత ప్రదేశంలో తిరిగి పాత సమస్యే ఎదురైంది. అక్కడి ధరలతో సమానంగా అమ్మలేం! ధరలు పెంచి అమ్మే పరిస్థితి కూడా లేదు. దాంతో ఎప్పటి నుంచో ఉన్న నా పాత ఆలోచనను మళ్లీ మా వారి ముందు ఉంచాను. అలా పుట్టుకొచ్చినవే... లైక్రా లెగ్గింగ్స్, బ్లౌజెస్.

లైక్రా బ్లౌజులు భేష్

సాధారణంగా వేసవిలో చీరకట్టుతో ఏదైనా వేడుకకు వెళ్తే, ఇంటికొచ్చి బ్లౌజ్ విప్పే వరకూ ఎంతో చికాకుగా ఉంటుంది. ఈ ఇబ్బంది లైక్రా బ్లౌజులతో ఉండదనిపించింది. కరక్కాయ, పాల మిశ్రమంలో ముంచి తయారుచేస్తున్న లెగ్గింగ్స్ ఎంత మృదువుగా, సుతిమెత్తగా, సౌకర్యంగా ఉన్నాయో బ్లౌజులు కూడా అలాగే ఉండాలని ఆలోచించాను. అలాగే మిగతా బ్లౌజుల్లాగే ఒంటికి హత్తుకుపోయి, ముడతలు లేకుండా ఉండడం కోసం ఎంతో కష్టపడ్డాను. లైక్రా కలంకారీ లెగ్గింగ్స్‌తో పాటు బ్లౌజులు సూపర్‌హిట్ అవడంతో, 2023లో మళ్లీ హైదరాబాద్ వచ్చేసి, కూకట్‌పల్లిలో స్టోర్ తెరిచాను. నేను తయారుచేసిన బ్లౌజులకు గిరాకీ పెరగడానికి పలు కారణాలున్నాయి. స్థూలకాయులు, బ్లౌజులు వేసుకునే అలవాటు లేనివాళ్లు సాధారణ బ్లౌజ్‌లు ధరించడానికి ఇబ్బంది పడుతూ ఉంటారు. అలాగే గుండె జబ్బులున్న వాళ్లు కూడా బిగదీసినట్టుండే సాధారణ బ్లౌజులతో అసౌకర్యానికి గురవుతూ ఉంటారు. వీళ్లందరికీ నా బ్లౌజులు ఒక వరంలా పని చేశాయి.

నాణ్యతే ప్రధానంగా...

ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు విజయవాడలో 'మానవ్' కలంకారీ షోరూమ్స్ ఉన్నాయి. త్వరలో విశాఖపట్నంలో కూడా షోరూమ్ రాబోతోంది. బెంగుళూరు, చెన్నైల్లో కూడా షోరూమ్స్ ప్రారంభించాలనే ఆలోచన ఉంది. ప్రస్తుతం నా దగ్గర 200 మంది కళాకారులు పని చేస్తున్నారు. అర్ధకం పని పూర్తిగా మహిళలదే! ప్రస్తుతం నా దగ్గర కలంకారీ టాప్స్, కాడ్ సెట్స్, లైక్రా లెగ్గింగ్స్, బ్లౌజెస్, టీషర్ట్స్, ఫ్రాక్స్, చీరలు తయారవుతున్నాయి. నైట్‌వేర్ తయారుచేయాలనే ఆలోచన కూడా ఉంది. స్క్రీన్ ప్రింట్లకు గిరాకీ పెరుగుతోంది కాబట్టి మేం కూడా ఈ ప్రింట్స్ వేస్తున్నాం. కానీ నాణ్యత కోసం కరక్కాయ పొడి, పాలు ఉపయోగించడంతో పాటు తప్పనిసరిగా రెండు సహజసిద్ధ రంగులను కూడా ఉపయోగిస్తున్నాం. కృత్రిమ రంగు వేసినా, రసాయనాల ప్రభావంతో చర్మం దెబ్బతినకుండా ఉండడం కోసం రంగు వేసిన వస్త్రాన్ని బాయిల్ చేసిన తర్వాతే మార్కెట్‌లో ప్రవేశపెడుతూ ఉంటాం.

● గోగుమళ్ల కవిత

అసలైన కలంకారీ అదే!

రామాయణ, భాగవతాలను కలంతో బొమ్మలుగా గీసుకుని, సహజసిద్ధ రంగులు అద్దే పనితనమే కలంకారీ. కానీ ఇలాంటి అసలైన కలంకారీ కళ క్రమేపీ అంతరించిపోతోంది. ప్రస్తుతం స్క్రీన్ మీద ఔట్‌లైన్ గీసుకుని, చీర మీద ప్రింట్ తీసుకుని, చేత్తో రంగులు అద్దే ప్రక్రియ పెరుగుతోంది. అలాగని స్వచ్ఛమైన కలంకారీ కళ పూర్తిగా అంతరించిపోలేదు. గిట్టుబాటు ధర చేతికందే సందర్భంలో, ప్రత్యేకించి కంచిపట్టు చీరల కోసం అసలైన కలంకారీకి పూనుకునే కళాకారులు కూడా కొద్ది సంఖ్యలో ఉన్నారు. ఇది శ్రీకాళహస్తి పరిస్థితి. కలంకారీకి పేరు పొందిన పెడనలో పరిస్థితి కాస్త భిన్నం. ఉడ్ బ్లాక్ మీద డిజైన్ చెక్కి, ఐదారు సహజసిద్ధ రంగుల్లో అద్ది అద్దకం వేసే కలంకారీ ప్రక్రియ ఇది. తుప్పు పట్టిన ఇనుప రేకు, బెల్లం, ఉప్పులను కలిపి ఊరబెడితే నలుపు రంగు తయారవుతుంది. అలాగే అడవుల నుంచి కొన్ని సహజరంగులు సేకరిస్తారు. జాజి ఆకు, మోదుగ పువ్వు, తుమ్మ జిగురు.. ఇలా కావలసిన రంగు కోసం పలు రకాల ప్రకృసిద్ధ ముడిపదార్థాలను ఉపయోగిస్తారు. ఇలా ముడిపదార్థాలన్నీ ఉపయోగించి ఒక చీర తయారుచేయడానికి 40 నుంచి 45 రోజుల సమయం పడుతుంది. ఇందుకు వాతావరణం కూడా అనుకూలించాలి.



ఒక్క చీర తయారీకి 45 రోజులు

మొదట్లో లుంగీలు, తలుపు కర్టెన్లు, కర్చీఫ్స్ తయారయ్యేవి. తర్వాత దుప్పట్లు, చీరలు అందుబాటులోకొచ్చాయి. ఆ తర్వాత స్క్రీన్ ప్రింటింగ్ చీరలు వాడుకలోకొచ్చాయి. ఇప్పటికీ వాటినే అసలైన కలంకారీ చీరలుగా నమ్ముతున్నవాళ్లున్నారు. నిజానికి కలంకారీ చీర అసలు ప్రక్రియ గురించి అందరికీ తెలియదు. రన్నింగ్ మెటీరియల్ లేదా చీర.. ఇలా కావలసిన ముడిసరుకు తెచ్చుకుని అవసరమైనంత పొడవు కత్తిరించుకుని, మూటల్లా కట్టి, 24 గంటలపాటు చెరువుల్లో చలవ చేస్తారు. తర్వాత బిరుసు తొలిగిపోయేలా ఉతికి, ఆరబెట్టి, కరక్కాయ పొడి, పాలు కలిపి ఆ మిశ్రమంలో వస్త్రాన్ని నానబెట్టుకుంటారు. తర్వాత ఇదే వస్త్రం ప్రింట్లు పూర్తి చేసుకుని, వాషింగ్‌కు వెళ్లేవరకూ దీని మీద నీటి చుక్క పడకుండా జాగ్రత్త తీసుకోవాలి. లేదంటే వస్త్రం మీద నల్ల మచ్చలు ఏర్పడతాయి. ఇలా ఆరబెట్టి సిద్ధం చేసుకున్న వస్త్రం మీద సహజసిద్ధ రంగులను అద్దుకుంటారు. తర్వాత చివర్లో అదనపు రంగులను వదిలించడం కోసం పారే నీళ్లలో మునిగేలా మోకుకు కట్టి ఉంచుతారు. ఇలా అంతిమంగా అసలు రంగులు తేలిన తర్వాత ఆరబెట్టి, దినుసులు కలిపిన నీళ్లలో మరిగించి, సెకండ్ ప్రింట్ వేసుకుని, రెండోసారి వాష్ చేసి, చివర్లో పటికలో పెడతారు. ఈ ప్రక్రియ మొత్తానికి 45 రోజుల సమయం పడుతుంది.

ఇంట్లోనే కూరగాయలు పండిద్దాం..!

మనకు కావాల్సిన కూరగాయలను ఇంట్లోనే పండించుకుని వండుకుంటే ఆ ఆనందమే వేరు. ఎటువంటి రసాయనాలు లేకుండా సేంద్రియ పద్ధతుల్లో పండించిన కూరగాయలు తినడం ఆరోగ్యానికి మంచిది కూడా. ఇంట్లో కూరగాయల మొక్కలను ఎలా పెంచాలో తెలుసుకుందాం...



- కూరగాయల మొక్కలకు సూర్యరశ్మి అత్యవసరం. రోజుకు కనీసం అయిదు నుంచి ఆరు గంటలపాటు మొక్కలకు ఎండ తగిలేలా చూసుకోవాలి. మేడపైన, బాల్కనీల్లో కుండీలు లేదా గ్రో బ్యాగ్‌లు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇంటి వెనక ఖాళీ ప్రదేశంలో నాటితే మొక్కలు ఏపుగా పెరుగుతాయి.
- మొక్కలకు ఉదయం, సాయంత్రం తగుమాత్రం నీళ్లు పోయాలి. మట్టి ఎప్పుడూ తడిగా ఉండేలా చూసుకోవాలి. కుండీలు, గ్రో బ్యాగ్‌ల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. అదనపు నీరు బయటికి వెళ్లేలా అడుగు భాగంలో రంధ్రాలు చేయాలి. పెరట్లో అయితే మట్టితో మడులు తయారుచేసి వాటిలో కూరగాయల మొక్కలు పెంచవచ్చు.
- టమాటా, వంకాయ, బెండకాయ, దొండకాయ, దోస, బీర, చిక్కుడు, గుమ్మడి, పాలకూర, తోటకూర, పుదీనా మొక్కలను సులభంగా పెంచుకోవచ్చు. కుటుంబసభ్యులందరూ ఇష్టంగా తినే కూరగాయలను పండించడం సంతోషంగా అనిపిస్తుంది. కూరగాయల విత్తనాలను నేరుగా మట్టిలో వేసి మొక్కలు పెంచవచ్చు. అయితే విత్తనాల ప్యాకెట్ల మీద సూచించిన లోతు, దూరం నిబంధనలను కచ్చితంగా పాటించాలి. లేదంటే నర్సరీల నుంచి చిన్న మొక్కలను తెచ్చి నాటుకోవచ్చు.
- కూరగాయలు, ఆకుకూరల మొక్కలు ఏపుగా పెరగడానికి మట్టి నాణ్యత తప్పనిసరి. మొక్కలకు కావాల్సిన పోషకాలు మట్టి నుంచే అందుతాయి. కాబట్టి మట్టిలో సేంద్రీయ ఎరువులు, కోకోపిట్ లాంటివి కలపడం ప్రయోజనకరంగా ఉంటుంది.
- మొక్కలకు క్రిమి కీటకాలు చేరకుండా తరచూ వేప నీళ్లు, పసుపు నీళ్ల పిచికారీ చేస్తూ ఉండాలి.

కలిసికట్టుగా బండ్లు నడిపిస్తున్నారు!

పెట్రోల్ బంక్‌లో మహిళా సిబ్బంది కనిపించడమే అరుదు. కానీ స్వయంగా పెట్రోల్ బంక్ నిర్వహిస్తూ లాభాలు ఆర్జిస్తూ... కొత్త వ్యాపారాలకు ప్రణాళికలు వేస్తున్నారు నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు. దేశంలోనే మొదటిసారిగా ఒక మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్‌బంక్‌గా ఇది గుర్తింపు పొందింది.



మహిళలకు అవకాశం కల్పిస్తే ఏ పనినైనా సమర్థవంతంగా చేయగలరని నిరూపిస్తున్నారు తెలంగాణలోని నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు. గత ఫిబ్రవరి 21న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా వారు ప్రారంభించిన పెట్రోల్‌బంక్ లాభాల బాటలో దూసుకుపోతోంది. మహిళలే నిర్వహించేలా ఒక పెట్రోల్ బంక్‌ను కేటాయించడం విశేషమే. దీని వెనుక కథేమిటంటే... రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సమస్య వివిధ అంశాలపై అధ్యయనం చేసి, దాన్ని ముఖ్యమంత్రికి సమర్పించారు. దానిలోని అంశాల ఆధారంగా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సీఎం అనుమతించారు. ఈ నేపథ్యంలో... నారాయణపేట జిల్లా కేంద్రంలోని సింగారం చౌరస్తాలో... డీఆర్‌డీఏ కార్యాలయం దగ్గర 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని అధికారులు కేటాయించారు. కిందటి ఏడాది సెప్టెంబర్‌లో భారత్ పెట్రోలియం సంస్థతో జిల్లా మహిళా సమాఖ్య ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం... 20 ఏళ్ల పాటు నెలకు రూ.20 వేల అద్దె ప్రాతిపదికన సమాఖ్య ఈ పెట్రోల్ బంక్‌ను నిర్వహిస్తుంది. స్థలం రాష్ట్ర ప్రభుత్వానిది కాగా, మిగిలిన నిర్మాణపనులను భారత్ పెట్రోలియం సంస్థ పూర్తి చేసింది. దీనికి రూ1.3 కోట్లు ఖర్చు చేశారు. మహబూబ్‌నగర్-యాద్గిర్ (కర్ణాటక) అంతర్రాష్ట్ర రహదారిలో ఏర్పాటైన ఈ పెట్రోల్ బంక్‌ను ఈ ఫిబ్రవరిలో సీఎం ప్రారంభించారు.

కొనుగోళ్లు, నిర్వహణ అంతా వారే...

ఈ బంక్‌ను సమాఖ్యకు చెందిన 11 మంది మహిళలు నిర్వహిస్తున్నారు. డీజిల్, పెట్రోలు కొనుగోళ్ల తదితరాలను వారే నిర్వహిస్తున్నారు. మేనేజర్‌కు నెలకు రూ.18 వేలు, పదిమంది మహిళలకు నెలకు రూ.13 వేలు చొప్పున, వాచ్‌మేన్‌కు రూ.6 వేలు వేతనంగా సమాఖ్య చెల్లిస్తోంది. నిర్వహణకోసం సమాఖ్య ద్వారా రూ. 35 లక్షలు పెట్టుబడి పెట్టినట్టు సభ్యులు తెలిపారు. వేతనాలు, నిర్వహణ ఖర్చులు పోనూ గత ఆరు నెల్లో ఈ బంక్ రూ.13.58 లక్షల లాభాన్ని సంపాదించింది. కాగా... ప్రస్తుతం సీఎన్‌జీ గ్యాస్ అందించడం లేదా టీ, టిఫిన్ పాయింట్ ఏర్పాటు చేయడం గురించి ఆలోచించాల్సిందిగా సభ్యులకు కలెక్టర్ సంచిత్ సంగ్వార్ చూపించారు. దీంతో మరికొంతమంది మహిళలకు ఉపాధి కల్పించడానికి సమాఖ్య ప్రణాళిలకు వేస్తోంది.

- శ్రీధర్ రావు, నారాయణపేట

మొదట్లో ఇబ్బందులు పడ్డాం



మొదట్లో పెట్రోల్, డీజిల్‌ను వాహనాలకు వెయ్యడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కొన్నిరోజుల తర్వాత అలవాటు కావడంతో ప్రస్తుతం సాఫీగా పనులు సాగిస్తున్నాం. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విధులు నిర్వహిస్తున్నాం.

- అనిత, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి, నారాయణపేట

మహిళల ఆర్థిక ఎదుగుదలకు దోహదం



మహిళలు వంటింటికే పరిమితం కాదని మా సమాఖ్య నిరూపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో పెట్రోల్ బంకు నిర్వహణ చేపట్టాం. 11 మంది మహిళలు కష్టపడి పని చేస్తున్నారు. మా బంక్‌కు జాతీయ స్థాయి పేరురావడం సంతోషంగా ఉంది. ఈ ఆగస్టులో ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొని ప్రధాని నరేంద్రమోదీని కలుసుకున్న సందర్భాన్ని మరచిపోలేం.

- చంద్రకళ, పెట్రోల్ బంకు మేనేజర్, నారాయణపేట

అందం పెరిగేందుకు...




ప్రతిఒక్కరూ అందంగా కనిపించాలని కోరుకుంటూ ఉంటారు. అందుకోసం ఖరీదైన క్రీములు, ఫేస్ ప్యాక్‌లు, మేకప్ ఉత్పత్తులు వాడుతూ ఉంటారు. అలా చేసే బదులు చిన్న చిట్కాలు పాటించి అందం, ఆరోగ్యాలతో మెరిసిపోవచ్చంటున్నారు నిపుణులు. ఆ వివరాలు...

- రోజూ సాధ్యమైనంత ఎక్కువగా మంచినీళ్లు తాగాలి. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు దాహం అనిపించకపోయినా కొన్ని నీళ్లు తాగుతూ ఉండాలి. తరచూ పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, సూప్‌లు తాగాలి. అప్పుడే శరీరం తేమగా ఉంటుంది. చర్మం, శిరోజాలు మెరుస్తూ ఉంటాయి. మొటిమలు, గుల్లల సమస్య తీరుతుంది.
- ఒక బకెట్ నీళ్లలో రెండు గుప్పెళ్ల వేపాకులు వేసి బాగా మరిగించాలి. ఈ నీటితో స్నానం చేస్తే చర్మం నిగనిగలాడుతుంది. ఎలాంటి చర్మ సమస్యలూ దరి చేరవు.
- టమాటా, బొప్పాయి, లేత కొబ్బరి, శనగపిండి తదితరాల్లో ఒకదాన్ని ఉపయోగించి తయారుచేసిన ఫేస్ ప్యాక్‌ను ముఖానికి పట్టించి అరగంటసేపు ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని కడిగేసుకుంటే పిగ్మెంటేషన్, మొటిమల మచ్చలు, సన్నని ముడుతలు మాయమవుతాయి. బయట తిరిగే వారు తరచూ ముఖానికి ఆవిరి పట్టడం మంచిది. దీనివల్ల చర్మ రంధ్రాలు తెరచుకుని శుభ్రపడతాయి. దుమ్ము, ధూళి తొలగిపోయి ముఖం ప్రకాశవంతంగా మారుతుంది.
- రోజూ తాజా పండ్లు, ఆకుకూరలు, కూరగాయలను తీసుకోవాలి. అప్పుడే కళ్లు, గోళ్లు, చర్మం, శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి.
- తలస్నానం తరవాత ఒక మగ్గు నీటిలో రెండు చెంచాల నిమ్మరసం కలిపి తలకు పట్టించాలి. దీనివల్ల కుదుళ్లు గట్టిపడి జుట్టు రాలడం తగ్గుతుంది. కండిషనర్‌ను ఉపయోగిస్తే జుట్టు నల్లగా ఒత్తుగా కనిపిస్తుంది.
- పేరిన నెయ్యి లేదా కొత్తిమీర రసం రాస్తుంటే పెదాల నలుపు తగ్గుతుంది. తరచూ కొబ్బరినూనెతో మర్దన చేయడం వల్ల కనుబొమ్మలు నల్లగా ఒత్తుగా పెరుగుతాయి.

చిన్ని చేతులు అద్భుతం చేశాయి

శ్రేయోవీ మెహతా నడక రాకముందే అడవుల్ని చుట్టేసింది. అక్షరాలు దిద్దుతూనే కెమేరా చేతపట్టింది. పదేళ్ళ వయసుకే అంతర్జాతీయ స్థాయి వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ పోటీలో రన్నర్-అప్‌గా గెలిచింది. వచ్చే నెల లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియంలో జరిగే ప్రదర్శనకు సిద్ధమవుతోంది. తనకు ప్రకృతితో, కెమేరాతో ఉన్న అనుబంధం గురించి శ్రేయోవి ఏం చెబుతోందంటే...



"కిందటి ఏడాది లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియంలోకి తొలిసారి అడుగుపెట్టాను. అక్కడ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌ను చూసినప్పుడు ఎంతో ఉద్వేగం చెందాను. ప్రపంచస్థాయిలో గొప్ప ఫొటోగ్రాఫర్లు తీసిన ఛాయాచిత్రాలు నన్ను కళ్ళు తిప్పుకోనివ్వలేదు. 'నా ఫొటోలు కూడా ఈ ప్రదర్శనలో చోటు చేసుకుంటే ఎంత బాగుంటుందో?' అనిపించింది. ఏడాది తిరిగేలోపే ఆ కల నెరవేరబోతోంది. ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగే ఎగ్జిబిషన్‌లో నేను తీసిన ఫొటో ప్రదర్శితం కాబోతోంది.

ఎక్కడికి వెళ్ళినా అది నాతోపాటే...

ప్రకృతి, వన్యప్రాణులు, ఫొటోగ్రఫీ... ఇవంటే నాకు ప్రాణం. ఆ అభిరుచి నాలో కలగడానికి, పెరగడానికి కారణం నా తల్లిదండ్రులు. నాన్న శివాంగ్ మెహతా ప్రొఫెషనల్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్, అమ్మ కోప్నా మెహతా ఒక వైల్డ్‌లైఫ్ ట్రావెల్ కంపెనీ నడుపుతోంది. నేను పుట్టిన కొన్నాళ్ళకే తనతోపాటు నన్నూ టూర్స్‌కు తీసుకువెళ్ళేది. అలా ఊహ తెలియకముందే నాకు ప్రకృతి, వన్య ప్రాణులు పరిచయమయ్యాయి. నాన్న అడవుల్లో తిరిగి ఫొటోలు తీసేవారు. వాటిని చూస్తూ పెరిగిన నాకు కూడా ఫొటోలు తీయాలనే ఆసక్తి మొదలయింది. నాన్న దగ్గర చాలా కెమేరాలు ఉండేవి. నా ఉత్సాహం చూసి... నాలుగేళ్ళ వయసులోనే ఫొటోలు తీయడం అలవాటు చేశారు. ఆరేళ్ళు వచ్చేసరికి నాన్న దగ్గర ఎన్నో మెలకువలు నేర్చుకున్నాను. మొదటిసారిగా ప్రొఫెషనల్ కెమేరాను నాన్న నాకు ఇచ్చారు. అది చాలా బరువుగా ఉండేది. ఫ్రేమింగ్, యాంగిల్స్, కెమేరా సెట్టింగ్స్... అన్నీ తెలుసుకున్నాను. అప్పటి నుంచి ఎక్కడికి వెళ్ళినా నాతోపాటు కెమేరా కూడా ఉండేది. నేషనల్ పార్కులు, సఫారీలకు అమ్మతో నాన్నతో వెళ్ళినప్పుడు... ఎంతో మంది ప్రకృతి ప్రేమికులతో, పర్యావరణవాదులతో పరిచయం ఏర్పడింది. వారిద్వారా ఎన్నో జంతువులు, కీటకాలు, పక్షులు, చెట్ల పేర్లను, వాటి ప్రత్యేకతలను తెలుసుకున్నాను. వన్యప్రాణులను ఫొటోలు తీసేటప్పుడు... వాటి మూడ్స్ గమనించాలని అప్పుడు మరింత బాగా అర్థమయింది. క్రమంగా మా అమ్మ తన ట్రావెల్ కంపెనీతో బాగా బిజీ అయిపోయింది. ఏడాదిలో దాదాపు మూడువందల రోజులు పర్యాటకులను టూర్లకు తీసుకువెళ్ళాల్సి వచ్చేది. దాంతో ఏమాత్రం ఖాళీ దొరికినా నేనూ, నాన్నా ఆమెతో పాటు వెళ్ళేవాళ్ళం. ప్రకృతితో మరింత మమేకం అయ్యే అవకాశం నాకు కలిగింది.



117 దేశాల నుంచి 60 వేల ఎంట్రీలు...

ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్, రాజస్థాన్‌లోని భరత్‌పూర్ నేషనల్ పార్క్‌లకు మేము తరచూ వెళ్ళేవాళ్ళం. నాన్న, నేను పోటీ పడి వన్యప్రాణులను, ఆకర్షణీయమైన ప్రకృతి దృశ్యాలను ఫొటోలు తీసేవాళ్ళం. 2023 నవంబర్‌లో మేము భరత్‌పూర్‌లో ఉన్నాం. ఒక రోజు తెల్లవారుజామున వాకింగ్‌కు బయల్దేరాం. అప్పుడే తెల్లవారుతోంది. చెట్ల గుబుర్ల మధ్యలో రెండు నెమళ్ళు అటూ ఇటూ తిరిగి నిలబడి ఉన్నాయి. నాన్న సూచనతో ఆ దృశ్యాన్ని ఫొటో తీశాను. అది చాలా బాగా వచ్చింది. దాన్ని చూసి అమ్మా, నాన్నా చాలా మెచ్చుకున్నారు. దాన్ని పోటీలకు పంపాలనే ఆలోచన వారికి వచ్చింది. లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియం ప్రతి సంవత్సరం బీబీసీ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ పోటీని నిర్వహిస్తుంది. కిందటి ఏడాది ఆ పోటీకి నేను తీసిన ఫొటోను 'ఇన్ ది స్పాట్‌లైట్' పేరుతో వారు పంపించారు. ఆ పోటీకి 117 దేశాల నుంచి దాదాపు 60 వేలమంది ఎంట్రీలను పంపారు. పదేళ్ళు, అంతకు తక్కువ వయసున్న వారి విభాగంలో 'వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్-2024' రన్నర్-అప్‌గా పురస్కారం నాకు లభించింది.

అది గొప్ప గౌరవం

వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీలో ఆస్కార్ బహుమతిగా గుర్తింపు ఉన్న ఈ అవార్డును... తొమ్మిదేళ్ళ వయసులో నేను అందుకుంటానని ఊహించలేదు. అంతేకాదు... మన దేశం నుంచి ఇది సాధించిన అతి పిన్నవయస్కురాలిని నేనే. అది కూడా మన జాతీయ పక్షుల ఫొటోకు రావడంతో నా ఆనందానికి అవధులు లేవు. దీనంతటి వెనుక నా తల్లితండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది. చదువును, ఫొటోగ్రఫీని బ్యాలెన్స్ చేసుకోవడానికి వాళ్ళు ఎంతో మద్దతు ఇస్తున్నారు. మేము హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఉంటాం. అక్కడే ఆరో తరగతి చదువుతున్నా. వచ్చేనెలలో లండన్‌లో జరిగే ఎగ్జిబిషన్‌లో నా ఫొటో చోటు చేసుకోవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. బాగా చదవాలి. ఫొటోగ్రాఫర్‌గా ఇంకా చాలా నేర్చుకోవాలి. అందుకోసం ఎంతో అభ్యాసం చేయాలి. నా ఫొటోల ద్వారా వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజల్లో అవగాహన కలిగించాలి. ప్రస్తుతం ఇవీ నా లక్ష్యాలు."



పార్లమెంటరీ, అసెంబ్లీల మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సుకు వచ్చిన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు స్వాగతం పలుకుతున్న రాష్ట్ర స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ పురందేశ్వరి తదితరులు, సదస్సుకు హాజరైన మహిళా ప్రజాప్రతినిధులు

మహిళా శక్తికి జై!!

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని అన్నారు. తిరుపతిలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న పార్లమెంటరీ, అసెంబ్లీల మహిళా సాధికార కమిటీల తొలి జాతీయ సదస్సును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సదస్సుకు పార్లమెంటు సహా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీల మహిళా ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓం బిర్లా మాట్లాడుతూ.. మహిళల నేతృత్వంలో సాధించే అభివృద్ధి, చిన్నారుల సంక్షేమాలే 'వికసిత్ భారత్' విధానాలకు పునాదులవుతాయని తెలిపారు. 'నారీ శక్తి వందన్' చట్టమనేది కేవలం ప్రాతినిధ్యం కోసమే కాదని, ప్రజాస్వామ్యంలో మహిళలకు తగినస్థానం కల్పించే దిశగా ఆ చట్టం ఓ చరిత్రాత్మక ముందడుగని అభివర్ణించారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. మహిళా సాధికారత అనేది నిరంతరం కొనసాగాల్సిన ప్రక్రియగా పేర్కొన్నారు. దీని కోసం కొత్త చట్టాలు, విధానపరమైన సంస్కరణలు జరుగుతూనే ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో పార్లమెంటరీ మహిళా సాధికార కమిటీతోపాటు దేశంలోని 20కి పైగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీల మహిళా కమిటీల సభ్యులు హాజరయ్యారన్నారు.

స్వశక్తీకరణపై చర్చ: హరివంశ్

సదస్సులో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్ మాట్లాడుతూ.. తిరుపతిలో జరుగుతున్న తొలి జాతీయ మహిళా సాధికార సదస్సు మహిళా స్వశక్తీకరణపై లోతైన చర్చలకు వేదికగా నిలిచిందన్నారు. భారత రాజ్యాంగం మహిళల హక్కులకు బలమైన పునాదులు వేసిందన్నారు. పార్లమెంటరీ కమిటీలు... చట్టాల్లో మార్పులు, విధానాల సరళీకరణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో విశేష కృషి చేస్తున్నాయన్నారు. పార్లమెంటరీ మహిళా సాధికార కమిటీ చైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్యం, డిజిటల్ అక్షరాస్యత వంటి రంగాల్లో మహిళలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ద్వారా మహిళలకు ఆరోగ్యం, పోషణ, భద్రత, సామాజిక రక్షణతో పాటు నైపుణ్యాధారిత విద్య వంటి పథకాలు అమలవుతున్నాయని వివరించారు.

సీఎం పర్యటన రద్దు

తిరుపతిలో ఆదివారం ప్రారంభమైన జాతీయ మహిళా సాధికార సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరుకావాల్సి ఉంది. అయితే, ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరే సమయానికి ప్రతికూల వాతావరణం ఉండడంతో ఏవియేషన్ అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో సీఎం తన పర్యటనను రద్దు చేసుకున్నారు.

ఎన్టీఆర్, బాబు మహిళా పక్షపాతులు!: వక్తలు

మహిళా ప్రజాప్రతినిధుల సాధికార కమిటీల జాతీయ సదస్సులో దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్, ప్రస్తుత సీఎం చంద్రబాబు మహిళల అభివృద్ధి కోసం చేసిన కృషిని పలువురు వక్తలు కొనియాడారు. దేశంలోనే తొలిసారిగా మహిళలకు ఆస్తి హక్కు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని స్పీకర్ అయ్యన్న పాత్రుడు అన్నారు. విద్య, ఉద్యోగాల్లోనూ మహిళలకు రిజర్వేషన్లు అమలు చేశారని తెలిపారు. ఆ తర్వాత చంద్రబాబు 30 ఏళ్ల కిందటే మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారని చెప్పారు. మంత్రి పయ్యావుల కేశవ్, డిప్యూటీ స్పీకరు రఘురామకృష్ణరాజు కూడా ఇవే అంశాలను ప్రస్తావించారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ కూడా ఎన్టీఆర్, చంద్రబాబులు.. మహిళాభివృద్ధికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని వివరించారు.

వారికి ఒకే పింఛన్ ఇవ్వాలి... ఓంబిర్లాకు వినతి

పార్లమెంటేరియన్ జీతాలు, పెన్షన్ల చట్టాన్ని సవరించాలని ఉద్యమకారుడు డబ్ల్యూడీ గణేశ్ కోరారు. తిరుపతికి వచ్చిన లోకసభ స్పీకర్ ఓం బిర్లాను ఆదివారం కలసిన ఆయన ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రాల్లో మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పెన్షన్ తీసుకునే ప్రజాప్రతినిధులకు మాజీ ఎంపీ కోటా కింద పింఛను ఇవ్వబోమన్న నిబంధనను చట్టం చేయాలని కోరారు.

శ్రీవారి సేవలో..: మహిళా ప్రజాప్రతినిధుల సాధికార కమిటీల జాతీయ సదస్సుకు వచ్చిన పలువురు ప్రముఖులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, శాసనసభ స్పీకర్ అయన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, రాజ్యసభ సభ్యురాలు సుధా నారాయణమూర్తి, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. కాగా, మహిళలపై శ్రీవారి అనుగ్రహం, ఆశీర్వాదం ఉండాలని ప్రార్థించినట్టు ఎంపీ పురందేశ్వరి తెలిపారు.

చట్టసభల సభ్యులకూ 'నో వర్క్.. నో పే'!

» లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అయ్యన్న వినతి

చట్టసభల సభ్యులకూ 'నో వర్క్- నో పే' విధానం వర్తింపజేయాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపిచ్చారు. ఉద్యోగులు విధులకు గైర్హాజరైతే నో వర్క్-నో పే అంటున్నామని, ఈ విధానం చట్టసభల సభ్యులకు ఎందుకు వర్తించదని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో కొందరు సభ్యులు అసెంబ్లీకి హాజరు కావడం లేదంటూ పరోక్షంగా వైసీపీ సభ్యులనుద్దేశించి అన్నారు. 'ప్రజలు తమ సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడానికి గెలిపిస్తే సభ్యులు సభకే రాకుండా దూరంగాఉండి మాట్లాడడం ఏమిటి? ఆ మాట్లాడేదేదో సభలోనే మాట్లాడవచ్చు కదా! ప్రజాప్రతినిధులు బాధ్యత లేకుండా వ్యవహరించడం సరికాదు. వీరికి నో వర్క్-నో పే విధానం అమలు చేసే దిశగా ఆలోచించాలి' అని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను అయ్యన్న కోరారు. దేశవ్యాప్తంగా అన్ని శాసనసభలూ ఏడాదికి కనీసం 60 రోజులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఏడాదికి 30 నుంచీ 45 రోజులు మాత్రమే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని, ఏడాదిలో 60 రోజులైనా చట్టసభలు పనిచేసేలా దేశంలోని అన్ని అసెంబ్లీలకూ సూచనలు జారీ చేయాలని అయ్యన్న అభ్యర్థించారు.

అభివృద్ధి పథంలో ఏపీ

అంధకారం నుంచి వెలుగుల వైపు రాష్ట్రం.. గాడిలో పెడుతున్న కూటమి ప్రభుత్వం



'సారథ్యం యాత్ర' ముగింపు సభకు హాజరైన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

» 2047 నాటికి విశ్వగురుగా భారత్: జేపీ నడ్డా

విశాఖపట్నం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అంధకారం నుంచి వెలుగు దిశగా తీసుకువెళ్తోందని, అభివృద్ధిలో వెనుకబడిన రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ పరుగులు పెట్టిస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పీవీఎన్ మాధవ్ 'సారథ్యం' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర నిర్వహించారు. ఆదివారం విశాఖపట్నంలోని రైల్వేమైదానంలో 'సారథ్యం యాత్ర' ముగింపు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నడ్డా మాట్లాడుతూ, ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అంధకారంలో కూరుకుపోయిందని, అవినీతి, అసమర్థ, అరాచక పాలన సాగించారని, అభివృద్ధి అడుగంటిందని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అసమర్థ పాలన, వారసత్వ రాజకీయాలు, అవినీతిని ప్రజలు చూశారన్నారు. ఎన్‌డీఏ పాలనలో జవాబుదారీతనం, సమస్యలపై తక్షణ స్పందనను గుర్తించిన ప్రజలు తమకు అండగా ఉంటున్నారని నడ్డా పేర్కొన్నారు.

అభివృద్ధిలో ఏపీ పరుగులు

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పాలనలో సూపర్‌గా ఉందని, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని నడ్డా తెలిపారు. రాష్ట్రంలో వేల కిలో మీటర్ల హైవేల నిర్మాణం జరుగుతోందని, 3,300 గ్రామాలకు రోడ్ల నిర్మాణం, రూ.3,334 కోట్లతో 32 మునిసిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. 15 పోర్టులు, 8 ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తూ అభివృద్ధికి ఏపీ చిరునామాగా మారిందన్నారు. రూ.625 కోట్లతో భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం కొనసాగుతోందన్నారు. ఓర్వకల్లు విమానాశ్రయం అందుబాటులోకి రానుందన్నారు. అమరావతి నిర్మాణానికి సహకారం అందిస్తున్నామన్నారు. అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద రూ.1.85 లక్షల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్, నక్కపల్లి మండలంలో రూ.వేల కోట్లతో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటవుతున్నాయని చెప్పారు. కేంద్రం, రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందని నడ్డా సూచించారు.

అన్నివిధాలా సహకారం

» కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తోందని కేంద్ర పరిశ్రమలు, ఉక్కు శాఖల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. ప్రధాని మోదీకి రాష్ట్రంపై ఎంతో ప్రేమ ఉందని, విశాఖకు వచ్చినప్పుడు రూ.2 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,500 కోట్ల ప్యాకేజీ ఇచ్చి ఆదుకున్న ఘనత ఎన్‌డీఏ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రూ.1.35 లక్షల కోట్లతో నక్కపల్లి ప్రాంతంలో మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తో మేలు: మాధవ్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, బీజేపీని అన్ని ప్రాంతాలకు విస్తరించి, అన్ని వర్గాలకు చేరువ చేసే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా 'సారథ్యం యాత్ర'ను నిర్వహించినట్టు చెప్పారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకు వెళ్తున్నామన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమాన్ని అందించే ఏకైక ప్రభుత్వం ఎన్‌డీఏనని పేర్కొన్నారు.

బీజేపీలో చేరిన పోతుల సునీత

చీరాల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకురాలు పోతుల సునీత బీజేపీలో చేరారు. భర్త సురేష్‌తో కలిసి విశాఖలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా సమక్షంలో ఆమె కాషాయ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సునీత ఏడాది క్రితం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా సమర్పించినా, ఇంకా మండలి చైర్మన్ ఆమోదం లభించలేదు. బీజేపీ కార్యక్రమాలకు ఆకర్షితులమై ఆ పార్టీలో చేరినట్లు సునీత దంపతులు తెలిపారు.


బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సునీత దంపతులు

సీఎం పేరు వాడేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని చెప్పుకొంటున్నాయి. తమ కంపెనీ ప్రమోషన్ కోసం చంద్రబాబు, లోకేశ్ పేర్లు చెప్పి ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్నారు. ఎమ్మెల్యేల పేరు వాడుకుని లబ్ధిదారులకు ఫోన్లు చేస్తున్నారు. ఇందుకు కొందరు అధికారులు కూడా సహకరిస్తున్నారు. మెప్మా అధికారులు వీడియో కాన్ఫరెన్స్, టెలీకాన్ఫరెన్స్, వాట్సాప్ గ్రూపుల ద్వారా కంపెనీలను ప్రమోట్ చేస్తున్నారు. అందులో ఎల్విన్ ఇండస్ట్రీస్ అనే కంపెనీ కూడా ఉంది. గతంలో ఈ కంపెనీకి ప్రచార బాధ్యతలు మాత్రమే ఇచ్చామని నెడ్ క్యాప్ ఎండీ చెప్పగా.. తాము ఎవరినీ ప్రమోట్ చేయడం లేదని మెప్మా మిషన్ డైరెక్టర్ ప్రకటించారు. 'ఆంధ్రజ్యోతి' నిరాధార వార్తలు రాసిందని అక్కసు వెళ్లగక్కారు తప్ప నిజాలను దాచలేకపోయారు. ఇప్పుడు పక్కా ప్రణాళికతో ఎల్విన్ కంపెనీకి నియోజకవర్గాల వారీగా సోలార్ ప్యానల్ బిజినెస్ కల్పించేందుకు మెప్మా అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు.

ప్రైవేటు కంపెనీకి కొమ్ము

దేశవ్యాప్తంగా కోటి మంది ప్రజల ఇళ్లపై సోలార్ విద్యుదుత్పత్తి సాధనాలు ఏర్పాటు చేసేందుకు కేంద్రం పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. దీని కింద రాష్ట్రంలో 17.50 లక్షల మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని కేంద్రం టార్గెట్ పెట్టింది. ఈ స్కీమ్‌పై నెడ్‌క్యాప్‌తో పాటు మెప్మా వంటి ప్రభుత్వ సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సోలార్ విద్యుదుత్పత్తి ప్యానళ్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పడమే వీరి పని. అంతే తప్ప ఫలానా కంపెనీ సోలార్ ప్యానళ్లు తీసుకోండని ప్రచారం చేయకూడదు. కానీ అధికారులు జిల్లా స్థాయిలో అదే పనిచేస్తున్నారు. ఎల్విన్ గ్రూప్‌ను ఊరూవాడా ప్రమోట్ చేస్తున్నారు. ఆ కంపెనీతో కలిసి పనిచేయాలని నెడ్‌క్యాప్ ఆగస్టు 28న మెప్మాకు లేఖ రాసింది. ఈ లేఖ ఆధారంగా ముందుకు వెళ్లాలని కోట్ చేస్తూ మెప్మా డైరెక్టర్ 30వ తేదీన జిల్లా పీడీలకు లేఖలు రాశారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చిన తర్వాత మెప్మా డైరెక్టర్ ఈ నెల 6న మరో లేఖ విడుదల చేశారు. పీఎం-సూర్యఘర్ ప్రచారమే చేయాలని, మహిళలకు ఈ స్కీమ్ ప్రయోజనాలే వివరించాలని పేర్కొన్నారు. కానీ ఆచరణలో జరుగుతున్నది వేరు. ఆగస్టు 30న జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లకు మెప్మా నుంచి వెళ్లిన లేఖను వెనక్కి తీసుకోలేదు. ఈ లేఖను పరిగణనలోకి తీసుకోవద్దన్న ఎలాంటి ఆదేశాలూ జిల్లాలకు వెళ్లలేదు.

బాబు, లోకేశ్ పేర్లు చెప్పి..

కోస్తాంధ్రలో ప్రమోషన్ కోసం కొన్ని ప్రైవేటు కంపెనీలు తమకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ రెఫరెన్స్ ఉందని చెప్పుకొంటున్నాయి. పీఎం-సూర్యఘర్ స్కీమ్‌లో జరుగుతున్న గూడుపుఠాణిపై ఈ నెల 6, 7 తేదీల్లో 'ఆంధ్రజ్యోతి' వార్తలను ప్రచురించింది. ఎల్విన్ అనే ఓ ప్రైవేటు సంస్థతో కలిసి పనిచేయాలన్న ఆయా విభాగాల ఉత్తర్వులను వెలుగులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వ పెద్దలు స్పందించి రెండు శాఖల నుంచి వాస్తవిక నివేదికలు తెప్పించుకున్నారు. ఆ రెండు విభాగాలు తమ తప్పేమీలేదని తప్పించుకున్నాయి. దీంతో ఎలాగైనా ఆ కంపెనికీ మేలు చేయాలనుకున్న అధికారులు కొందరు మరో మాస్టర్ ప్లాన్ వేశారు. నేరుగా జిల్లాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలతో ఆ కంపెనీ ప్రతినిధితో భేటీలు ఏర్పాటు చేయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రెఫరెన్స్‌తో వచ్చారని, కంపెనీకి మంత్రి లోకేశ్ ఆశీస్సులు ఉన్నాయని అధికారులే పరిచయ కార్యక్రమం చేస్తున్నారు. పెద్దల రెఫరెన్స్ ఉందనడంతో ఎమ్మెల్యేలు సైతం మిన్నుకుండిపోతున్నారు. ఆ కంపెనీకే సహకరిస్తామని చెబుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు గురించి అవగాహన ఉన్న కొందరు ఎమ్మెల్యేలు ఓ ముఖ్య అధికారికి ఫోన్ చేసి ఇది నిజమేనా? పెద్ద సార్ ఈ కంపెనీకి రెఫరెన్స్ ఇస్తున్నారా? అని ఆరా తీస్తున్నారు. ఆ అధికారి కూడా అవుననే వారికి చెబుతున్నట్లు తెలిసింది. నిజానికి ఈ ముఖ్య అధికారి అండతోనే అధికారులు ప్రైవేటు కంపెనీకి వత్తాసు పలుకున్నారని తెలిసింది.

ఎమ్మెల్యే ఆఫీసుల నుంచి ఫోన్లు

గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు, నెల్లూరు జిల్లాల పరిధిలో లబ్ధిదారులను ప్రసన్నం చేసుకునేందుకు స్థానిక ఎమ్మెల్యేల ఆఫీసుల నుంచి ఫోన్లు చేసినట్లు తెలిసింది. కంపెనీల ప్రతినిధులకు కొందరు అధికారులు కూడా సహకరిస్తున్నారు. "ఎమ్మెల్యే ఆఫీసు నుంచి మాట్లాడుతున్నాం. ఆ కంపెనీ సోలార్ ప్యానళ్లు తీసుకోండి. ఎమ్మెల్యేగారు అందరికీ చెప్పమన్నారు" అంటూ లబ్ధిదారులను ఓ కంపెనీకి అనుకూలంగా మారుస్తున్నట్లుగా ఫిర్యాదులు అందాయి. పల్నాడుకు చెందిన ఓ కీలక నేతతో సీనియర్ మంత్రి ఆఫీసు నుంచి ఫోన్ చేస్తున్నట్లుగా మాట్లాడారు. కంపెనీల ప్రతినిధులు తాము ఎమ్మెల్యే ఆఫీసు నుంచి ఫోన్లు చేస్తున్నామని లబ్ధిదారులు నమ్మేలా ప్రమోషన్ చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో ఓ వ్యక్తి ఫోన్ చేస్తే, ఎమ్మెల్యే ఆఫీసు నుంచి వచ్చినట్లుగా ట్రూ కాలర్‌లో చూపిస్తోందని ఫిర్యాదుదారులు చెబుతున్నారు.

దేవాన్ష్‌కు ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్ అవార్డు

అమరావతి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు మనవడు, విద్య, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ తనయుడు నారా దేవాన్ష్ అత్యంత క్లిష్టమైన 175 పజిల్స్‌ను వేగంగా పరిష్కరించినందుకు గానూ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు-2025ను అందుకున్నాడు. లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ హాల్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో నిర్వాహకులు దేవాన్ష్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి లోకేశ్ కూడా హాజరయ్యారు. గతేడాది జరిగిన చెక్‌మేట్ మారథాన్‌లో లాస్లో పోల్గార్ ప్రసిద్ధ చెస్ సంకలనం '5,334 ప్రాబ్లమ్స్ అండ్ గేమ్స్' పుస్తకం నుంచి తీసుకున్న 175 క్లిష్టమైన చెక్‌మేట్ పజిల్స్‌ను వేగవంతంగా పరిష్కరించిన దేవాన్ష్ 'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. దీనికోసం అకుంఠిత దీక్షతో శ్రమించిన దేవాన్ష్‌కు.. తల్లిదండ్రులు బ్రాహ్మణి, లోకేశ్‌తోపాటు కోచ్ కె.రాజశేఖర్ రెడ్డి చక్కని ప్రోత్సాహం అందించారు. దేవాన్ష్ ఈ అవార్డును అందుకోవడం చాలా ప్రత్యేకమైనదని, అతని కృషికి ఇది నిజమైన గుర్తింపు అని లోకేశ్ అన్నారు. అతను సాధించిన ఈ ఘనతపట్ల తామెంతో గర్విస్తున్నామని చెప్పారు. మనవడు దేవాన్ష్ సాధించిన విజయం పట్ల సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మెంటార్ల మార్గదర్శకత్వంలో కొన్ని నెలలపాటు నిరంతరాయంగా చేసిన కృషికి ఇది దక్కిన గుర్తింపు అని అన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయండి

» సీఎం చంద్రబాబుకు ఐదుగురు ఎమ్మెల్సీల లేఖ

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు ఐదుగురు ఎమ్మెల్సీలు లేఖ రాశారు. 2024-25కు సంబంధించిన బకాయిలు విడుదల చేయడంతోపాటు, 2025-26కు సంబంధించి ఫీజుల విడుదల క్యాలెండ్ ఇవ్వాలని పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, పి.రాజశేఖర్, వేపాడ చిరంజీవిరావు, కంచర్ల శ్రీకాంత్ కోరారు.

ఇద్దరు పల్నాడు సీఐలపై వేటు

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడులో రెచ్చిపోయిన ఇద్దరు సీఐలపై ఎట్టకేలకు సస్పెన్షన్ వేటు పడింది. 2022 జూన్ 3న దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గూండాలు హత్య చేశారు. ఈ కేసులో పోలీసులు నిందితులను వదిలేయడమే కాకుండా అతడి బంధువులనే నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. దీనిపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. అప్పటి మాచర్ల రూరల్ సీఐ షమీముల్లా, కారంపూడి సీఐ జయకుమార్ కేసు విచారణనే తారుమారు చేసినట్లు తేలింది. దీంతో వారిరువురిని సస్పెండ్ చేశారు. ప్రస్తుతం షమీవుల్లా ఒంగోలు డీటీసీలో, జయకుమార్ బాపట్ల ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ కేసులో అప్పటి గురజాల డీఎస్పీ జయరాం ప్రసాద్, పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డిలపై కూడా చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

తీరు మారాలి!

(మొదటి పేజీ తరువాయి)

పెద్దలు వస్తే వారికి ప్రొటోకాల్ చూడటం! దాదాపు చాలా జిల్లాల కలెక్టర్ల పరిస్థితి ఇంతే. ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర శాఖల కార్యదర్శుల కార్యాలయాలకు నివేదికలు పంపించడమే వారికి ప్రధాన పనిగా ఉంటోంది. ప్రజాక్షేత్రంలోకి వెళ్లడం, సామాన్య, పేద ప్రజలతో మమేకం కావడం, పల్లెనిద్ర చేయడం, సంక్షేమ హాస్టళ్ల సందర్శన, గ్రామీణ ప్రగతిపై స్వీయపర్యవేక్షణ చేయడం అనేది చాలా మంది కలెక్టర్లకు సాధ్యపడటం లేదు. సమయం చాలడం లేదు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు కలెక్టరేట్ తప్ప పల్లెముఖం చూడని అధికారులు కూడా కొందరున్నారు. ఇలాగైతే ప్రజాజీవితంలో, గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో మార్పులు తీసుకొచ్చేదెలా? ప్రతిభావంతులైన కలెక్టర్ల పనితీరు ఎలా బయటకు వస్తుంది? ప్రజలతో మమేకం కాని కలెక్టర్లు, అధికారులతో అభివృద్ధి ఎలా పరుగులు తీస్తుంది? ఆశించిన ఫలితాలు ఎలా వస్తాయి? ఇన్ని ప్రశ్నల నేపథ్యంలో కూటమి సర్కారు నాలుగో విడత కలెక్టర్ల సమావేశాలను సోమవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించేందుకు సన్నద్ధమైంది.

ముఖ్యమంత్రి ఆదేశించినా..

గత సమావేశంలో కలెక్టర్లకు ప్రభుత్వం ఇచ్చిన టాస్కులు, వాటి ఫలితాలపై చర్చతో పాటు రానున్న రోజుల్లో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై తాజా సమావేశంలో చర్చించనున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన మూడు కలెక్టర్ల సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక ఆదేశాలు ఇచ్చారు. పలు కీలక నిర్ణయాలు తీసుకొని వాటిని అమలు చేయాలని ఆదేశించారు. అందులో అత్యంత కీలకమైనవే అమలు కాలేదు. జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి సాగనంపడానికి ప్రధాన కారణాల్లో భూ సమస్య ఒకటి. రీ సర్వే సంబంధిత సమస్యలు రావడం, పాస్‌పుస్తకాలపై జగన్ బొమ్మలేసి తప్పులతడక సమాచారం ఇవ్వడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ప్రభుత్వం మారి 15 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు రాష్ట్రంలో భూ సమస్యలు పరిష్కారం కాలేదు. రైతులకు రాష్ట్ర అధికార చిహ్నంతో కూడిన పాస్‌పుస్తకాలు అందలేదు. భూమి కొలతల సమస్యలు తీరలేదు. సర్వే, సబ్‌డివిజన్ సమస్యలేవీ పరిష్కారం కాలేదు. ఈ విషయాలపై కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటన చేసి, రైతులను కలిసి మాట్లాడిన సందర్భాలు మచ్చుకు ఒక్కటి కూడా లేవు. భూ అక్రమాలపై చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం తొలి సమావేశంలోనే ఆదేశించారు. రెండో సమావేశంలో మరోసారి గుర్తుచేశారు. ప్రస్తుతం నాలుగో సమావేశం జరగబోతోంది. అయినా ఈ విషయంలో ఇటు రెవెన్యూ, అటు ప్రభుత్వంలో ఇసుమంతైనా కదలిక లేదు.

నివేదికలు, గణాంకాలతో కుస్తీలు

ముఖ్యమంత్రి, ఆయన కార్యాలయం, ప్రభుత్వ విభాగాలు కలెక్టర్ల నుంచి ఇబ్బడిముబ్బడిగా నివేదికలు కోరుతున్నారు. వీటిని తయారు చేయించే పనిలో కలెక్టర్లు, అధికారులు నిమగ్నమైపోతున్నారు. ప్రభుత్వం దృష్టికి ఏదైనా సమస్య వచ్చిందంటే చాలు వెంటనే కలెక్టర్ నుంచి నివేదిక కోరుతున్నారు. ఆ నివేదిక రూపొందించడం కోసం కలెక్టర్లు తమ జిల్లా పరిధిలోని అధికారులను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. మరోవైపు ఇదే అంశంపై సంబంధిత విభాగం కార్యదర్శి లేదా విభాగాధిపతి తమకు మరో నివేదిక పంపించాలని కలెక్టర్లను కోరుతున్నారు. అటు ప్రభుత్వానికి, ఇటు సంబంధిత విభాగానికి కలర్ ఫుల్ రిపోర్టు పంపగానే.. ప్రభుత్వం మరి కొన్ని అంశాలపై నివేదికలు కోరుతోంది. దీంతో కలెక్టర్లు వాటిపైనే చాలావరకు దృష్టి కేంద్రీకరించాల్సి వస్తోంది. ఇలా వారంలో ఏడు రోజులూ నివేదికలు, గణాంకాలతో కుస్తీలు పట్టడంతోనే కలెక్టర్లకు సరిపోతోంది. కలెక్టర్లు కోరిన డేటా ఇవ్వడం, నివేదికలు తయారు చేసి అందించడంలోనే జిల్లా స్థాయి అధికారుల పుణ్యకాలం గడిచిపోతుంది. ఇక వారు గ్రామ, పట్టణ ప్రాంతాల సందర్శనకు వెళ్లడం, అక్కడి ప్రజలతో మమేకమవడం, స్థానిక సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కారం చూపడం అనేది ఓ మిథ్యగానే ఉంటోంది. ఓ జిల్లా కలెక్టర్ సమయం చూసుకొని ఏదో ఒక పల్లెకు రాత్రి నిద్రకు వెళ్లి, అక్కడి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేశారా అంటే.. లేదనే సమాధానం వస్తోంది. నిజానికి జీవీఏ లెక్కలు అనేవి రోటీన్‌గా తయారయ్యేవి. ఆ లెక్కలే గ్రామాలు, పట్టణాల అభివృద్ధిని సూచించలేవు. పేదరిక నిర్మూలన, సంక్షేమం, గ్రామ, పట్టణ ఆర్థిక, సామాజిక అభివృద్ధి అసలైన కొలమానాలు. కానీ ప్రభుత్వం జీవీఏ లెక్కలపైనే ఎక్కువ ఫోకస్ పెడుతోంది. దీంతో కలెక్టర్లు, జిల్లా, మండల స్థాయి అధికారులు వీటిపైనే దృష్టిపెడుతున్నారు. వాస్తవానికి జిల్లాకు కలెక్టర్ సర్వోన్నతాధికారి. ప్రభుత్వానికి జవాబుదారీగా ఉంటూనే సొంతంగా ఆలోచించి పనిచేయగలగాలి. కానీ ప్రభుత్వం నుం చి వస్తున్న ఒత్తిళ్లు, నివేదికల టార్గెట్‌లు కొందరు కలెక్టర్లకు శక్తికి మించిన భారంగా ఉంటోంది. రోజులో ఎక్కువ సమయం దీనికే కేటాయించాల్సి వస్తో ంది. దీంతో జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి అధికారులు, సిబ్బందికి దశ, దిశ చేయలేకపోతున్నారని ఓ సీనియర్ ఐఏఎస్ అభిప్రాయపడ్డారు.

కలెక్టర్లు ప్రజల్లోకి వెళ్లాలి

కలెక్టర్లు ఎక్కువగా ప్రజాక్షేత్రంలో ఉండాలి. ప్రజల దగ్గరకు వెళ్లి, వారితో కలిసి పనిచేయాలి. ఆఫీసులకు తక్కువగా పరిమితం కావాలి. నిజమైన సమీక్షలు గ్రామాలు, పట్టణాల అభివృద్ధిని రియల్‌టైమ్‌లో చూపించాలి. అంతేకానీ నిరంతరం మారే జీవీఏ లెక్కల ఆధారంగా నివేదికలతో కుస్తీ పట్టు పట్టమని చెప్పరాదు. అలాంటి వాటిపై దృష్టి పెట్టి విలువైన సమయాన్ని వృథా చేయరాదు. పల్లెలు, పట్టణాల సందర్శన, ప్రజలతో మమేకం కావడం, ప్రజా సమస్యల పరిష్కారం, పల్లె నిద్ర, సంక్షేమ హాస్టళ్ల సందర్శన వంటి వాటిపై కలెక్టర్లకు టాస్కులు ఇవ్వాలి. అభివృద్ధిలో స్పష్టమైన టార్గెట్‌లు ఇవ్వాలి. తనను కలెక్టర్ గమనిస్తున్నారని గ్రామ, మండల స్థాయి అధికారికి భయం ఉండాలి. అలాగే, తనను ప్రభుత్వం వాచ్ చేస్తోందని కలెక్టర్‌కు భయం ఉండాలి. కొందరు కలెక్టర్లు సూపర్ బాస్‌లుగా, తాము జిల్లాకు సీఎం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

- మానవ వనరుల అభివృద్ధి సంస్థ రిటైర్డ్ అధికారి సుబ్బారావు

ఇదీ సమావేశం షెడ్యూల్

సోమవారం ఉదయం 10 గంటలకు సచివాలయంలో కలెక్టర్ల సమావేశం ప్రారంభం కానుంది. ఈసారి 12 మంది కొత్త కలెక్టర్లు సమావేశాలకు రాబోతున్నారు. సీసీఎల్ఏ జి.జయలక్ష్మి తొలిమాటతో సమావేశాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడనున్నారు. కలెక్టర్లను ఉద్దేశించి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడనున్నారు. అనంతరం సీఎంచంద్రబాబు కలెక్టర్లకు ప్రభుత్వ ప్రాధాన్యతలపై దిశానిర్దేశం చేయనున్నారు.

ఏడుగురు నోడల్ అధికారులు

కలెక్టర్ల సమావేశం నిర్వహణ కోసం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ముఖ్యకార్యదర్శి ర్యాంకు అధికారులు ఏడుగురిని అంశాల వారీగా నోడల్ అధికారులుగా నియమించారు. జీఎస్‌డీపీకి ఆర్థిక శాఖ అధికారి పీయూష్ కుమార్, సంక్షేమం, సాధికారతకు ఎంఎంనాయక్, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలకు ఎంటీ కృష్ణబాబు, స్వచ్ఛ భారత్, సర్క్యులర్ ఎకనామీకి శశిభూషణ్‌కుమార్, హెచ్‌ఆర్‌డీ, హెల్త్ సెక్టార్‌కు సౌరభ్‌గౌర్, ఐటీ సర్వీసెస్‌కు కాటమనేని భాస్కర్, ఆదాయార్జన శాఖలకు జి.జయలక్ష్మి నోడల్ అధికారులుగా వ్యవహరించనున్నారు. నోడల్ విభాగాలు, అధికారుల నియామకం ద్వారా కలెక్టర్ల సమావేశంలో తక్కువ సమయంలో ఎక్కువ చర్చ జరిగేలా తొలిసారిగా నోడల్ విధానం తీసుకొచ్చారు. సగటున గ్రూప్‌లోని ఒక్కో శాఖ తన కార్యకలాపాలపై 5 స్లైడ్‌లకు మించని పీపీటీని ప్రదర్శించాల్సి ఉంటుంది. తద్వారా ప్రజెంటేషన్‌ల పేరిట కాలయాపన తగ్గించాలన్నది అసలు లక్ష్యంగా ఉంది.

జీఎస్‌డీపీతో చర్చ ఆరంభం

తొలిరోజు సమావేశంలో సీఎం ప్రసంగం తర్వాత ఆర్థిక అంశాలపై చర్చ జరగనుంది. ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ రాష్ట్ర జాతీయ స్థూల ఉత్పత్తి, ప్రైమరీ, సెకండరీ సెక్టార్, సర్వీసెస్ వంటి కీలక రంగాలపై ప్రజెంటేషన్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2:30 గంటలకు సంక్షేమం, సాధికారతపై చర్చ జరగనుంది. సాయంత్రం 4:15 గంటలకు లాజిస్టిక్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై చర్చ జరగనుంది. 5:45 గంటలకు స్వచ్ఛభారత్, సర్క్యులర్ ఎకాన మీపై అధికారులు ప్రజెంటేషన్‌లు ఇవ్వనున్నారు.



కాకతీయుల పూర్వీకుడు గుండన కొండపల్లి ప్రాంత వాసిగా నిర్ధారిస్తూ తామ్ర ఫలకంపై లిఖించిన శాసనమిది!

కొండపల్లి సీమలో 'కాకతీయం'

(మొదటి పేజీ తరువాయి)

కనుగొన్నారు. విజయవాడ సమీపంలోని కొండపల్లి ప్రాంతంలోని 'కాకర్తి' అనే గ్రామంలోనే 'కాకతీయ గుండన' మూలాలు ఉన్నట్లు నిర్ధారించారు. ఇటీవల తెలంగాణలోని నేలకొండపల్లిలో బయటపడిన రాగిఫలకాల శాసనాలను విశ్లేషించి ఈ నిర్ధారణకు వచ్చారు. అయితే... 'కాకర్తి' పేరుతో ప్రస్తుతం ఈ ప్రాంతంలో గ్రామమేదీ లేదు. కాలక్రమంలో దాని పేరు మారి ఉండొచ్చు. లేదా... ఏదైనా కారణాలవల్ల ఆ గ్రామం కాలగర్భంలో కలిసిపోయి ఉండొచ్చుననే అనుమానాలున్నాయి. ఇప్పుడు చరిత్రకారులు 'కాకర్తి' క్షేత్రస్థాయిలో గుర్తించడంపైనా దృష్టి సారించారు. ఒకప్పుడు 'కొండపల్లి సీమ'లో భాగమైన నందిగామ మండలం మాగల్లు సమీపంలో కాకర్తి (కాకతిపురం, కాకర్త్యపురం) గ్రామం ఉండొచ్చునని పురావస్తు శాస్త్రవేత్త, స్థపతి ఈమని శివనాగిరెడ్డి తెలిపారు.

చారిత్రక ఆనవాళ్లు...

క్రీస్తు శకం 900కి ముందు కాకర్తి ఉండేదని తెలుస్తోంది. కాకతీయ వంశ ఆదిపురుషుడు గుండన కాకర్తిలో నివసించాడని, కాకతీయుల పూర్వీకులు సకలేశ్వర, బిజ్జేశ్వర, గుండేశ్వర వంటి దేవాలయాలను నిర్మించారని ఫలకాలు చెబుతున్నాయి. కొండపల్లి, సమీపంలోని బొజ్జప్రోలు ప్రాంతాలు కాకతీయ రాజవంశం జన్మభూమిగా రాగిఫలకాలు నిర్ధారిస్తున్నాయి. ఈ శాసనాల ప్రకారం కాకతీయుల వంశవృక్షం గుండ-1 (కాకతీయ గుండన), గుండ-2, గుండ-3, ఎర్రలతో మొదలైంది. తర్వాత ఎర్ర కుమారులు బేటియా, గుండయ్య, గోనకలు అధిపతులుగా ఉన్నారు. కొండపల్లి సీమను గుండన, బొజ్జప్రోలును బేటియా పర్యవేక్షించారని శాసనాలు చెబుతున్నాయి. ఇటీవల ఎన్టీఆర్ జిల్లాకు సరిహద్దున ఉన్న నేలకొండపల్లిలో ముస్లిం శ్మశానవాటికలో వేంగి చాళుక్యులకు సంబంధించి 9 సెట్ల రాగి ఫలకాలు లభించాయి. రాగిఫలకాల సెట్లలో వేంగి చాళుక్యుల రాజవంశావళి వివరాలు, ఆలయ దానధర్మాలు ఉన్నాయి. భారత పురావస్తు సర్వే డైరెక్టర్ కె.మునిరత్నం వీటిని ముందుగా అధ్యయనం చేసి ప్రపంచానికి కాకతీయుల జన్మస్థలాన్ని పరిచయం చేశారు. రెండో సెట్ రాగి ఫలకాల్లో క్రీస్తుశకం 918లో చాళుక్య పాలకుడైన రెండో విక్రమాదిత్య పట్టాభిషేకం నేపథ్యంలో కాకతీయుల తొలి వంశావళి గురించి ప్రస్తావించారు. కాకతీయ గుండన కొండపల్లి సీమ వాసి అని ఈ శాసనాల్లో ఉంది. శతాబ్దాల కిందట కొండపల్లి సీమలో వేసిన పునాదుల పైనే కాకతీయ ప్రాభవం నడిచిందని ఇప్పుడు తెలుస్తోంది. కాకతీయుల వారసత్వం క్రీ.శ 972 తర్వాత ఓరుగల్లుకు పాకింది. కాకతీయులు ఓరుగల్లుకు మారటానికి ముందు కొండపల్లి ప్రాంతంలో కీలకంగా వ్యవహరించారు. గుంటూరు జిల్లాలోని ఈపూరు, చందుపట్లలో రుద్రమదేవి మరణానికి సంబంధించిన శాసనాలను కనుగొన్నారు. రుద్రమ తన భర్త చనిపోయినపుడు గుడిమెట్ల కృష్ణానది తీరంలో నిద్ర చేసినట్లు ఆధారాలున్నాయి.

తురకపాలెం కథ

తేలేదెన్నడు..!?

- మొన్న కలుషిత సెలైన్ అంటూ అనుమానం
- నేడు యురేనియం ఆనవాళ్లు తెరపైకి..
- అసలు కారణం గుర్తించడంలో ఆరోగ్యశాఖ విఫలం

అమరావతి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో ఏం జరుగుతోందో అంతుచిక్కడం లేదు..! ఈ గ్రామంలో మూడు నెలల వ్యవధిలోనే 29 మంది మృతిచెందడం సాధారణ విషయం కాదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పేర్కొన్న ప్రకారం వెయ్యి మంది జనాభా ఉన్న గ్రామంలో నెలలో నలుగురు మరణిస్తేనే అనుమానించాలి. దాన్నే హెచ్చరికగా భావించాలి. అలాంటిది మూడు నెలల వ్యవధిలో 29 మంది చనిపోయారంటే.. ఏదో బలమైన కారణం ఉండి ఉండాలి. అదేమిటో గుర్తించాలి. కానీ.. ఈ విషయంలో స్థానిక ఆరోగ్యశాఖ పూర్తిగా విఫలమైంది. మీడియా వెలుగులోకి తీసుకొచ్చే వరకూ అధికారులు ఆ గ్రామాన్ని పట్టించుకోలేదు. ఇక్కడ మిస్టరీ మరణాలకు ఒక్కొక్కరూ ఒక్కో కారణం చెబుతున్నారు కానీ.. అసలు కారణమేంటో తేల్చలేకపోతున్నారు. తొలుత జ్వరాలకు మోలియోయిడోసిస్ ఇన్ఫెక్షన్ కారణమన్నారు. మొన్న కలుషిత సెలైన్ వల్లే అని అనుమానించారు. తాజాగా యురేనియం అంటూ.... ఎవరికి తోచింది వారు చెబుతూ గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ మరణాలకు కారణమేంటో తేల్చేందుకు ప్రభుత్వం నియమించిన హైపవర్ కమిటీ కూడా ఇప్పటివరకూ నివేదిక ఇవ్వలేదు. ఐసీఏఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్), ఎన్‌సీడీసీ (నేషనల్ కమ్యూనికబుల్ డిసీజ్ కౌన్సిల్) నుంచి ఇప్పటి వరకూ నివేదికలు కాలేదు. ఇదే సమయంలో గుంటూరు మెడికల్ కాలేజీ వైద్య బృందం కూడా కొన్ని శాంపిల్స్‌ను పరీక్షించింది. ఐసీఏఆర్, ఎన్‌సీడీసీతోపాటు గుంటూరు మెడికల్ కాలేజీ వైద్య బృందం సమర్పించే నివేదికను క్రోడీకరించి డాక్టర్ ఏ సిరి కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంది. అప్పటివరకూ మిస్టరీ మరణాల వెనుక కారణాలు బయటకు రావని నిపుణులు అంటున్నారు.

యురేనియం కాదు..: ఆరోగ్యశాఖ

తురకపాలెం మరణాలు నీటిలో యురేనియం కలవడం వల్ల సంభవించినవి కాదని ఆరోగ్యశాఖ స్పష్టంగా చెబుతోంది. నీటిలో యురేనియం 0.3 శాతంపైన ఉంటేనే ప్రమాదమని, తురకపాలెంలో సేకరించిన నీటిలో 0.001 శాతమే గుర్తించినట్లు తెలిపింది. దీనివల్ల పెద్దగా ప్రమాదం ఉండదన్నారు. మరోవైపు ఆరోగ్య శాఖ పరిధిలో ఉండే నిఘా వ్యవస్థ పూర్తిగా విఫలమైంది. తురకపాలెంలో 29 మంది మరణిస్తే, విజయవాడ సింగ్‌నగర్‌లో 151 మంది డయేరియా బారినపడ్డారు. శ్రీకాకుళం జిల్లా, లావేరు మండలంలోని కొన్ని గ్రామాల్లో ప్రజలకు అకస్మాత్తుగా మోకాళ్ల సమస్యలు వస్తున్నాయి. మొన్న పాడేరు సమీపంలోని కొన్ని గ్రామాల్లో వంద మందికిపైగా ఆస్పత్రి పాలయ్యారు. రాష్ట్రంలో ఎక్కడ అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే ఆరోగ్యశాఖలోని ఐడీఎస్‌పీ (ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వేలెన్స్ ప్రొగ్రామ్) స్పందించి.. వాటికి కారణాలు గుర్తించాలి. కానీ ఈ విషయంలో ఐడీఎస్‌పీ వెనుకబడింది. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంల పనితీరు కూడా సక్రమంగా ఉండడం లేదు. ఈ నేపథ్యంలో సర్వేలెన్స్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

పరిమిత స్థాయిలోనే యురేనియం: కలెక్టర్ అన్సారియా

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తురకపాలెం గ్రామంలోని నీటి వనరుల్లో యురేనియం పరిమితికి లోబడే ఉందని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదివారం స్పష్టం చేశారు. తురకపాలెంలో వరుస మరణాలు సంభవించిన నేపథ్యంలో సెకండరీ హెల్త్ సంచాలకురాలు డాక్టర్ సిరి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ గ్రామంలోని నీటి వనరులు, మరణించిన వారి ఇళ్లలోని బోరు బావుల నుంచి 8 నీటి నమూనాలు సేకరించినట్లు కలెక్టర్ తెలిపారు. వాటిని పరీక్షించగా.. 4 నమూనాల్లో యురేనియం ఆనవాళ్లు అనుమతించిన పరిమితి లోపలే నమోదయ్యాయని స్పష్టం చేశారు. బయాలజికల్ కాలుష్యం నియంత్రణ కోసం గ్రామానికి ట్యాంకర్ల ద్వారా మంచి నీటి సరఫరా జరుగుతోందని వివరించారు.





ఆడపిల్లల భద్రతపై జరిగిన సదస్సులో మాట్లాడుతున్న హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, కార్యక్రమానికి హాజరైన న్యాయమూర్తులు, న్యాయవాదులు

బాలికలు భారం కాదు.. ఆస్తి

- పిల్లల మధ్య లింగభేదాలు చూపించొద్దు
- టీనేజర్లకు పోక్సో, ఇతర చట్టాలపై అవగాహన కల్పించాలి: హైకోర్టు సీజే

అమరావతి/విజయవాడ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలికలు భారమనే ఆలోచన నుంచి తల్లిదండ్రులు బయటకు రావాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ అన్నారు. ఆడపిల్లలు భారం కాదని, వారు మన ఆస్తి అని పేర్కొన్నారు. తల్లిదండ్రుల బాగోగులు చూసుకునే విషయంలో మగపిల్లల కంటే ఆడపిల్లలే మరింత మెరుగ్గా ఉన్నారని తెలిపారు. పిల్లల మధ్య తల్లిదండ్రులు ఎలాంటి లింగభేదాన్ని చూపించకుండా సమానత్వం చూపించాలని, ఆడ, మగ సమానమనే భావన ఉండాలని అన్నారు. బాలికల సంరక్షణకు సంబంధించిన చట్టాలపై టీనేజ్ యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. పోక్సో, ఇతర చట్టాలపై అవగాహన లేక యుక్త వయసులో చేసిన తప్పులకు వారు భవిష్యత్ కోల్పోతున్నారని చెప్పారు. విజయవాడ తమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా బాలికల సంరక్షణ అంశంపై రాష్ట్రంలోని వివిధ రంగాల భాగస్వాములతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ(జేజేసీ) ఆదివారం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించింది. జస్టిస్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయన, ప్రత్యేక అతిథిగా హాజరైన జస్టిస్ రేవతి మోహితి దరే, జేజేసీ ఛైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హరీ, సభ్యులు జస్టిస్ వి.సుజాత, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ కిరణ్మయి మండవ, జస్టిస్ చల్లా గుణరంజన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అంతకుముందు బెథనీ చిల్డ్రన్ హోమ్ బాలికలు సీజే, జస్టిస్ రేవతి మోహితి దరే, జేజేసీ ఛైర్మన్, సభ్యులకు మొక్కలు బహూకరించారు. ఈ సందర్భంగా సీజే మాట్లాడారు. 'రాష్ట్రంలో బాలికలు, బాలుర అక్షరాస్యత విషయంలో వ్యత్యాసం కొనసాగుతోంది. గణాంకాలు పరిశీలిస్తే బాలుర అక్షరాస్యత 73 శాతం ఉంటే, బాలికలది 59 శాతంగానే ఉంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అందిస్తున్న ప్రోత్సాహకాలతో జూనియర్ సివిల్ జడ్జి నియామకాల్లో ఇటీవల మహిళా న్యాయాధికారుల సంఖ్య పెరిగింది. ఆడబిడ్డ భారం కాదు.. ఆస్తి అని తల్లిదండ్రులు గుర్తించిన కారణంగానే ఈ మార్పు సాధ్యమైంది. క్రైం బ్యూరో రిపోర్ట్‌ను పరిశీలిస్తే.. కుటుంబ సభ్యులకు బాగా సన్నిహితంగా మెలిగేవారే బాలికలపై అకృత్యాలకు పాల్పడుతున్నారని స్పష్టమవుతోంది. బయటివారి నుంచే కాకుండా వక్ర బుద్ధితో ఉన్న సన్నిహితుల నుంచీ వారిని కాపాడుకోవలసిన అవసరం ఉంది' అని తెలిపారు. చిన్నారుల రక్షణ విషయంలో ఉన్న టోల్ ఫ్రీ నంబర్ 1098 పనితీరును ఆయన ప్రశంసించారు. సదస్సులో పలువురు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

బాలురతో సమానంగా అవకాశాలు: జస్టిస్ రేవతి



జస్టిస్ రేవతి మాట్లాడుతూ.. బాలురతో సమానంగా బాలికలకూ సమాన అవకాశాలు కల్పించాలని, వారికి సురక్షిత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టంచేశారు. పోక్సో, బాల్యవివాహ నిషేధ చట్టం, ఇతర చట్టాల అమలు విషయంలో పోలీసు అధికారులు, న్యాయాధికారులు మరింత సున్నితత్వంతో వ్యవహరించినప్పుడే బాలికలు ధైర్యంగా ముందుకొచ్చి వారికి జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. బాలికల కలలను ఆదిలోనే తుంచివేయకుండా.. అవి సాకారమయ్యేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జేజేసీ ఛైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హరీ తెలిపారు. 'అమ్మాయిలను రక్షించడం దాతృత్వం కాదు. దేశ పురోగతికి అది పెట్టుబడి' అని వివరించారు. బాలిక అంటే ఓ కుమార్తె కాదని, సమర్థ నాయకురాలు, శిక్షకురాలు, సృష్టికర్త, వినూత్న వ్యక్తి అని జస్టిస్ వి.సుజాత తెలిపారు.

తిరుపతిలో అత్యాధునిక బస్‌స్టేషన్

- లక్షమంది ప్రయాణికులకు అనుగుణంగా నిర్మాణం
- ఒకేసారి 150 బస్సులు నిలిపేందుకు వీలుగా బస్ బే
- ఎలక్ట్రిక్ బస్సులకు చార్జింగ్ కోసం సోలార్ రూఫ్ టాప్
- హెలిప్యాడ్, రోప్‌వే, కమర్షియల్ మాల్స్, మల్టీప్లెక్స్‌లు
- సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

అమరావతి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుపతిలో పెరుగుతున్న యాత్రికుల రద్దీకి అనుగుణంగా అత్యాధునిక బస్ స్టేషన్ నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. రోజుకు సుమారు లక్ష మంది ప్రయాణికుల రాకపోకలకు వీలుగా, సౌకర్యంగా ఉండేలా నిర్మించనుంది. ఒకేసారి 150 బస్సులు నిలిపేందుకు వీలుగా బస్ బేతో పాటు రెండు ఎంట్రీలు, రెండు ఎగ్జిట్లు, ఎలక్ట్రిక్ బస్సులకు చార్జింగ్ సౌకర్యం, అందుకు సరిపడా విద్యుత్తు కోసం సోలార్ రూఫ్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, ఆర్టీసీ ధికారులతో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా తిరుపతికి వచ్చే భక్తులు, బస్సుల సంఖ్య, ప్రస్తుత బస్టాండ్ సామర్థ్యం గురించి చర్చించారు. 13 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబోయే కొత్త బస్ స్టేషన్‌కు సంబంధించిన ఐదు నమూనాలను సీఎం పరిశీలించారు. హెలిప్యాడ్, రోప్‌వే, కమర్షియల్ మాల్స్, మల్టీప్లెక్స్‌లతో డిజైన్లు రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని బస్ స్టేషన్లు ఆధునికీకరించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.



జలమయమైన గుంటూరు విద్యానగర్ మెయిన్ రోడ్డులో వాహనదారుల ఇక్కట్లు

మొదలైన నైరుతి నిష్క్రమణ

- మూడు రోజులు ముందుగానే..
- 20న మరో అల్పపీడనం?

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అంచనాలకు మించి వర్షాన్ని ఇచ్చిన నైరుతి రుతుపవనాలు ఆదివారం పశ్చిమ రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల నుంచి నిష్క్రమించాయి. సాధారణంగా సెప్టెంబరు 17న ఆ ప్రాంతం నుంచి నిష్క్రమించాల్సి ఉంది. అక్కడ అధికపీడనం ఏర్పడడం, గడచిన ఐదు రోజుల నుంచి అక్కడ వర్షాలు లేకపోవడం, గాలిలో తేమ శాతం తగ్గడం తదితరాలను పరిగణనలోకి తీసుకొని 3 రోజులు ముందే నిష్క్రమించాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. గతేడాది సెప్టెంబరు 23న రుతుపవనాలు నిష్క్రమణ ప్రారంభమై అక్టోబరు 15 నాటికి దేశం నుంచి పూర్తిగా వైదొలిగాయి. 2015లో సెప్టెంబరు 4న, 2016లో సెప్టెంబరు 15న నిష్క్రమణ ప్రారంభమైంది. ఈ ఏడాది మే 24న కేరళలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు.. జూన్ 29వ తేదీకల్లా దేశవ్యాప్తంగా విస్తరించాయి. నాలుగు నెలల రుతుపవనాల సీజన్‌లో భాగంగా జూన్ 1 నుంచి సెప్టెంబరు 14 వరకు 790.1 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, 846.4 మి.మీ.(7 శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది.

నేడు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం పశ్చిమ వాయవ్యంగా పయనించి ఉత్తర తెలంగాణ, విదర్భ పరిసరాల్లో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో ఆదివారం కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు, మధ్యకోస్తా జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. మరోవైపు ఆదివారం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. కొన్ని మోడళ్ల మేరకు ఇది 20వ తేదీకి అల్పపీడనంగా మారనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.



గుంటూరు రైల్వేస్టేషన్‌లో పట్టాలపైకి చేరిన నీరు

గుంటూరు జలమయం

- నీట మునిగిన రోడ్లు, కాలనీలు
- రైల్వేస్టేషన్‌లోకీ నీరు.. రైళ్లు ఆలస్యం

గుంటూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వరుసగా రెండో రోజూ(ఆదివారం) గుంటూరులో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3.30 నుంచి సుమారు గంటన్నరపాటు కుండపోతగా వాన కురవడంతో నగరమంతా నీట మునిగింది. శనివారం కురిసిన భారీ వర్షానికే చాలా ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. ఆదివారం కూడా కుండపోతగా వర్షం కురవడంతో జనజీవనంపై మరింత ప్రభావం పడింది. ప్రధాన రహదారులతో పాటు కాలనీలు నీట మునిగాయి. సెల్లార్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల్లోకి డ్రెయిన్లలోని నీరు ఉధృతంగా ప్రవహించడంతో కార్లు, ద్విచక్ర వాహనాలు నీట మునిగాయి. బ్రాడీపేట, లక్ష్మీపురం ప్రాంతాల్లో చెట్లు కూలి కార్లపై పడ్డాయి. కంకరగుంట, మూడొంతెనల ఆర్‌యూబీల కింద భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. గుంటూరు రైల్వేస్టేషన్‌లోకి కూడా వరద నీరు చేరడంతో కొన్ని రైళ్లను ఆలస్యంగా నడిపారు. కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలు, మెడికల్ కాలేజ్, జీజీహెచ్, కలెక్టర్ నివాసంలోకి కూడా వరదనీరు ప్రవహించింది. వర్షం ఆగిన తర్వాత ఒక్కసారిగా వాహన చోదకులు రోడ్లపైకి రావడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయింది.

గోదావరిలో 6 లక్షల క్యూసెక్కుల వరద

పోలవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గోదావరి నీటిమట్టం ఆదివారం అనూహ్యంగా పెరిగింది. పోలవరం నుంచి 6,05,754 క్యూసెక్కులను దిగువకు విడుదల చేసినట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.